# ప్రజావిముక్తి

సీ.పీ.ఐ (మావోయిస్టు), తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార పత్రిక

సంపుటి: 6 సంచిక: 2 మే – ఆగస్టు, 2021

విషయ సూచిక

1. ధరణి పోర్టల్
2. మూడు సాగు చట్టాలు
3. సింగరేణి
4. అడవి - ఆదివాసులు
5. సిద్ధాంత వ్యాసం
6. అమరుల జీవిత చరిత్ర
7. డాక్టర్ సలహాలు
8. పోరాట వార్తలు
9. జంపన్న లేఖకు సమాధానం
10. కరోనా వైరస్

## ప్రజా యుద్ధ సేనాని, ఉత్తమ ఆర్గనైజర్ కేంద్ర కమిటీ సభ్యుడు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ యాపనారాయణ (హరిభూషన్, లక్మ)కు విప్లవ జోహార్లు !!

కామ్రేడ్ యాప నారాయణ (కామ్రేడ్ లక్మదా, హరిభూషన్) 50 సంవత్సరాల జీవితంలో 30 సంవత్సరాలుగా భారత విప్లవోద్యమంలో అవిరళ కృషి జరుపుతూ, జూన్ 21, 2021న ఉదయం 9 గంటలకు కరోనా మహమ్మారితో పోరాడుతూ తన తుదిశ్వాస వదిలాడు. ఆయన సీ.పీ.ఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యుడుగా బాధ్యతలు నిర్వహిస్తూనే, తెలంగాణ పార్టీ కార్యదర్శిగా కూడ పని చేసాడు. తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాలు విజయవంతంగా ముగించి, తీర్మాణాలు రాస్తున్న క్రమంలో తీవ్ర జ్వరానికి గురైనాడు. అయినప్పటికీ తీర్మాణాలు రాయడం, కామ్రేడ్స్‌కు గైడెన్స్ ఇవ్వడం కొనసాగిస్తూనే ఉన్నాడు. ఆయనకు దీర్ఘకాలంగా ఆస్తమా, బ్రాంకైటీస్, రక్తపోటు వ్యాధులతో ఇబ్బందిపడుతూ ఉన్నాడు. ఆ వ్యాధులకు మందులు వాడుతూనే ఉన్నాడు. కానీ వ్యాధులు నయంకాకపోగా అవి ముదిరాయి. తీవ్రజ్వరం, శ్వాస సమస్య పెరగడంతో, కరోనా కావచ్చునేమో అనే అనుమానంతో స్వాబ్ పరీక్ష చేయించుకోగా కరోనా అని తేలింది. కరోనాకు మందులు వాడుతూ కృత్రిమ ఆక్సిజన్ అందిస్తున్న క్రమంలో శ్వాస సమస్యతోపాటు, గుండెపోటుతో ఆయన అమరత్వం చెందాడు. విప్లవోద్యమంలో క్రియాశీల భూమిక పోషించిన యువ నాయకుడి మరణం దేశవ్యాప్త విప్లవోద్యమానికి, ముఖ్యంగా తెలంగాణ విప్లవోద్యమానకి తీరనిలోటు. ఆయన ఆశయాలను తుదికంటా కొనసాగిద్దామని శపథం చేద్దాం.



### కామ్రేడ్ యాప నారాయణ కుటుంబ నేపథ్యం–చదువు

కామ్రేడ్ యాప నారాయణ మడగూడ గ్రామంలో ఒక ఆదివాసీ కుటుంబంలో రంగయ్య, పున్నమ్మ దంపతులకు పెద్ద కుమారుడిగా జన్మించాడు. ఆయన తదుపరి ఆ దంపతులకు ముగ్గురు మగపిల్లలు, ముగ్గురు ఆడపిల్లలు జన్మించారు. కామ్రేడ్ యాప నారాయణ చిన్ననాటి నుంచి విద్యభ్యాసం చేయడమే కాక, సంతానంలో పెద్దవాడిగా తమ్ముళ్ళనూ, చెల్లెల్లను చదువుకోమని ప్రోత్సాహించి హాస్టళ్ళకు పంపించేవాడు. అలా తమ్ముళ్ళు, చెల్లెల్లు మంచి చదువులే చదువుకోగలిగారు. ఉమ్మడి వరంగల్ జిల్లా (ప్రస్తుత మహబూబబాద్ జిల్లా)లో అటవీ ప్రాంతంలో మారుమూల పల్లె అయిన మడగూడెంలో ఎలాంటి రోడ్డు, కరెంట్ సౌకర్యం లేని గ్రామంలో నారాయణ జన్మించినప్పటికీ, ఆ ఆటంకాలన్నీ ఎదుర్కొని పట్టుదలగా విద్యాభ్యాసాన్ని కొనసాగించాడు.

కామ్రేడ్ యాప నారాయణ తల్లిదండ్రులు ఆయన్ని ఎంతో ప్రేమగా పెంచారు. వారు పేదరికం అనుభవిస్తున్నప్పటికీ, నారాయణకు విద్యాభ్యాసం చేయించారు. తల్లిదండ్రుల, మిత్రుల, టీచర్ల సహకారంతో బీ.ఏ (డిగ్రీ) పూర్తి చేసాడు.ఆనాటికి ఆదివాసుల్లో డిగ్రీలు పూర్తి చేయడమంటే గొప్ప విషయమే. ప్రాథమిక విద్యను మడగూడెంలో, ఇంటర్మీడియట్ నర్సంపేటలో, 1988లో డిగ్రీ (బీఎ)ని, హన్మకొండలోని ఆర్ట్స్ అండ్‌సైన్స్ కళాశాలలో పూర్తి చేశాడు. డిగ్రీ ద్వితీయ సంవత్సరంలో ఉన్నప్పుడు ఎల్ఐసీ ఏజెంటుగా పని చేశాడు. డిగ్రీ పూర్తి చేసిన తర్వాత, కొంత కాలం ఐటిడిఏలో మైనర్ ఇరిగేషన్ విభాగంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశాడు. విప్లవ భావాలు కలిగిన కామ్రేడ్ హరిభూషణ్ వర్గ స్పృహతో కూడిన విశాల సేవా దృక్పథంతో పేదలకు ఎన్నో సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాడు.

ఐటిడిఎ ద్వారా ఇండ్లు లేని వారికి ఇండ్లు నిర్మించి ఇవ్వడం, తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న ప్రజలకు త్రాగు నీటి సౌకర్యం కల్పించడం వంటి పలు ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించే వాడు. కా. హరి భూషణ్ చేసిన ప్రజా సేవను స్థానిక ప్రజలు ఇప్పటికీ మరిచి పోలేదు. తను ప్రజలతో వున్న క్షణాలను వారు ఎప్పటికీ గుర్తు చేస్తూంటారు.

ప్రేమమూర్తి అయిన తల్లి పున్నమ్మ కొడుకుని ఏ లోటు లేకుండా చూసుకొంది. ప్రతి రోజు పున్నమ్మ అడవి నుంచి ఏదో ఒక మాంసం తెచ్చి కొడుకుకు వండిపెట్టేది. అలా నారాయణకు మంచి కండపుష్టి కలిగింది. చదువులో, తదుపరి విప్లవోద్యమంలో చురుకుగా పని చేయడానికి ఇది ఆయనకు ఎంతోగానో ఉపయోగపడింది.

కామ్రేడ్ యాప నారాయణ చాలా చురుకైన వ్యక్తి. ఆయన బొద్దుగా, కండలు తిరిగిన శరీరం కలిగి ఉంటాడు. గుండ్రని ముఖం, చిరుతపులి లాంటి నడక, చురుకైన కళ్ళు, ఒత్తైన జుట్టు కలిగి ఉన్నాడు. చిన్నప్పటి నుంచి కష్టపడే జీవితం, పార్టీలో నిరంతర శ్రమ ద్వారా శరీరంను ఉక్కులాగా మార్చుకున్నాడు. అందుకే ఆయన మిలటరీ రంగంలోనైనా, ఆర్గనైజర్‌గానైనా గట్టి కృషి చేయడానికి ఆయన శరీరం ఎంతగానో సహకరించింది. ఏ విషయాన్నైనా శ్రద్ధగా వినడం, వీలైతే రాసుకోవడం ద్వారా విషయాలను లోతుగా గ్రహించేవాడు. ఈ విధమైన గ్రహణశక్తి వలన పార్టీ పంథా, పాలసీలపట్ల లోతైన అవగాహన కలిగి, వాటి గైడెన్స్‌లో ఎత్తుగడల రూపకల్పన చేసేవాడు. ఎత్తుగడలు అమలు చేయడానికీ, అందుకు కేడర్లను సమాయత్తం చేయడానికి తనకున్న వర్గపోరాట జ్ఞానాన్నీ, సమర్థతలను సంపూర్ణంగా వినియోగించేవాడు.

## కామ్రేడ్ యాప నారాయణ వ్యక్తిత్వం, రాజకీయ ఎదుగుదల

యాప నారాయణకు వినయం స్వంతం. పార్టీ సీనియర్లు, పై కమిటీ మెంబర్లతో ఎంతో వినయంగా ఉండేవాడు. వాళ్ళు చెప్పిన విషయాలను శ్రద్ధగా విని వాటి అమలుకు ఎంతో కృషి చేసేవాడు. క్రింది కేడర్లతో స్నేహపూర్వకంగా ఉండేవాడు. వాళ్ళు ఎదుర్కొనే సమస్యలను త్వరగా గుర్తించి వాటి నుంచి బయటపడటానికి ఎంతో సహాయం చేసేవాడు. వాళ్ళు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను పరిష్కరించేందుకు మంచి డాక్టర్ల దగ్గరికి పంపించి ట్రీట్‌మెంట్ చేయించేవాడు. కేడర్లకు ఉండే సందేహాలను తీర్చడంతోపాటు, వారు తమ పనుల్లో చొరవగా పాల్గొనడానికి అవసరమైన గైడెన్స్ అందించేవాడు. కొంచెం మెరటుగా ఉండే కేడర్లను సకాలంలో విమర్శించి వారితో విప్లవ పనులు చేయించేవాడు. అలా పార్టీలో విప్లవ కార్యకర్తలను తీర్చిదిద్దడంలో, వారి మన్ననలను పొందడంలో కామ్రేడ్ యాప నారాయణ సఫలీకృతుడైనాడు. ఆయన మొత్తం కుటుంబాన్నీ, చిన్ననాటి స్నేహితులను విప్లవ సానుభూతిపరులుగా మలుచుకున్నాడు. ఆయన సంపూర్ణమైన విప్లవకారుడిగా తయారయ్యేందుకు, ఆయనకున్న వర్గ, సామాజిక నేపథ్యం ఎంతో దోహదపడింది.

ఆయన రాజకీయ, సిద్ధాంత అధ్యయనం మీద కేంద్రీకరించేవాడు. తనకు పని ఒత్తిడి ఉన్నప్పటికీ, తప్పనిసరిగా రోజువారిగా రాజకీయ, సిద్ధాంత అధ్యయనానికి సమయం కేటాయించుకొనేవాడు. అలా రాజకీయ పరిణామాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ సిద్ధాంత పునాదులను కూడా పటిష్ట పరుచుకున్నాడు. ఈ అవగాహణతో పార్టీ పంథాను తెలంగాణలో నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించి అమలు చేసేవాడు. తెలంగాణ అధికార ప్రతినిధిగా జగన్ పేరిట రాజకీయ పరిణామాలపై ఎప్పటికప్పుడు పత్రికా ప్రకటనలు జారీ చేస్తూ ప్రజలకు పార్టీ రాజకీయ అవగాహనను అందించేవాడు. తెలంగాణలో జగన్ పేరు ప్రజలకు చాలా సుపరిచితంగా మారింది. ఎప్పటికప్పుడు మారుతున్న రాజకీయ విషయాల్లో జగన్ ఎలాంటి ప్రకటన చేస్తాడో అని ప్రజలు ఆసక్తిగా ఎదురు చూసేవారు.

రాజకీయ, సిద్ధాంత విషయాల్లో కేడర్లకు క్లాసులు చెప్పేవాడు. ఆయన చెప్పే క్లాసుల్లో, సిద్ధాంతాన్ని నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించి, వారి నిజజీవితంలోని ఉదహరణలను ఉటంకిస్తూ కేడర్లకు అర్థమయ్యేలా చెప్పేవాడు. దీనితో విద్యార్థుల్లో క్లాసులపట్ల ఆసక్తి కలిగేది.

కామ్రేడ్ హరిభూషన్ 2000 నుంచి 2005 వరకు సీ.సీ రక్షణ ప్లాటూన్ కమాండర్‌గా పని చేసిన కాలంలో మార్క్సిజం -లెనినిజం-మావోయిజం సిద్ధాంతం, పార్టీ డాక్యుమెంట్లు, పాలసీలపైన ఒక క్రమపద్ధతిలో అధ్యయనం చేసాడు. దీనితో ఆయనకు సిద్ధాంత, రాజకీయ విషయాలపైన మంచి పట్టు ఏర్పడింది. రక్షణ ప్లాటూన్‌లో కా. హరిభూషన్‌తో పాటు ఆ కమిటి ఎదగడానికి సీసీ మంచి కృషి చేసింది.

అత్యంత ధైర్యసాహసాలు, చొరవ, పట్టుదల కలిగి పార్టీ ఇచ్చే ఏ కార్యక్రమాన్నైనా విజయవంతం చేసేవాడు. అలా శత్రువుకు ఆయనొక భీకర స్వప్నం. విప్లవ జీవితంలో సాహసిక గెరిల్లా కమాండర్‌గా ఎదిగాడు. గెరిల్లాకు ఉండాల్సిన చురుకుదనం, చొరవ, అత్యంత మెలకువలు కామ్రేడ్ యాప నారాయణలో పుష్కలంగా ఉన్నాయి. అందుకే ఆయన అనేక కౄరమైన ఎన్‌కౌంటర్ దాడుల నుంచి తప్పించుకోగలిగాడు. ప్రభుత్వ బలగాలు ఎన్‌కౌంటర్‌లలో హరిభూషన్ మరణించాడని ప్రకటించేవారు. కానీ హరిభూషన్ ఎన్‌కౌంటర్‌ల నుంచి విజయవంతంగా ప్రాణాలతో బయటపడేవాడు. పోలీసులు హరిభూషన్‌ను చంపాలని 'ఆపరేషన్ హరిభూషన్' అని ప్రకటించి దాడులు చేసేవారు. కానీ ఆయన వారి కలలను కల్లలు చేసాడు.

ఆయన ఎన్నో ఎన్‌కౌంటర్‌లలో తప్పించుకొని మళ్ళీ శక్తివంతమైన నాయకుడిగా ఎదిగి ప్రభుత్వానికి మరింత గట్టి సవాలు విసిరేవాడు. అందుకే తెలంగాణ ప్రభుత్వం హరిభూషన్‌ను ప్రధాన టార్గెట్ చేసి, చివరకు ఆయన్ని కోవర్ట్ ద్వారానీ, విషప్రయోగం వలన గాని చంపడానికి కుట్రలు పన్నింది. హరిభూషన్ తన చాకచక్యంతో వీటిని కూడా ఛేధించేవాడు. ఈ క్రమంలో ఒక కోవర్టును బహిర్గత పరిచి, వాడిని నిర్మూలించాడు.

కామ్రేడ్ యాప నారాయణ శతృవు ఎన్‌కౌంటర్లను ఛేదించడమే కాకుండా తెలంగాణలో, దండకారణ్యంలో పోలీసులపై అనేక దాడులు నిర్వహించి విజయవంతం చేసాడు. అసాధ్యమనుకున్న రెయిడ్స్, ఆంబుష్‌లను సుసాధ్యం చేసాడు. సమయం కోసం వేచి ఉండటంలో ఓపిక, వీలు కాగానే దూకుడుగా దాడులు చేయడంలో దిట్ట. ఈ దాడుల సమయంలో కమాండ్, కంట్రోల్ ద్వారా గెరిల్లాలను సమన్వయం చేసి, దాడిలో అందరూ సాహసంగా పాల్గొనేలా ఆర్డర్స్ యిచ్చేవాడు. దీనితో మిలటరీ రంగంలో కూడా ఆయన అనేక విజయాలు సాధించాడు.

కామ్రేడ్ యాప నారాయణ ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి, రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజాస్వామిక తెలంగాణ ఉద్యమానికి చాలా క్రియాశీలంగా నాయకత్వం అందించాడు. ఉద్యమంలో కదిలిన విద్యార్థులు, కార్మికులు, యువజనులు, జర్నలిస్టులు, ఉద్యోగస్తులతో బలమైన సంబంధాలు ఏర్పర్చుకున్నాడు. ఆ సెక్షన్లను ఉద్యమంలో బలంగా కదిలించాడు. వారితో ప్రజాసంఘాల నిర్మాణాన్ని చేపట్టి బలోపేతం చేసాడు. వారిలో చురుకుగా ఉన్నవారిని పార్టీలోకీ, దళాల్లోకి రిక్రూట్ అయ్యేలా ప్రోత్సాహించి, కొంత మందిని రిక్రూట్ చేసాడు. ఈ క్రమంలో కామ్రేడ్ యాప నారాయణకు రాష్ట్రస్థాయిలో ప్రజాఉద్యమాలను నడిపే శక్తి సమకూరింది. తెలంగాణలో ఆదివాసీ ప్రాంతాల్లోని మూల ఆదివాసీ సమస్యలపైన, ముఖ్యంగా జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికార్ కోసమూ, 1/70 చట్టాన్ని అమలు చేయాలనీ, 5, 6 షెడ్యుల్‌లను అమలు చేయాలనీ, ఆదివాసులు జరుపుతున్న పోరాటాలకు మార్గదర్శనం చేసాడు. మూల ఆదివాసీ, లంబాడీల మధ్య గల వైరుధ్యాన్ని పరిష్కరించడానికి కృషి చేసాడు. ఈ మొత్తం కృషిలో పార్టీ పాలసీలో భాగంగా పీడితవర్గం మధ్య ఐక్యతను బలోపేతం చేస్తూ, ఆదివాసీలలోని వర్గరీత్యా భూస్వామ్య శక్తులపై పోరాటాన్ని కొనసాగించాడు. ఆదివాసీ ప్రజలను మిలిటెంట్‌గా కదిలించడానికి ఆ ఉద్యమాన్ని నడపడానికి అవసరమైన నిర్మాణాలను ఏర్పర్చడం, పటిష్టపరిచే కృషిని బలంగా కొనసాగించాడు. దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతంగా అభివృద్ధి చేయాలనే పార్టీ కేంద్ర కర్తవ్యాన్ని అమలుచేయడంలో కా. హరిభూషన్ చాల ముందున్నాడు. అందుకు ఆయన దండకారణ్య కమిటీతో మంచి సమన్వయం ఏర్పర్చుకొని, గెరిల్లా చర్యలను ప్లాను చేయడంతో పాటు యుద్ధానికి అవసరమైన పాదార్థిక సహాయం, వైద్యసహాయం, నిర్మాణ మద్దత్తు అందించడానికి తన శాయశక్తుల కృషి చేసేవాడు.

కామ్రేడ్ హరిభూషన్‌లో నిబిడీకృతమైన నాయకత్వ లక్షణాలను సీసీ గమనించింది. దీంతో వాటిని వెలికితీసి ఆయనను అభివృద్ధి చేసేందుకు సీ.సీ నిరంతర కృషి చేసింది. ఆయన మిలటరీ రంగంలో ఎదుగుతున్న కామ్రేడ్‌గా గుర్తించి అనేక రెయిడ్స్, ఆంబుష్‌లలో పాల్గొనడానికి అవకాశమిచ్చింది. సెంట్రల్ ఇన్‌స్ట్రక్టర్‌గా బాధ్యతనిచ్చి అందుకు అవసరమైన శిక్షణనిచ్చింది. సిద్ధాంత, రాజకీయ, మిలటరీ అధ్యయనంలో సహకరించింది. కమిటీ నిర్మాణాలు, పనిశైలిపై ఆయనకు మంచి విద్య గరిపింది. ఆయన ఎదుగుదలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ప్రమోషన్ కల్పించింది. వివిధ కాన్ఫరెన్స్‌లలో, ప్లీనాలలో పాల్గొనడానికి అవకాశం కల్పించింది. అలా 2003లో జరిగిన దండకారణ్య ప్లీనంలో పాల్గొన్నాడు. 2007లో జరిగిన ఐక్యతా కాంగ్రెస్‌లో డెలిగేట్‌గా తెలంగాణ నుండి పాల్గొన్నాడు. 2005లో తెలంగాణకు రాష్ట్ర కమిటీ సభ్యుడి స్థాయిలో బదిలీ అయిన తర్వాత తెలంగాణ రాష్ట్ర కమిటీలో మిలటరీ బాధ్యతలతో పాటు ఆర్గనైజేషన్ అవకాశాలు ఇచ్చింది. తెలంగాణలో ఎప్పటికప్పుడు మారుతున్న రాజకీయ పరిస్థితులపై అవగాహన కల్పిస్తూ, ఎత్తుగడలు రూపొందించడంలో సహాయపడింది. పది సంవత్సరాల కాలంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా ఎదగడానికి, కామ్రేడ్ హరిభూషన్ పార్టీ, పీ.ఎల్.జీ.ఏ, ఐక్య సంఘటనలో మంచి పట్టు సంపాదించేలా నిరంతరం ఆయనకు సహాయాన్నందిస్తూ వచ్చింది.

అయనలో గల నేర్చుకునే పట్టుదలకు, స్వయంకృషి క్రియాశీల నాయకత్వం లక్షణాలకు తోడు సీ.సీ అందించిన సహాయంతో ఆయన 2015లో తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా, 2018లో సీ.సీ సభ్యుడిగా ఎదిగాడు. 2020లో జరిగిన సీసీ సమావేశంలో మొట్టమొదటి సారి పాల్గొన్నాడు. యాధృచ్ఛికంగా యువ నాయకుడికి అది చివరి సమావేశం కావడం సీసీకి త్వరలో పూడ్చుకోలేని లోటు. అయితే ఆ సమావేశంలో తను నాయకత్వం వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర విప్లవోద్యమంపై సమగ్రమైన రిపోర్టును ప్రవేశపెట్టాడు. ఈ రిపోర్టును పరిశీలించిన సీసీ తెలంగాణాలో విప్లవోద్యమం అభివృద్ధి పథంలో ఉందని నిర్ణయించింది.

హరిభూషన్ ఈ స్థాయికి ఎదగడం చూసి, యావత్ పార్టీతో పాటు పీడిత ఆదివాసీ రైతాంగం ఎంతో గర్వపడ్డారు. ఆదివాసీ నేపథ్యం నుంచి వచ్చి, కార్మికవర్గ పార్టీలో ఒక నిజమైన కార్మికవర్గ నేతగా ఆయన ఎదుగుదల విప్లవోద్యమ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది.

## కామ్రేడ్ యాప నారాయణ విప్లవ ప్రస్థానం

కామ్రేడ్ యాపనారాయణకు జన్మనిచ్చిన గ్రామానికి, దాని చుట్టూ వున్న పల్లెలకు తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న అనుభవంతో పాటు, అక్కడి ప్రజలకు కమ్యూనిస్టు రాజకీయాలతో పరిచయం ఏర్పడింది. ఆ తదుపరి ఎంఎల్ గ్రూపుల రూపంలో కమ్యూనిస్టు రాజకీయాల కొనసాగింపు ఆ గ్రామాల్లో వుండడంతో సహజంగానే కా. యాప నారాయణలో కూడా కమ్యూనిస్టు భావజాలం పెరుగుతూ వచ్చింది. కాని ఎంఎల్ గ్రూపులలో తెలంగాణ సాయుధ పోరాటానికి ద్రోహం తలపెట్టిన సీపీఐ వారసత్వ సిద్ధాంత, రాజకీయ మూలాలుతో కూడిన మితవాద, అవకాశవాద విధానాలు వుండడంతో ఆ పార్టీల పట్ల ఆయన పెద్దగా ఆసక్తి కనబర్చలేదు.

దేశంలో 1950 దశకంలోనూ, 1960 ఆరంభంలోనూ సీపీఐ పార్టీ అనుసరించిన రివిజనిజాన్నీ ఆతదుపరి సిపిఐ(ఎం)

నాయకత్వంలో వచ్చిన ఆధునిక రివిజనిజాన్ని వ్యతిరేకిస్తూ నిజమైన మార్క్సిస్టు, లెనినిస్టు విప్లకారులు అంతర్గత పోరాటం జరిపిన ఫలితంగా భారత పీడిత ప్రజలకు నిజమైన విముక్తి మార్గాన్ని చూపుతూ నగ్జల్బరీ సాయుధ పోరాటం బ్రద్దలైంది.

నక్సల్బరీ, శ్రీకాకుళ ఉద్యమాలు విద్యార్థి, యువజనుల శ్రామికజనంలో విప్లవోత్సాహన్ని కలుగజేసాయి. 'నక్సల్బరీ ఏకీ రస్తా' అనే నినాదం దేశంలో మారుమోగింది. అయితే ఈ ఉద్యమాల్లో ముందుకొచ్చిన కొన్ని ఒంటెద్దు పోకడలు, తీవ్రనిర్బంధం వలన ఉద్యమం సెట్‌బ్యాక్‌కు గురైంది. ఈ ఉద్యమాల నుంచి పార్టీ సరియైన పాఠాలు తీసుకొని, ప్రజాపంథాను ముందుకు తెచ్చింది. ముఖ్యంగా సాయుధ పోరాటంతోపాటు ప్రజాసంఘాలు, ప్రజా ఉద్యమాలు అవసరమని, ఆంధ్రరాష్ట్ర కమిటీ 'ఆత్మవిమర్శ' రిపోర్టు తయారు చేసి, దాని గైడెన్స్‌లో మన రాష్ట్రంలో ఆ రోజు పార్టీ ప్రజాసంఘాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చింది. దీనితో 70-74 మధ్యకాలంలో పలు విప్లవ సంఘాలు నిర్మాణమైనాయి. ఇందులో ఎమర్జెన్సీ ముందే ఏర్పడిన ఆర్.ఎస్.యు (రాడికల్ స్టూడెంట్స్ యూనియన్) విద్యార్థులను కూడగట్టింది. ఎమర్జెన్సీ తర్వాత పార్టీ గ్రామాల్లో కృషిని ప్రారంభించడంతో 1978లో జగిత్యాల పోరాటం బద్దలైంది. 1980లో భారత కమ్యూనిస్టు పార్టీ (మా.లె), (పీపుల్స్‌వార్) కేంద్ర కమిటీ ఏర్పడింది. పార్టీ నాయకత్వం కింద గెరిల్లా జోన్ పర్‌స్పెక్టీవ్‌ను రూపొందించి సమగ్రమైన పథకంతో గెరిల్లా దళాల నిర్మాణాన్ని చేపట్టింది. ఒకవైపున విశాల ప్రాంతాలలో ప్రజాసంఘాలు, రైతాంగ, ఇతర పోరాటాలు నిర్మిస్తూనే, మరోవైపు గ్రామీణ ప్రాంతంలో గెరిల్లా దళాల నాయకత్వంలో ప్రజలను కూడగట్టి గెరిల్లా పోరాటాలకు సిద్ధం చేసింది. 1980-88 వరకు సాగిన పోరాటం ప్రభుత్వ తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొంటూనే ఉత్తర తెలంగాణ, దండకారణ్యం ఉద్యమాలు 1988 నాటికీ గెరిల్లాజోన్ల నిర్మాణాలుగా రూపుదిద్దుకున్నాయి. ఉత్తర తెలంగాణ, దండకారణ్యాల్లో ఉవ్వెత్తున ఎగిసిన వ్యవసాయ విప్లవం, ఈ గెరిల్లాజోన్లు అభివృద్ధి చెందడానికి దోహదపడింది.

1990లో తాత్కాలిక నిర్బంధ వెనులుబాటులో పార్టీ, ప్రజాసంఘాలు ప్రజలను పెద్దఎత్తున కూడగట్టాయి. ఈ కాలంలో వ్యవసాయ విప్లవం బలంగా పురోగమించింది. దీని ఫలితంగా 1991 మే నెలలో వరంగల్‌లో ఆంధ్రప్రదేశ్ రైతుకూలీసంఘం సభలు 10 లక్షల మంది ప్రజానీకంతో విజయవంతం అయినాయి. ఈ సభను బూర్జువా పత్రికలే 'నభూతో న భవిష్యత్' అని వ్యాఖ్యానించాయి. 80వ దశకం అంతా విప్లవోద్యమం అనేక ఆటంకాలు ఎదుర్కొంటూనే బలంగా పురోగమించింది. వరంగల్ సభలు జరిగిన పిదప తెలంగాణ వ్యాప్తంగా కొత్తతరం విప్లవోద్యమంలోకి రిక్రూట్ అయింది. ఈ తరం 90వ దశకం నుండి విప్లవోద్యమంలో క్రియాశీల పాత్ర వహించింది. ఈ తరం యువకునిగా కా. హరిభూషన్ విప్లవోద్యమంలోకి ప్రవేశించి ఒక గొప్ప కమ్యూనిస్టు నేతగా, గెరిల్లా యుద్ధనిపుణుడుగా తన జీవితాన్ని మహోన్నతంగా కొనసాగించాడు.

జగిత్యాల జైత్రయాత్ర నుండి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల్లో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు ఉవ్వెత్తున ఎగిసి పడ్డాయి. ఈ ఉద్యమాల స్ఫూర్తితో విద్యార్థుల్లో విప్లవ చైతన్యం వెల్లువిరిసింది. దీనితో వందలాది మంది విద్యార్థులు రాడికల్ విద్యార్థి సంఘంలో చేరి నూతన ప్రజాస్వామిక విప్లవ కార్యక్రమాలను ఆమోదించారు. విద్యార్థుల సమస్యలపై అనేక పోరాటాలు చేపట్టడమే కాకుండా రైతాంగ ఉద్యమాలకు మద్దతు తెలిపారు. విద్యార్థీ ఉద్యమాల నుండి ఎదిగి వచ్చిన చురుకైనా విద్యార్థులే రైతాంగ పోరాటాలకు నాయకత్వం వహించారు. దళాల్లో చేరి సాయుధ పోరాటానికి మార్గదర్శకత్వం వహించారు. కామ్రేడ్ యాప నారాయణ కూడా నగ్జల్బరీ, శ్రీకాకుళ, జగిత్యాల సాయుధ రైతాంగ పోరాటాల ఉత్తేజంతో విప్లవ రాజకీయాల వైపు అడుగులు వేశాడు. 1989లో రాడికల్ విద్యార్థి సంఘంలో చేరి విద్యార్థుల పోరాటాలలో భాగస్వామ్యం అయ్యాడు. కామ్రేడ్ హరిభూషన్ రాడికల్ విద్యార్థి సంఘంలో చురుకుగా పని చేస్తున్న కాలంలోనే విప్లవం యెడల అంకిత భావం ఏర్పడింది. ఉద్యమంలో భాగం అయినాడు.

1980ల చివరికి తెలంగాణలో శతృవు బలగాలను ఎదుర్కొంటూ గెరిల్లా జోన్‌ను అభివృద్ధి చేయడానికి ప్రజా సంఘాల, ప్రజల చైతన్యం పెంచి ప్రజా సైన్యాన్ని నిర్మించాల్సిన ప్రధాన కర్తవ్యం పార్టీ ముందు వుండింది. ఈ కర్తవ్యాన్ని సాధించడానికి పార్టీ చాలా మంది విద్యార్థులను, యువజనులను అటవి దళాల్లోకి పంపింది. అందులో కామ్రేడ్ యాపనారాయణ ఒకడు. రాడికల్ విద్యార్థీ సంఘంలో క్రియాశీలంగా పని చేస్తున్న తను పార్టీ పిలుపు మేరకు పాకాల కొత్తగూడెం ప్రాంతంకు వచ్చి పని చేశాడు.

ఈ సమయంలో పీ.ఆర్‌గా తన విప్లవ జీవితాన్ని ఆరంభించి కా॥ రాజం కోటీ, కా॥ మోరం పల్లి వెంకన్న, కా॥ శ్రీశైలం లతో కలిసి పని చేశాడు. ఇక్కడే ఒక సంవత్సరం 1+1టీంలో కా॥ రాజం కోటితో కా॥ యాప నారాయణ పీ.ఆర్‌గా తిరిగాడు. ప్రజలను సంఘటితం చేశాడు. గ్రామాల్లో యువకులను కూడగడుతూ యువజన సంఘాలను నిర్మించాడు. విప్లవోద్యమానికి ఆటంకంగా మారిన మితవాద అవకాశవాదానికి వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేశాడు. భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు చేపట్టాడు. ముఖ్యంగా భూస్వామ్యానికి కొమ్ముకాసే న్యూడెమోక్రసీ పార్టీ విప్లవ వ్యతిరేక విధానాలపై సైద్ధాంతిక పోరాటం చేశాడు. తమ విధానాలను వ్యతిరేకిస్తున్నారనే ఉద్దేశంతో న్యూడెమోక్రసీ పార్టీ వాళ్లు కా.రాజం కోటీ, కా. హరిభూషణ్ లను హత్యలు చేయడానికి కుట్రలు పన్నారు. మడగూడెం వెళ్ళిన వీరిని పథకం ప్రకారం దాడి చేసి కా॥ రాజం కోటిని పట్టుకొని మాయం చేశారు. కా॥ యాప నారాయణ అక్కడి నుండి తప్పించుకొని బయట పడ్డాడు. ఆ తరువాత కా॥ శ్రీశైలంను కూడా పట్టుకొని హత్య చేశారు. మోరంపల్లి వెంకన్న పోలీసుల దాడిలో అమరుడయ్యాడు. ఈ కామ్రేడ్స్ యొక్క అమరత్వపు స్ఫూర్తి తనలో మరింత పట్టుదల పెరిగింది.

1991లో దళంలో చేరి ఒక సంవత్సరం పాటు నెక్కొండ దళంలో పని చేసి, ఆతరువాత పాండవ దళానికి మారాడు. అప్పటి నుండి 1998 చివరి వరకు అక్కడే పని చేశాడు. కమాండర్‌గా ఆర్గనైజర్‌గా, డివిజన్ కమిటీ మెంబర్‌గా ఎదిగి, సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించాడు.

1992 నాటికే కమాండర్‌గా, ఆర్గనైజర్‌గా పాండవ దళం పేరుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విస్తృత ప్రాంతంలో ప్రజలను కలిశాడు. కా.హరిభూషణ్ పని చేసిన ఇల్లెందు, బయ్యారం, నర్సంపేట, పాకాల కొత్తగూడెం, గుండాల ప్రాంతాలలో న్యూడెమోక్రసీ పార్టీ గ్రామ పెత్తందార్ల, వడ్డీ వ్యాపారుల, భూస్వాముల పునాదులపై ఆధారపడి నిర్మాణమై వుండింది. ప్రజలను కంట్రోల్ చేస్తూ, వీరు బలహీనంగా వున్న వద్ద రాజ్యంతో చేతులు కలిపి తమ ఆధిపత్యాన్ని కాపాడుకుంటారు. వీరి ఆచరణంతా విప్లవాభివృద్ధికి ఆటంకంగా ఉ ండేది. గెట్టు సిద్ధాంతాలతో ఇలా వర్గసంకర రాజకీయాలతో పాతుక పోయిన న్యూడెమోక్రసీ కోటలను హరిభూషన్ బద్దలు కొట్టి అక్కడ విప్లవకర ప్రజా పునాది ఏర్పర్చాడు.

ఆ సమయంలో న్యూడెమోక్రసీ పార్టీ మన పార్టీపై సాయుధ ఘర్షణలకు దిగారు. ప్రజలపై భౌతిక దాడులకు దిగారు. క్రమంగా విప్లవ కారులను హత్యలు చేసి మాయం చేసే వరకు దిగజారారు. వీరి వర్గసంకర మితవాద రాజకీయాలతో కా. హరిభూషణ్ పోరాడుతూనే వారితో సమస్యల ప్రాతిపధికన ఐక్యత కోసం కృషి చేశాడు. వివిధ రకాల ఎంఎల్ గ్రూపుల్లో ప్రధానంగా న్యూడెమోక్రసీ విప్లవ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ సైద్ధాంతిక పోరాటం చేశాడు. ఆచరణలో నూడెమోక్రసీతో వస్తున్న సమస్యలను పరిష్కరించడానికి ఎంతో ఓపికతో సామరస్య పూర్వకంగా ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా నడిపించాడు.

కామ్రేడ్ హరిభూషణ్ తన విప్లవ ప్రస్థానంలో పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ అత్యున్నత బాధ్యతలు చేపట్టాడు. 1992లో దళ కమాండర్‌గా, ఆర్గనైజర్‌గా, 1996లో ఖమ్మం జిల్లా కమిటీ మెంబర్‌గా బాధ్యతలు చేపట్టాడు. 1998 నవంబర్‌లో ఉత్తర తెలంగాణ మొదటి ప్లాటూన్ బాధ్యతలు తీసుకొన్నాడు. 2000 సం॥రంలో కేంద్ర కమిటీ ప్రొటక్షన్ ప్లాటూన్‌కు బదిలీ అయి 2005 వరకు కొనసాగాడు. కొద్ది కాలం సెంట్రల్ ఇన్‌స్ట్రక్టర్‌గా కూడా పని చేశాడు. 2005లో స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడుగా సీసీ ప్రమోషన్ ఇచ్చి ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటిలోకి ఎస్‌జెడ్‌సీయంగా బదిలీ చేసింది. 2015 ప్లీనంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా, 2018 నవంబర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు.

1995లో జరిగిన మొట్టమొదటి ఉత్తర తెలంగాణ స్పెషల్ జోన్ కాన్ఫరెన్స్‌లో ప్రతినిధిగా పాల్గొన్నాడు. ఉత్తర తెలంగాణ స్పెషల్ జోన్ 2007 కాన్ఫరెన్స్‌లోనూ, 2011 ప్లీనంలో, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం జరిగిన 2015, 2019 వరుస ప్లీనాలకు ప్రాతినిధ్యంతో పాటు నేతృత్వం వహించి రాజకీయ, నిర్మాణ సమీక్షలను సుసంపన్నం చేయడంలో క్రియాశీల భూమిక పోషించాడు.

2007 జనవరిలో జరిగిన 9వ కాంగ్రేసు ఐక్యత కాంగ్రేస్‌కు ఉ త్తర తెలంగాణ నుండి హాజరైన ముగ్గురు డెలిగెట్స్‌లో కా. హరిభూషన్ ఒకడుగా హాజరు అయ్యాడు. ఈ ఐక్యతా కాంగ్రేసులో చురుకుగా పాల్గొని అక్కడ తీసుకొన్న కీలకమైన నిర్ణయాలన్నింటిలో తన వంతు భాగస్వామ్యాన్ని అందించాడు. ఆ తదుపరి అక్కడ రూపొందించుకొన్న కేంద్ర, ప్రధాన కర్తవ్యాలనూ ఎత్తుగడలను తెలంగాణలో సృజనాత్మకంగా అన్వయించడమే కాకుండా ప్రతిభ వంతంగా అమలు పరిచాడు. ఫలితంగా తెలంగాణలో విప్లవోద్యమం కొద్ది మేరకు అభివృద్ధిని సాధించింది.

1956 నవంబర్‌న ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ప్రజల మనోభావాలతో సంబంధం లేకుండా దానిని బలవంతంగా చేర్చుకోవడంతో పాటు తెలంగాణపై కోస్తా పెట్టుబడిదారుల దోపిడీ దశాబ్దాలుగా కొనసాగటం మూలాన వివక్ష, దోపిడి, ఆత్మగౌరవం, స్వపరిపాలన అనే అంశాల చుట్టు రాజకీయంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర డిమాండ్ ముందుకు వచ్చింది. మొదట ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు డిమాండ్‌తో 1969లో ఉద్యమరూపం తీసుకుంది. ఆ సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్బంధంతో పాటు చెన్నారెడ్డి విద్రోహంతో ఉద్యమం తాత్కాలికంగా ఆగిపోయింది. 1996లో వరంగల్ డిక్లరేషన్ ద్వారా ఉద్యమం మలివిడత ముందుకొచ్చింది. 2009 డిసెంబర్ నాటికి ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. ఈ చారిత్రక నేపధ్యాన్ని విప్లవోద్యమానికి అనుకూలంగా మల్చడంలో కా.హరిభూషణ్ కృషి ఎంతో వుంది.

పార్టీ, ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ కార్యక్రమాన్ని రూపొందించుకొని ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లింది. దీనితో 2009లో ఉద్యమం మలుపు తిరిగి పెద్ద వెల్లువ వచ్చింది. ఈ వెల్లువ దేశవ్యాప్తంగా ప్రభావాన్ని వేసింది. ఈ ఉద్యమాలు ఉస్మానియా యూనివర్సిటి కేంద్రంగా నడిచాయి. తెలంగాణలోని పది జిల్లాలు గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ఎక్కడికక్కడ జేఏసిలుగా ఏర్పడి ఆందోళనలు చేపట్టారు. విద్యార్థులు, మేధావులు, కవులు, కళాకారులు, రచయితలు, లాయర్లు, డాక్టర్లు కార్మికులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ముఖ్యంగా మహిళలు పెద్ద యెత్తున కదిలారు. ఇంతటి మిలిటెంట్ ప్రజా వెల్లువను సృష్టించి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటులో కా. హరిభూషణ్ ప్రముఖ పాత్ర పోషించాడు.

తెలంగాణలో విప్లవోద్యమం సెట్ బ్యాక్‌కు గురి అయిన తరువాత మళ్ళీ భూస్వాముల, దళారీ నిరంకుశ పెట్టుబడి దారుల, సామ్రాజ్యవాదుల దోపిడి మరింత తీవ్రమైంది. దీనితో వైరుధ్యాలు పదునెక్కుతున్నాయి. వేలాది మంది నిర్వాసితులను చేస్తున్న పోలవరం డ్యాం ప్రాజెక్టు, మేడిగడ్డ, అన్నారం, కంతనపల్లి, మల్లన్న సాగర్ వంటి పలు భారీ నీటి ప్రాజెక్టులకు, ఓపెన్ కాస్టులకు, ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో కవ్వాల్ టైగర్ జోన్, విద్యుత్ ప్లాంట్స్, మామిడి గుండాలలో డోలమైట్, గ్రానైట్ తవ్వకాలు, మహబూబ్‌నగర్ జిల్లాల్లో యూరేనియం తవ్వకాలకు, భయ్యారం ఉక్కు పరిశ్రమకు వ్యతిరేకంగా జరిగిన అనేక మిలిటెంట్ పోరాటాలకు కా. హరిభూషణ్ నాయకత్వం వహించి వేలాది మంది ప్రజలను కదిలించాడు. దీనితో మన పార్టీ ఒక రాజకీయ శక్తిగా ఎదిగింది. విప్లవోద్యమానికి వస్తుగత పరిస్థితులు అనుకూలించడంతో ఈ మిలిటెంట్ పోరాటాల నుండి నూతన శక్తులు రావడం ప్రారంభం అయ్యి, పార్టీ యాక్టివిస్టులుగా, సానుభూతి పరులుగా ముందుకొచ్చి ప్రజా యుద్ధంలో భాగస్వామ్యం అయ్యారు.

## సాహసిక మిలటరీ కమాండర్ కామ్రేడ్ హరిభూషణ్ కృషి

ఉత్తర తెలంగాణ విముక్తి ప్రాంతం లక్ష్యంతో గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేయడానికి ప్రత్యేక సైనిక నిర్మాణాలు అభివృద్ధి చేయాలనే పార్టీ నిర్ణయం మేరకు 1996లో మొదటి ప్లాటూన్ నిర్మించింది. 1998లో మరొక్క ప్లాటూన్‌తో పాటు ఎల్ఒఎస్ ల నిర్మాణాలు జరిగాయి. మొదటి ప్లాటూన్‌కు వున్న కమాండర్ ఉద్యమ అవసరాల రీత్యా బదిలీ కావడంతో ఆ స్థానంలో 1998 నవంబర్‌లో మొదటి ప్లాటూన్ కమాండర్‌గా కామ్రేడ్ హరిభూషణ్ బాధ్యత చేపట్టాడు. ఆ నాటి నుండి అనేక సైనిక చర్యల్లో పాల్గొని, వాటికి నాయకత్వం వహిస్తూ మిలటరీ రంగాన్ని అభివృద్ధి పరచడంలో విశేష కృషి చేశాడు.

ఈ కాలంలో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రం టీడీపి అధికారంలో వుండి సంయుక్తంగా దాడిని కొనసాగించాయి. 1985-1991లలో వచ్చిన రెండు నిర్బంధ క్యాంపెయిన్‌లు పార్టీ, ప్రజలు చేసిన వీరోచిత పోరాటం ద్వారా ఓడించబడ్డాయి. 1996 మధ్య నుండి శత్రువు ఎల్ఐసి దాడిని నిర్దిష్టంగా అమలోకి తీసుకొచ్చారు. ఈ నిర్మూలనా అణచివేత దాడిని ఓడించి గెరిల్లా జోన్‌ను పటిష్ట పరిచే లక్ష్యంతో ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా 1996 నుండి అనేక ఆంబుష్‌లు, రైయిడ్స్‌లలో పార్టీ సైనిక విజయాలు సాధించింది. శత్రువు డిమోర్‌లైజ్‌కు గురయ్యాడు. వాడి దాడి దూకుడును ఒక మేరకు ఆపగలిగాయి. ఈ నేపథ్యంలో కా॥ హరిభూషణ్ నాయకత్వం వహించిన ఘటనలు కూడా శత్రువు నిర్బంధంను తిప్పికొట్టడంలో చాలా ప్రభావితం చేశాయి అనడంలో అతిశయోక్తి లేదు.

1997 జనవరిలో ఖమ్మం జిల్లా కరకగూడెం పోలీసు స్టేషన్‌పై రైయిడ్ చేయడం జరిగింది. ఇందులో 16 మంది పోలీసులు ఖతం అయ్యారు మన గెరిల్లా యోధులు తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో కామ్రేడ్ హరిభూషణ్ స్టాఫ్ పార్టీకి కమాండర్‌గా బాధ్యత వహించారు. ఈ దాడి విజయవంతమై శత్రువు మోరెల్‌ను దెబ్బతీసింది. మన పీఎల్‌జీఏ 1999లో బెల్లంపల్లి వద్ద ఆర్‌పీఎఫ్ పోలీసు స్టేషన్‌పై దాడి చేయడం జరిగింది. ఈ దాడిలో పోలీసులను గాయపర్చి, 303 రైఫిల్స్ 3, 2 రివాల్వర్లను తీసుకొచ్చారు. ఈ దాడికి కా॥ హరిభూషణ్ కమాండర్‌గా వ్యవహరించారు.

2000లో మహారాష్ట్రలోని అశ్రవెల్లి పోలీస్ స్టేషన్‌పై రైయిడ్ చేసి కొద్ది మంది పోలీసులను గాయపరిచి లొంగదీసుకొని 20 ఎస్ఎల్ఆర్‌లు, 303 రైఫిల్స్ 5, ఒక రివాల్వర్‌ను పీఎల్‌జీఏ స్వాధీనం చేసుకుంది. ఈ ఘటనలో కా॥ యాపనారాయణ కమాండర్‌గా వుండి కీలక రోల్ పోషించారు. ఈ దాడికి ముందు తనే స్వయంగా గ్రామస్తుల సహాయంతో పోలీస్ స్టేషన్ లోపలికి వెళ్ళి పోలీసులతో పరిచయం ఏర్పర్చుకొని రెక్కిని పక్కగా నిర్వహించి పథకం రూపొందించాడు. నది దాటి వెళ్ళి పథకాన్ని సఫలం చేయడానికి కావల్సిన అన్ని ఏర్పాట్లు చేశాడు. పీఎల్‌జీఏ బలగాలకు పథకాన్ని క్షుణంగా వివరించి వారి బాధ్యతలను గుర్తు చేస్తూ బలగాలను ఉత్సాహ పరిచాడు. అదే ఉత్సాహంతో అశ్రవెల్లి పోలీసు స్టేషన్‌పై పీఎల్‌జీఏ విరుచకపడింది. ఫలితంగా విజయం సాధించింది. ఈ ఘటనను విజయవంతం చేయడంలో కా॥ హరిభూషణ్ కృషి అమోఘమైనది.

1998లో కేంద్ర హుం మంత్రి నాయకత్వంలో జాయింట్ కోఆర్డినేషన్ కమిటీ (జెసిసి) ఏర్పరిచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తర తెలంగాణా విప్లవోద్యమంపై నిర్బంధాన్ని ఉధృతం చేశాయి. 2000 సం॥రంలో జాయింట్ ఆపరేషన్ కమాండ్ (జేఏసీ)ని ఏర్పర్చుకున్నాయి. ఈ కాలంలో శత్రువు చేపట్టిన పోర్టిఫికేషన్ సర్‌ప్రైజ్ అటాక్, చుట్టివేత నిర్మూలనా, అణిచివేత దాడులు మన దళాలను నష్టపరుస్తూ వచ్చాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక గ్రేహౌండ్స్ దళాలు మన పార్టీ గెరిల్లా దళాలపై ఆకస్మిక దాడి చేసి నష్టపరుస్తూ వచ్చాయి. ఈ దళాలను ఎదుర్కోవడమే విప్లవోద్యమ తక్షణ కర్తవ్యంగా మారింది.

కా.హరిభూషణ్ ఉత్తర తెలంగాణలో 2005 నుండి 2015వరకు రాష్ట్ర మిలటరీ వ్యవహారాల ఇన్‌చార్జిగా బాధ్యతల్లో ఉన్నాడు. ఈ కాలంలో గెరిల్లా యుద్ధ అభివృద్ధి కోసం తీవ్రమైన కృషి చేశాడు.

తెలంగాణ ఉద్యమం సెట్‌బ్యాక్‌కు గురికావడంతో 2002 తర్వాత గెరిల్లా చర్యలు తగ్గాయి 2005 చివరిలో కొమరారం, గుండాల, శెట్టిపల్లి గ్రామాల పరిధిలో గతంతో పోల్చితే గెరిల్లా చర్యలు జరిగాయి. ఈ చర్యలు శత్రువు బలగాల్లో కొంత భయాందోళనకు గురి చేశాయి. ఈ చర్యలు జరగడానికి కా॥ హరిభూషణ్ మన పీఎల్‌జీఏ బలగాల్లో గొప్ప ప్రేరణ కల్పించి యుద్ధ చర్యలోకి దింపాడు. తాను ఇచ్చిన ప్రేరణతో దళాలు గెరిల్లా చర్యల్లో దిగాయి.

పోలీసు స్టేషన్‌పై దాడులు చేయడానికి అనేక పథకాలు రచించి వాటిని అమలు చేయడానికి పూర్తి సన్నాహాలు చేసేవాడు. డైరెక్షన్ మైన్స్‌తో పేల్చడానికి పెద్ద పెద్ద కంటెనర్స్, వాటర్ ట్యాంకు వెహికిల్స్ తయారీలను సమర్ధవంతంగా అమలు చేసేవాడు. ఆయుధాలు, తూటాలు సమకూర్చి యుద్ధ అవసరాలను తీర్చడానికి ఎంతో కష్టపడ్డాడు. గెరిల్లా యుద్ధంలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిన బిగ్ ఏరియా వెపన్స్ (ఆర్టిలరి) తయారీలలో కా॥ హరిభూషణ్ కృషి చాలా మేరకు తోడ్పడిందనే చెప్పవచ్చు.

ఉత్తర తెలంగాణ (తెలంగాణ)లో దోపిడి పాలక వర్గాలు విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించాలనే లక్ష్యంతో అనేక అణిచివేత క్యాంపెయిన్లు చేపట్టారు. కొన్ని ఆపరేషన్స్ కామ్రేడ్ లక్కుదాదా లక్ష్యంగా చేసుకొని సాగాయి. 2016లో బొట్టెం, 2018లో పూజారీ కాంకేర్‌లలో శతృవు చేసిన దాడులు అందులో భాగమే. బొట్టెంలో పోలీసులు చేసిన దాడి సమయంలో కా. లక్కు దాద పేషంటుగా ఉన్నాడు. అయినప్పటికీ శక్తిని కూడదీసుకొని శత్రువును ధైర్యంగా ప్రతిఘటిస్తూ రిట్రీట్ అయినాడు. ఎన్నో శతృవు దాడులను అత్యంత ధైర్య సాహసాలతో ప్రతిఘటిస్తూ సురక్షితంగా బయట పడ్డాడు.

విప్లవోద్యమాన్ని నిర్మూలించడానికి శతృవు కొనసాగించిన అణిచివేత క్యాంపెయిన్లను ఓడించడానికి అనేక టీసిఓసిలలో నాయకత్వం వహించి విజయాలను సాధించి పెట్టాడు. దండకారణ్యంతో మంచి సమన్వయం సాధించి జాయింట్ టీసిఓసిల ద్వారా శతృవు దాడులను తిప్పికొట్టడంలో ఎంతో కృషి చేశాడు.

2001లో కేంద్ర కమిటీ ప్రొటెక్షన్ ప్లాటూన్‌కు కమాండర్‌గా వుంటూ వివిధ మిలటరీ చర్యలకు నాయకత్వం వహించాడు.

వ్యూహాత్మక ప్రాంతంలోకి శత్రువు చొరబడి ఎక్కడ కూంబింగ్ ఆపరేషన్స్ జరిగినా అక్కడికి వేగంగా వెళ్ళి పోలీసు బలగాలపై కా. హరిభూషణ్ నాయకత్వంలో పిఎల్‌జీఏ బలగాలు దాడులు జరిపేవారు. 2001లో ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లా కోహిల్‌బెడా బ్లాక్‌లో బాందే పోలీస్ క్యాంపుపై పీఎల్‌జీఏ దాడి చేసింది. ఈ దాడిలో రెండవ అసాల్ట్‌కు కమాండర్‌గా వ్యవహరించాడు. ఈ దాడి విఫలమైంది.

2004లో మాడ్ డివిజన్‌లో తాకిలోడ్ వద్ద పోలీసులు వచ్చే సమాచారాన్ని తెలుసుకొని పీఎల్‌జీఏ ఆంబుష్ చేసింది. ఈ ఆంబుష్‌లో ఇద్దరు పోలీసులు చావగా ముగ్గురు గాయపడ్డారు. ఈ ఆంబుష్‌కు కా॥ హరిభూషణ్ కమాండర్‌గా బాధ్యత వహించాడు. ఇదే సంవత్సరం నారాయణపూర్ జిల్లా ఒడిశా బ్లాక్‌లోని దూంగా గ్రామం వద్ద చేసిన ఆంబుష్‌లో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. ఈ ఆంబుష్‌కు కూడా తానే బాధ్యత వహించాడు.

దేశ విప్లవోద్యమ చరిత్రలోనే 2004 ఫిబ్రవరిలో జరిగిన ఒడిశాలోని కోరాపుట్ మల్టీరెయిడ్‌లో ప్రముఖమైన రెయిడ్‌గా విభజించబడింది. ఆ దాడిలో పిఎల్‌జీఏ 535 తుపాకులు తీసుకొచ్చింది. ఇక్కడ ఒక్క పోలీస్ మాత్రమే చనిపోయాడు ఈ చర్య శత్రువుని పెద్ద గందరగోళాన్ని సృష్టించింది. అత్యంత ధైర్య సాహసాలతో ప్రదర్శించిన పీఎల్‌జీఏ గొప్ప విజయాన్ని సాధించింది. ఇందులో కా॥ హరిభూషణ్ హెడ్ క్వార్టర్ పై చేసిన ఒక అసాల్ట్ బ్యాచ్‌కు కమాండర్‌గా ముందుండి నాయకత్వం వహించాడు. క్యాడర్‌కు ధైర్యాన్ని కల్పిస్తూ ప్రోత్సాహానిచ్చాడు.

2007లో బీజాపూర్ జిల్లా రాణిబొదిలి పోలీస్ స్టేషన్ పై పీఎల్‌జీఏ రెయిడ్ చేసింది. ఈ ఘటనలో 55 మంది ఎస్‌పీఓ, సీఏఎఫ్ పోలీసులు మట్టికరిచారు. ప్రజలపై క్రూరంగా, పాశవికంగా దాడులు చేసిన విప్లవ ద్రోహులు పెద్ద ఎత్తున చావడం, ఈ ఘటన ప్రజలను సంబరాల్లో ముంచెత్తింది. ప్రజలను ఉత్తేజ పరిచిన ఈ ఘటనలో కా॥ హరిభూషణ్ పాల్గొని పీఎల్‌జీఏను ఎంతో ఉత్సాహపరుస్తూ ముందుకు నడిపించాడు.

2006లో తెలంగాణ బలగాలు రిట్రీట్ అయి, దండకారణ్యం బలగాలతో జాయింట్‌గా పోలీసు బలగాలపై దాడి చేయడం జరిగింది. కుంట ఏరియాలో గొడ్డలి గ్రామం వద్ద మన సమాచారం తెలిసి ఎస్‌పీఓలు మనపై దాడి చేయడానికి వచ్చారు. పిఎల్‌జీఏ వారిని ముందుగానే గమనించి వారిపై ఫైరింగ్‌చేస్తూ ఒక కిలోమీటర్ల దూరం తరిమికొట్టింది. ఎస్‌పీఓలు పారిపోయారు. ఇదే సమయంలో ఆరాయన్‌పూర్ ఘటనలో సీఆర్‌పీఎఫ్ బలగాలపై ఆంబుష్ చేశారు. దానిలో ఇద్దరు పోలీసులు గాయాలు అయ్యారు. ఈ ఘటనకు కూడా కా॥ హరిభూషణ్ నాయకత్వం వహించాడు.

2013లో సుక్మాజిల్లాలోని మినప గ్రామం వద్ద పోలీసు బలగాలు కొత్తగా క్యాంపు పెట్టడానికి వచ్చాయి. పీఎల్‌జీఏ బలగాలు మూడు రోజులు పాటు క్యాంపును చుట్టుముట్టి దాడి చేయడం జరిగింది. ఈ దాడిలో మొత్తంగా ఏడుగురు పోలీసులు చనిపోయారు. దీని ప్రభావంతో ఆ క్యాంపును మూడు రోజుల తర్వాత ఎత్తి వేశారు. వీరి తిరుగు ప్రయాణంలో పిఎల్‌జీఏ దాడి చేసింది. ఈ దాడికి కా॥ హరిభూషణ్ నేతృత్వం వహించాడు.

2021లో బీజాపూర్ జిల్లా జీరగూడెం గ్రామం వద్ద ఆపరేషన్ ప్రహార్‌లో భాగంగా సమాచారంపై ఆధారపడి మనల్ని దెబ్బతీయడానికి 2 వేల మంది సంయుక్త బలగాలు మోహరించబడ్డాయి. ఆ సమాచారం తెలుసుకున్న పీఎల్‌జీఏ 750 మంది శత్రువు బలగాల్ని చుట్టుముట్టింది. నాలుగు గంటల పాటు ఈ వీరోచిత పోరాటం సాగింది. ఆధునాతన ఆయుధాలు కలిగిన శత్రువును రెండు కిలోమీటర్ల వరకు పిఎల్‌జీఏ పరుగులు పెట్టించింది. ఈ వీరోచిత పోరాటంలో కా॥ లక్మూదాద భాగస్వామ్యం వుంది. ఈ టీసీఓసీలో కోర్‌గ్రూప్, కమాండ్‌లో వుండి నిర్ణయాత్మక పాత్ర పోషించడమే కాదు అన్ని విధాలుగా సహాయ సహకారాలనందించాడు.

## కామ్రేడ్ యాప నారాయణ అస్తమయం

నీవు చెబుతున్నదంతా కామ్రేడ్ యాప నారాయణ తల కిందికి వంచి వింటాడు. తను మాట్లాడేటప్పుడు నీ కళ్ళలోకి చూసి మాట్లాడతాడు. మాటకు అనుగుణంగా చేతులు ఆడించడం లయగా ఉంటుంది. ఆయన ఎల్లప్పుడు ఎదుటివారికి సహాయం చేయాలనే ఆలోచనతోనే ఉంటాడు. పార్టీ రహస్యాలను అవసరం మేరకు అవసరమైన వారితోనే చర్చిస్తాడు. మాటల వొరవడిలో పడి రహస్యాలను ఎక్కడ బహిరంగపర్చడం ఉండదు. ఆచరణకు సంబంధించి తన మాటల్లోనే చెప్పాలంటే “నిరంతరం ఏదో పని చేయలనే కోరిక ఉంటుందని” అంటాడు. అలా ఆయన ఎప్పుడు ఏదో పనిలో నిమగ్నం అయి ఉండేవాడు. ఈ కార్యాచరణ అంతా విప్లవం కోసమే. విప్లవం తప్ప ఆయనకు మరోధ్యాస లేదు. ఈ క్రమంలో ఆయన ఆరోగ్యం దెబ్బతింటూ వచ్చింది. తన ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని రోజు మందులు వాడడంతో పాటు ఉదయం పూట వ్యాయామం చేసేవాడు. ఆయినప్పటికీ, ఆయన ఆరోగ్యం క్షీణిస్తూ వచ్చింది. చివరకు కరోనా మహమ్మారి తాకిడితో అప్పటికే ఆస్తమా, బ్రాంకైటీస్, రక్తపోటుతో బాధపడుతున్న కామ్రేడ్ యాప నారాయణ గుండెపోటుతో తుది శ్వాస ఆగిపోయి ప్రాణాలను కోల్పోయాడు. శతృవు ఎన్‌కౌంటర్స్‌లో కా. హరిభూషణ్‌ను, హత్య చేయాలనే పథకాలు అన్ని విఫలమైనాయి. కానీ కరోనా మహమ్మారి ఆయనకు ఎలాంటి అవకాశం యివ్వకుండా బలి తీసుకొంది. సామ్రాజ్యవాదులు సృష్టించిన కరోనా మహమ్మారి ప్రపంచ వ్యాపితంగా లక్షలాది మందిని బలిగొన్నది. చివరకు విప్లవకారులను కూడా బలి తీసుకొంటున్నది. కరోనా రెండవ వేవ్‌లోనే విప్లవకారులు కొందరు కరోనా వ్యాధికి గురైనారు. ఈ కరోనా రెండవ వేవ్‌తో కామ్రేడ్స్ యాప నారాయణ అమరులైనారు. మానవాళికి వినాశకరంగా తయారైన కరోనాను లేదా అలాంటి మహమ్మారులను ఎదుర్కోవాలంటే ఈ భూ ప్రపంచంలో సామ్రాజ్యవాదాన్ని నిర్మూలించాలి. మన దేశంలో సామ్రాజ్యవాదానికి ఊడిగం చేసే భారత అర్థవలస-అర్థ భూస్వామ్య వ్యవస్థకు ప్రాతినిధ్యం వహిస్తున్న దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలనూ కూలదోయాలి. భారతదేశంలో దీర్ఘకాల ప్రజాయుద్ధం ద్వారా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం ద్వారా కామ్రేడ్ యాప నారాయణకు మనం నిజమైన నివాళినర్పించగలం. ఆ కార్య సాధనకు మనమంతా దృఢంగా ముందుకు సాగాలి. ☆

# తెలంగాణలో రైతులకు భారంగా మారిన ధరణి పోర్టల్

ధరణి విధానం భూస్వాములకు వరంగాను, పేద రైతులకు శాపంగాను మారింది. టీఆర్ఎస్ ప్రభుత్వం భూమి సమస్యలన్నింటికీ పరిష్కారంగా తీసుకొచ్చిన ధరణి సమీకృత భూ రికార్డుల నిర్వహణ వ్యవస్థలో చాలా లోపాలున్నాయి. వీఆర్వోలు వెంటబడి తీసుకున్న సమాచారం ధరణిలో తప్పుల తడకగా మారింది. ధరణికి ముందు అందరికి తెలిసి రెండు పుస్తకాలుగా ఉండేవి. ఒకటి రైతు పాస్ పుస్తకం, రెండవది యాజమాన్య హక్కుల పుస్తకం. ఈ పుస్తకంలో భూమిరకం, భూమి స్వభావం అని స్పష్టంగా రాసి ఉండేది. ప్రస్తుతం ధరణి విధానంలో ఇవేవీ కనబడవు. రైతు పాసుబుక్‌లో ఉన్న సమాచారం మాత్రమే ధరణిలో ఉంటుంది. దీనిలో పహనిలో 'డి' కాలమ్ తొలగించారు. అధికార మార్పిడి (1947) వచ్చినప్పటి నుండి ఉన్న కాలమ్ కౌలుదార్ల కాలమ్. దీన్ని తీసివేసి, తెలంగాణ ప్రభుత్వం కౌలుదార్లని గుర్తించదని బహిరంగంగానే ప్రకటించింది. రైతు ఆత్మహత్యలతో మెజార్టీగా చనిపోతుంది కౌలు రైతులే. అయినా టీఆర్ఎస్ ప్రభుత్వం కౌలు రైతును గుర్తించడం లేదు. 'రైతు బంధు' పథకం భూమి యజమానులకే ఇస్తున్న కారణంగా కౌలు రైతులు చనిపోతున్నారు.

ధరణి రాకముందు చాలా పనులు మండల పరిధిలోనే అయ్యేవి. చిన్న చిన్న సమస్యల విషయంలో తహశీల్దారుకు-రైతుకు మధ్య వీఆర్వోలు ఉండేవారు. ఇప్పుడు ఈ వ్యవస్థనే రద్దు చేసారు. దాంతో భూమి సమస్యలకు సంబంధించి రైతు ఎవరి దగ్గరికి వెళ్ళాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. రైతులు తహశీల్దారుని కలిస్తే, తహశీల్దారులు కలెక్టరును కలవమంటున్నారు. సామాన్య రైతు కలెక్టరును కలవడం సాధ్యమయ్యే పనేనా?

ప్రస్తుత పరిస్థితులలో తహశీల్దారు కాస్తా జాయింట్ రిజిస్ట్రారుగా మారిపోయారు. రైతులు తమ సమస్యలు చెప్పుకోవడానికి వెళితే తాము రిజిస్ట్రేషన్ పనుల్లో బిజీగా ఉన్నామంటూ తప్పించుకుంటున్నారు. ఎవరైనా గట్టిగా అడిగితే 'వెళ్ళి కలెక్టరు గారిని కలవండి' అని చెబుతున్నారు. లేదా మీ సేవకు వెళ్ళండని ఉచిత సలహాలు ఇస్తున్నారు. మీ సేవ అనేది ఎలాంటి బాధ్యత, జవాబుదారీ తనంలేని లైసెన్సుడు బ్రోకర్ వ్యవస్థ. రైతుల నుంచి డబ్బులు పిండుకోవడానికి ఇందొక ఆదాయ వనరుగా మారింది. ధరణిలో భూమి విస్తీర్ణం ఆప్షన్ లేదు, భూమి స్వభావ వివరణ లేదు. ఈ కారణంగా రాష్ట్రంలోని ఒక్కో కలెక్టరు దగ్గర 6 నుండి 8 లక్షల వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

### ధరణి నిధులు మింగేశారు

భూ రికార్డుల నిర్వాహణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ రైతులకు ఏ మేరకు ఉపయోగపడిందో కాని.... తహశీల్దార్లకు, ఉన్నత ఆఫీసర్లకు మాత్రం జేబులు నింపింది. ధరణి సాఫ్ట్‌వేర్ రూపకల్పన నుంచి తహశీల్దార్ పనుల్లో పోర్టల్ నిర్వహణ కొరకు 10 లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు రాష్ట్ర వ్యాప్తంగా పక్కదారి పడుతున్నాయి. ఈ వ్యవహారంపై పలు మండలాల నుంచి ప్రభుత్వానికి పిర్యాధులు వస్తున్నాయి. ఈ వార్తలు రోజు పేపర్లో చూస్తున్నాం. ఉదాహరణకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం బోడు గ్రామానికి చెందిన గంగాధర్ సమాచార హక్కు చట్టం క్రింద దరఖాస్తు చేస్తే ఆఫీస్ నుంచి విచిత్రమైన సమాధానమిచ్చారు. భిన్నమైన ప్రశ్నలు ఉన్నాయని, ఇన్ఫర్మేషన్ ఇవ్వడం కుదరదంటూ రిప్లై ఇచ్చారు. రాష్ట్ర ప్రజలందరితో ముడిపడి ఉన్న ధరణి పోర్టల్ సమాచారాన్ని దాపరికం లేకుండా తెలపాల్సి ఉండగా ఆ పోర్టల్ నిర్వహణను ఒక రహస్యంగా అధికారులు భావించడం అనుమానాలకు తావితీస్తుంది.

### అటవీ-పోడు భూముల కొరకు పోరాటం

ఏళ్ళుగా నడుస్తున్న పోడు భూమి వివాదానికి తెర పడడం లేదు. జోడేఘాట్‌లో కొమురం భీం నాయకత్వం నుండి ఇంద్రవెల్లి పోరాటం వరకు నేటికి 40 సంవత్సరాల తర్వాత కూడా భూముల కొరకు పోరాటం తప్ప సమస్య పరిష్కారం కాలేదు. దీంతో నిత్యం ఆదివాసులు, రైతులు ఫారెస్టు ఆఫీసర్లతో గొడవలు కొనసాగుతూనే ఉన్నాయి. పోడు వ్యవసాయం చేసుకునే రైతులు తమ భూములకు పట్టాలివ్వాలంటూ ఆందోళనలు చేయడంతో పోలీసులు, ఫారెస్టు ఆఫీసర్లు వారిపై జులుం చూపించడం తరచు జరుగుతూనే ఉంది. తాజాగా ఏప్రిల్ 2021 కొమురం భీం అసిఫాబాద్ జిల్లా, పెంచికల్‌పేట మండలం, కొండపల్లి గ్రామంలో ఆదివాసులు చేపట్టిన దీక్షను పోలీసులు భగ్నం చేసారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, గుండాల మండలం, మామకన్ను పంచాయితీలో ఫారెస్టు ఆఫీసర్ల, పోడుభూమి సాగుదారుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దుమ్ముగూడెం మండలం (ఫిబ్రవరి 2021లో) కొత్తురుతో పాటు చింతగుప్ప వద్ద అటవీ సిబ్బంది పోడు భూములు లాక్కుంటున్నారని ఆదివాసీ మహిళలు రెవెన్యూ ఆఫీసర్లపై దాడి చేశారు. వారిని చెట్లకు బంధించి కొట్టారు. మేము పోడు చేసుకుంటున్న భూములను హరితహారం పేరుతో అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారనే ఆగ్రహంతో మహిళలు ఈ చర్యకు దిగినారు. గంగారం మండలం, మదగూడెంలో ఫారెస్టు, పోలీసులు వచ్చి భూములలో మొక్కలు నాటుతే ఘర్షణ జరిగింది.

టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే "పోడు భూముల" సమస్య తీర్చేస్తామంటూ 7 సంవత్సరాల క్రితం కేసీఆర్ ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడంతో సమస్య మరింత జఠిలంగా మారింది. అదిలాబాద్, కొమరం భీం, ములుగు, మహబూబాబాద్, జయశంకర్,

భద్రాద్రి కొత్తగూడెం నాగర్‌కర్నూల్ జిల్లాల్లో దాదాపు 16 లక్షల ఎకరాల్లో పోడు భూముల సమస్య ఉంది.

### ఏజెన్సీలో అక్రమ వెంచర్లు... 1/70 యాక్టుకు విరుద్ధంగా భూముల క్రయవిక్రయాలు

1/70 యాక్టు ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో వలస వచ్చిన వాళ్ళు ఆదివాసుల భూములు కొనడం, అమ్మడం చేయరాదు. ఒకవేళ కొన్నా, అమ్మినా అది చెల్లదు. ఆ భూముల్లో ఎలాంటి శాశ్వత నిర్మాణాలు చేపట్టరాదు. అసిఫాబాద్, ఉట్నూర్, ఏటూరునాగారం, భద్రాచలం, ఇల్లందు ఏజెన్సీ పరిధిలో ఆదివాసేతర్లు ఈ చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. కొందరు రియల్టర్లయితే యథేచ్ఛగా వెంచర్లు చేస్తున్నారు. మల్టీస్టోర్ బిల్డింగులు కడుతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే తమ ఉనికికే ప్రమాదమని ఆదివాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొన్నేళ్లుగా ఏజెన్సీలో భూక్రయ విక్రయాలు, అక్రమ నిర్మాణాలను ఆపాలని ఆదివాసీ సంఘాల అధ్వర్యంలో పోరాడుతున్నాయి. ఉన్నతాధికారులు పట్టించుకొకపోవడంతో ఇప్పుడు స్వయంగా వాళ్లే రంగంలోకి దిగి ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతంలో సర్వే చేసి అక్రమ వెంచర్లు, నిర్మాణాలను గుర్తించారు. తాజాగా ఆ లిస్టును ఉన్నతాధికారులకు అందచేసి, ఇప్పటికైనా చర్యలు తీసుకోండి అంటూ బంతిని అధికారుల కోర్టులోకి నెట్టారు. ఆదివాసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

### అనాధికారికంగా "రియల్ ఎస్టేట్" దందా!

ఏజెన్సీ ప్రాంతాల్లో 1970 కంటే ముందు నుంచి ఉన్న అనుభవదారులు వారి భూముల్లో వ్యవసాయం చేసుకోవచ్చు, ఇల్లు కట్టుకోవచ్చు. కానీ మల్టీసోర్స్ బిల్డింగులు కట్టకూడదు. 1970 తర్వాత వలస వచ్చిన వారు కొనుగోలు చేసిన భూములకు ఎలాంటి హామీ ఉండదు. అవి ఆదివాసుల నుంచి కొనుగోలు చేస్తే తిరిగి వారికే ఇచ్చేయాల్సి ఉంటుంది. ఆదివాసుల భూములు ఆదివాసులకి మాత్రమే అమ్ముకునే వేసులుబాటు ఉంది. ఉదాహరణకు ఆదివాసీ–లంబాడి సమస్య ఈ విధంగానే వైవిధ్యం పెరిగింది. దీనిని మిత్ర వైరుధ్యంగా పరిష్కరించుకోవాలి. అయితే కొద్ది రోజులుగా ఏజెన్సీ గ్రామాల్లో పెద్ద ఎత్తున అనధికారికంగా మాయ మాటలు చెబుతూ కేవలం బాండ్ పేపర్లపైనే కోట్ల రూపాయల విలువైన భూములను తక్కువ ధరకు కొంటున్నారు. ఆ భూముల్లో కొందరు బంగ్లాలు నిర్మిస్తుంటే, మరి కొందరు డూప్లికేట్ పట్టాలు సృష్టించి రియల్ వ్యాపారానికి తెరవేసారు. బేల, ఇచ్చెడ, తలమడుగు, బహార్‌హత్నూర్, వాంకిడి, కేరమేరి, జైనూర్, నార్‌నూర్ తదితర ఏజెన్సీ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో వెంచర్లు వెలిశాయి. ఇచ్చొడ మండల కేంద్రంలోని బజార్‌హత్నూర్ రహదారిలో ఓ ఆదివాసేతరుడు ఏకంగా 50 దుకాణాల సముదాయాన్ని నిర్మిస్తుండడం చర్చనీయాంశమైంది. ఇంద్రవెల్లి, ఉట్నూర్, అసిఫాబాద్ తదితర పట్టణాల్లో రోడ్డుకు ఇరువైపుల బిల్డింగులు, షాపింగ్ కాంప్లెక్సులు కనిపిస్తున్నాయి. వీటి నిర్మాణాలకు గ్రామ పంచాయితీల నుంచి అనుమతులు ఇవ్వడం గమనార్హం. పంచాయితీ అధికారులు 1/70 చట్టానికి తూట్లు పెడుతున్నారు. దీంతో 1970 తర్వాత కొనుగోలు చేసిన భూముల్లో కడుతున్న బిల్డింగుల నిర్మాణాన్ని ఆదివాసులే అడ్డుకుంటున్నారు.

### టీఆర్ఎస్ మంత్రులు, యమ్‌యల్ఏలు – భూమి కబ్జాలు

టీఆర్ఎస్ మంత్రి మల్లారెడ్డి భూ కబ్జాలపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. జనగామ యమ్‌యల్ఏ ముత్తిరెడ్డి–యాదగిరి రెడ్డి దళిత రైతు భూమిని లాక్కొని ఫాంహౌస్ నిర్మించాడని ఆరోపణ వచ్చింది. దేవార మాంజాన ఆలయ యాజమన్యాలను కేటీఆర్, మల్లారెడ్డి అక్రమించి భవనాలు, ఫామ్‌హౌజ్‌లు నిర్మించారు. మాజీమంత్రి ఈటల రాజేందర్ 60 ఎకరాల అసైన్డ్ భూములను ఆక్రమిస్తే మంత్రి పదవి నుండి తొలగించారు. ఈ విధంగా రాష్ట్రంలో భూ కబ్జాలు కొనసాగుతున్నాయి.

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చాలా విషయాలలో అరచేతిలో స్వర్గం చూపిస్తుంటాడు. ధరణి పోర్టల్ విషయంలో కూడా అదే జరిగింది. రైతుల కష్టాలన్నీ తీరుతాయని చెప్పారు. కాని ధరణి పోర్టల్ కారణంగా గ్రామాలలో వైరుధ్యాలు మరింత పెరిగాయి. ఇబ్బందులు మరింత ఎక్కువ అయ్యాయి. భూముల చుట్టూ రియలేస్టేట్ దందా కొనసాగుతున్నది.

సకల జనుల సర్వే చేసిన తెలంగాణ ప్రభుత్వం సమగ్ర భూసర్వే చేయడానికి సిద్ధంగా లేదు. తెలంగాణలో మిగులు భూములు వివిధ రూపాలలో దాదాపు కోటి ఎకరాలు ఉంది. సామ్రాజ్యవాదులు, పెట్టుబడిదారులు, రాజకీయ నాయకులు, భూస్వాములు, రియల్‌మాఫియా కార్పొరేట్ శైలిలో కొత్త రూపాలలో భూ కేంద్రీకరణ చేస్తున్నారు. ఫలితంగా ఆదివాసుల, దళితుల, రైతాంగం చేతిలోని భూమి వారికి కాకుండా మరింత దూరమవుతున్నది. ఓ వైపున భూములపై దాడులు కొనసాగిస్తూ ఆదివాసీ, దళితుల, ఇతర వెనుకబడిన వర్గాల భూముల నుండి బేదాఖల్ చేస్తున్నారు. మరోవైపు ఎన్నికల్లో ప్రగల్భాలు పలికిన తెలంగాణ రాష్ట్ర సమితి ప్రజలను అణచివేస్తూ మరీ భూముల వేటలో పోటీ పడుతున్నది. హరితహారం, సింగరేణి ఓపెన్‌కాస్టు గనులు, ప్రాజెక్టులు, ఫార్మా కంపెనీలు, ఫిలీం సిటీలు, గనుల తవ్వకాలు, టైగర్ జోన్స్, రోడ్ల విస్తరణ మొదలైన రూపాలలో దాదాపు 3 లక్షల ఎకరాలను ప్రభుత్వం బలవంతంగా ప్రజల నుండి అక్రమించుకున్నది.

భూ గరిష్ట పరిమితి చట్టాలు, ఇందిరమ్మ పథకాలు, అటవీ హక్కుల చట్టాలు, 1/70 చట్టాలు ఉన్న పీడిత ప్రజలకు అనుకూలంగా ఎన్నడూ అమలు జరుగలేదు. ఉన్న చట్టాలు అమలు జరగాలన్నా భూమి లేని వారందరికి భూమి దక్కాలన్నా పోరాటమే మార్గమని చరిత్ర చెబుతుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రాంతంలో – వర్గ పోరాటాన్ని తీవ్రతరం చేయాలి. ☆

## మూడు సాగుచట్టాల రద్దును డిమాండ్ చేస్తూ జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమాలు చేపడుతున్న రైతాంగానికీ, ప్రత్యేకంగా మహిళా రైతాంగానికి మా విప్లవ జేజేలు!!

**దేశీయ, అంతర్జాతీయ కార్పొరేట్ శక్తుల బారి నుంచి వ్యవసాయాన్నీ, ప్రజాస్వామ్యాన్నీ, దేశ సార్వభౌమత్వాన్ని రక్షించేందుకు పోరాడుతున్న రైతాంగానికి క్రియాశీల మద్దతును తెలపండి!**

**మూడు సాగుచట్టాలను సమర్థించే అన్ని పార్టీల రాజకీయ నాయకులను సామాజిక బహిష్కరణకు గురిచేయండి!!**

**నూతన ప్రజాస్వామ్యం కోసం ఐక్య, రాజకీయ మహోద్యమాన్ని నిర్మించండి!!**

మోడీ ప్రభుత్వం, 2020 జూన్–సెప్టెంబర్ మాసాల మధ్య, కరోనా కాళరాత్రి సమయంలో, పార్లమెంటులో తమకున్న మూకబలంతో, వ్యవసాయానికి చెందిన మూడు ఆర్డినెన్సులను, ఆ తదుపరి చట్టాలను చేసింది. ప్రజలంతా, ఒక్కమాటలో చెప్పాలంటే దేశమంతా కరోనా వైరస్ బారినపడి సతమతమవుతుంటే, మోడీ ప్రభుత్వం మాత్రం పార్లమెంటులో చర్చ, ఓటింగ్ వంటి కనీస ప్రజాస్వామిక సూత్రాలను కూడా పరిగణలోకి తీసుకోకుండా హడావిడిగా, ఏకపక్షంగా, నిరంకుశంగా మూడు సాగుచట్టాలను చేసింది. ఈ చట్టాలను తేవడానికి రాష్ట్రాలకున్న అధికారాలను గుంజుకొని, రాజ్యాంగ ఫెడరల్ లక్షణాన్ని ధ్వంసం చేసింది. వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం, నిలువ, ధాన్యాలను దాచడం, వ్యవసాయ మార్కెట్, ఒప్పంద వ్యవసాయం –వంటి మార్పులన్నీ 7వ షెడ్యూల్‌లోని రాష్ట్రాల జాబితాలోనివి అయినప్పటికీ, వీటిపై పార్లమెంటులో చట్టాలు చేయడానికి వీలు లేనప్పటికీ, మోడీ ప్రభుత్వం బెదిరింపులతో, అదిరింపులతో రాష్ట్రాల అధికారాన్ని గుంజుకొని ఈ మూడు సాగుచట్టాలను చేసింది. ఈ మూడు సాగుచట్టాలు రైతులకు తమ వ్యవసాయ ఉత్పత్తులను దేశంలో ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛను కల్పిస్తూ, తమ ఆదాయం పెంచుకోవడానికి దోహదపడేవి అంటూ పచ్చి అబద్దాలను ప్రచారం చేసింది. వాస్తవంగా ఈ మూడు సాగుచట్టాలు దేశ సార్వభౌమత్వానికీ, రైతాంగ ప్రయోజనాలకు వ్యతిరేకమైనవి. ఈ చట్టాలను రూపొందించిన క్రమం కూడా, కనీస ప్రజాస్వామిక సూత్రాలకు వ్యతిరేకమైనది. ఈ ప్రభుత్వం తన కార్యాచరణకు మార్గదర్శిగా భావిస్తున్న రాజ్యాంగ సూత్రాలకు సైతం విఘాతం కలిగించేదే.

మోడీ ప్రభుత్వం తెచ్చిన మూడు సాగుచట్టాలు, రైతులకోసం తెచ్చినవి కావు. అవి అంబానీ, ఆదాని వంటి దేశీయ కార్పొరేట్ సంస్థలతోపాటు, విదేశీ బహుళజాతి సంస్థలకోసం మాత్రమే తెచ్చినవి. ఈ మూడు సాగుచట్టాలు, రైతులకు తమ వ్యవసాయ ఉత్పత్తులను, దేశంలో ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛను కల్పిస్తాయనేది పచ్చి బూటకం. ఇందుకు బదులుగా ఆ చట్టాలు, ఇప్పటికే ఎంతో కొంత మేలు చేస్తున్న వ్యవసాయ మార్కెట్(మండి)లను ధ్వంసం చేసి, దేశీయ, అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలకు, రైతాంగం నుంచి వ్యవసాయ ఉత్పత్తులను అగ్గ్వ(తక్కువ ధర)కు కొని దోపిడీ చేసే, వినియోగదారున్ని కష్టాలపాలు చేసే, స్వేచ్ఛను మాత్రం కల్పిస్తాయి. ఇంకో మాటలో చెప్పాలంటే, నూటికి 80 మంది 5 ఎకరాలలోపు రైతులే ఉన్న ఈ దేశ ప్రత్యేక పరిస్థితులలో, బకరాల వంటి బక్కచిక్కిన రైతులను దేశీయ, అంతర్జాతీయ కార్పొరేట్ తొడేళ్ళతో ఒప్పందాలు చేసుకునే స్వేచ్ఛను మాత్రం మోడీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిందని చెప్పాలి.

పై వాస్తవాలను అర్థం చేసుకున్న అనేక రైతుసంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చలో సమీకృతులవుతూ, ఈ మూడు సాగుచట్టాలకు వ్యతిరేకంగా, క్రూరమైన ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొంటూ సమరశీలంగా తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. ఈ రైతాంగ పోరాటం పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌ల నుంచి క్రమంగా దేశం నలుమూలలకు విస్తరిస్తూ బలపడుతున్నది. ఈ పోరాటం, కేవలం మూడు సాగుచట్టాల రద్దుకే పరిమితం కాలేదు, రైతాంగానికి వ్యతిరేకంగా కేంద్రప్రభుత్వం ముందుకు తెచ్చిన విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని కూడా డిమాండ్ చేస్తున్నది. ఆయిల్ ధరలు, నిత్యవసర సరుకుల ధరల పెంపునకు వ్యతిరేకంగా ఆందోళన చేపడుతున్నది. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న దేశీయ, అంతర్జాతీయ కార్పొరేట్‌ల అనుకూల విధానాలను, వ్యతిరేకిస్తూ నినదిస్తున్నది. ఈ పోరాటం కేవలం రైతాంగానికే పరిమితం కాలేదు, సమాజంలోని అన్ని పీడితవర్గాలు, సెక్షన్‌లు ఈ పోరాటానికి మద్దతు తెలియజేస్తున్నాయి. నవంబర్ 26న జాతీయస్థాయిలో జరిగిన సాధారణ సమ్మెలో, 25 కోట్ల మంది కార్మికులు మూడు సాగుచట్టాలను వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టారు. సంయుక్త కిసాన్ మోర్చ (ఎస్.కే.ఎమ్), అఖిల భారత రైతుపోరాట సమన్వయ కమిటీ (ఏ.ఐ.కే.ఎస్.సీ.సీ)లు ఇచ్చిన పిలుపులకు, దేశవ్యాపితంగా విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు ఇతర శ్రామిక ప్రజానీకం అనుకూలంగా స్పందించారు, స్పందిస్తున్నారు.

కేంద్రప్రభుత్వం మాత్రం, ఉద్యమం ప్రారంభమై 8 నెలలు గడుస్తున్నా, మొక్కుబడిగా 11సార్లు రైతాంగంతో చర్చలు జరిపి, సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నది. ఈ చర్చలలో పాల్గొంటున్న రైతునాయకులు ప్రధానంగా మూడు సాగుచట్టాలను రద్దు చేయాలనీ, కనీస మద్దతు ధర (ఎమ్.ఎస్.పీ)ను చట్టబద్ధం చేయాలని డిమాండ్ చేస్తూ, మరోమధ్యేమార్గం లేదని తేల్చి చెప్పారు. ప్రభుత్వం మాత్రం రైతాంగం చేస్తున్న డిమాండ్‌లను ఆమోదించడం సాధ్యం కాదని మొరటుగా సమాధానం ఇస్తూ, ఆ చట్టాలకు లోబడి కొన్ని సవరణలను మాత్రం పరిశీలనలోకి తీసుకుంటామని అంటున్నది. కేంద్ర వ్యవసాయమంత్రి నరేంద్రసింగ్ తోమర్, ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాలలో, ప్రతిపక్షాలు మూడు సాగుచట్టాలపై అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, దేశంలో మెజారిటీ రైతులు సాగుచట్టాలను ఆహ్వానిస్తున్నారని రైతాంగ ఉద్యమకారులను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసాడు. మొత్తంగా చూసినప్పుడు కేంద్రప్రభుత్వం, సుప్రీంకోర్టు ఇచ్చిన స్టేతో, ఈ మూడు సాగుచట్టాల అమలును 18 నెలలకు వాయిదా వేసినప్పటికీ, ఈ లోపు సమస్యను న్యాయబద్ధంగా పరిష్కరించేందుకు ఏ మాత్రం సిద్ధపడకుండా, మొండి వైఖరిని చేపట్టి కాలయాపన చేస్తున్నది. మరోవైపు సుప్రీంకోర్టు కేంద్రప్రభుత్వానికీ, రైతుసంఘాలకు మధ్య నెలకొన్న ప్రతిష్ఠంబనను తొలగించేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించేందుకు, గతంలో 3 సాగుచట్టాలకు మద్దతు తెలిపిన 4గురు పెద్దమనుషులతో మొక్కుబడిగా ఒక కమిటీని నియమించింది. ఈ నియామకాన్ని మొదట్లోనే భారతీయ కిసాన్ మోర్చా నాయకులతోపాటు, ఇతర రైతుసంఘాల నాయకులు కూడా వ్యతిరేకించారు. ఈ కమిటీ ఇటీవలనే తన నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించింది.

కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న పై కుట్రపూరిత, మోసపూరిత పద్ధతులనూ, విధానాలను రైతాంగ ఉద్యమకారులు ఎటువంటి శషభిషలు లేకుండా తిరస్కరిస్తున్నారు, తిప్పికొడుతున్నారు. గడ్డకట్టే చలిలో సైతం, వేలాది మంది రైతాంగ ఉద్యమకారులతో దేశ రాజధాని ఢిల్లీ ప్రవేశమార్గాలు ఘాజియాబాద్, సింఘూ, టిక్రీ సరిహద్దులు దద్దరిల్లిపోతున్నాయి. రైతాంగ కమిటీలు ఇచ్చిన పిలుపులతో, రైతులు నిరవధిక, నిరంతర దివారాత్రి బైటాయింపు కొనసాగిస్తున్నారు. గడిచిన 8 నెలలుగా భారతబంద్, చలో పార్లమెంట్ వంటి సామూహిక, సమరశీల ఆందోళనలు చేపట్టారు. నిరంతరాయంగా నిరసన కార్యక్రమాలను కేంద్రీకరణ, వికేంద్రీకరణ పద్ధతులలో నిర్వహిస్తున్నారు. ఖేతీ బచావో, లోక్‌తంత్ర్ బచావో నినాదాలతో ఢిల్లీ సరిహద్దులు దద్దరిల్లుతున్నాయి. ఈ రైతాంగ ఉద్యమం రోజురోజుకు తీవ్రతరం అవ్వటమే కాకుండా, దేశంలోని వివిధ రాష్ట్రాలకు విస్తరిస్తున్నది. జులై మాసంలో సంయుక్త కిసాన్ మోర్చ ఇచ్చిన పిలుపు మేరకు మూడు సాగుచట్టాలకు వ్యతిరేకంగానూ, ఆయిల్, నిత్యావసర ధరలకు వ్యతిరేకంగాను 13 రాష్ట్రాలలో రైతాంగ నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఈ మధ్య కాలంలో రైతాంగ కమిటీలు ఇచ్చిన పిలుపు మేరకు ఎన్.డీ.ఏలో ఉన్న రాజకీయ పార్టీలను గ్రామాలకు రాకుండా హర్యానా, పంజాబ్ రాష్ట్రాలలో సామాజిక బహిష్కరణకు గురి చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న వర్షాకాలపు పార్లమెంటరీ సమావేశాల సందర్భంగా, ప్రభుత్వం నిర్బంధ ఉత్తర్వులు జారీ చేయడం వలన ప్రతిరోజు 200 మంది రైతులు మాత్రమే, జంతర్ మంతర్ వద్ద, నిజమైన ప్రజాస్వామిక స్ఫూర్తితో 'కిసాన్ సంసద్' (పార్లమెంట్ సమావేశాలు)ను నిర్వహిస్తున్నారు. పార్లమెంట్ దిశగా కవాతులు చేస్తున్నారు. ఇందులో మహిళా రైతుల పాత్ర చాలా కీలకంగా ఉంటున్నది. జులై 26న మహిళా రైతులు ప్రత్యేకంగా నిర్వహించిన 'కిసాన్ సంసద్'లో 'పొలాలనూ దున్నగలం, దేశాన్నీ నడపగలం' అంటూ చేసిన ఉపన్యాసాలు దేశప్రజలకు గొప్ప ప్రేరణగా నిలిచాయి. ఈ సందర్భంగా రైతాంగం, పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యే ఎమ్.పీ(పార్లమెంట్ మెంబర్లు)లకు, మూడు సాగుచట్టాలకు వ్యతిరేకంగా చర్చించాలని 'పీపుల్స్‌విప్' జారీ చేసారు. పార్లమెంట్ సమావేశాల ఎదురుగా జరుగుతున్న ఈ పోరాట రూపాలను, పార్లమెంట్ సమావేశాల ముగింపు తేదీ (ఆగస్టు 9)వరకు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్న రైతాంగం, రోజువారి కార్యక్రమాలను కూడా ప్లాన్ చేసుకున్నారు. ఆగస్టు 9న మరోసారి, మహిళా రైతుల ప్రత్యేక పార్లమెంట్, మార్చ్‌కు పథకం రూపొందించారు. పార్లమెంట్ సమావేశాలనంతరం తమ ఉద్యమాన్ని తీవ్రతరం చేసేలా భవిష్యత్ కార్యక్రమాన్ని కూడా రూపొందించుకున్నారు.

అయితే ఈ నిరసన కార్యక్రమాలన్నీ, ప్రభుత్వ పోలీసు సిబ్బంది చేపట్టిన క్రూరమైన అణిచివేత చర్యల మధ్యనే జరిగాయి. ఉద్యమ ప్రారంభ దశలో, 2020 శీతాకాలంలో టిక్రీ, సింఘూ సరిహద్దు రోడ్లమీద విపరీతమైన శీతల పవనాలు వీస్తుండటంవల్ల, ఇక్కడ నిరసన వ్యక్తం చేస్తున్న చాలా మంది రైతులు తీవ్రమైన చలికి మరణించారు. ఇంతటి అననుకూల పరిస్థితులలో సైతం, తమ న్యాయమైన హక్కుల కోసం ఎంతో శాంతియుతంగా, క్రమశిక్షణగా పోరాడుతున్న రైతాంగంపై, కేంద్రప్రభుత్వం ఉసిగొలిపిన పోలీసులు అత్యంత అమానుషంగా నీటి ఫిరంగులతో దాడి చేసారు. అసలే గడ్డకట్టుకుపోయే చలి పరిస్థితులలో, పోలీసులు జరిపిన ఈ అమానుషమైన దాడిలో రైతుల మరణాలు వందల సంఖ్యకు చేరాయి. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాలలో ప్రతిపక్షాలు, ప్రభుత్వాన్ని, మరణించిన రైతుల సంఖ్యను చెప్పాల్సిందిగా నిలేస్తే, కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ మరణాల సంఖ్యను చెప్పలేకపోయాడు. ఈ స్థితి, పోరాడుతున్న రైతాంగం విషయంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్యపూరిత, బాధ్యతారాహిత్య వైఖరిని బహిర్గతపరిచింది.

జనవరి 26న, ఢిల్లీలో రైతుల ర్యాలీకి అంగీకారం తెలిపిన ప్రభుత్వం, తాను అనుమతించిన మార్గాలలో సైతం పోలీసులతో బారికేడ్లు నిర్మించి, రైతుల ర్యాలీకి అనేక ఆటంకాలు సృష్టించింది. అయినా రైతులు తమ ర్యాలీని విరమించలేదు, పోలీసులు నిర్మించిన

బారికేడ్లను తొలగించుకొంటూ, వారు సృష్టించిన ఆటంకాలను తిప్పికొడుతూ పురోగమించారు. ఇదే సందర్భంలో కొందరు, తమ తీవ్ర నిరసనను తెలియజేయడంలో భాగంగా, ఎర్రకోట బురుజులపై రైతాంగ జెండాలను ఆవిష్కరించారు. ఈ సంఘటనను ఆసరా చేసుకొని జనవరి 27న పోలీసులు రైతాంగంపై అల్లర్లు ప్రోత్సహించారనీ, ప్రజల ఆస్తిని ధ్వంసం చేసారనీ, పోలీసులపై దాడి చేసారనీ, 200 మంది నుంచి 300 మంది పోలీసులను గాయపరిచారని తప్పుడు ఆరోపణలు చేస్తూ, 22 ఎఫ్.ఐ.ఆర్‌లు దాఖలు చేసారు.

జులై 11, 2021న హర్యానా రాష్ట్రం, సిర్సాలో రైతులు బీ.జే.పీకి చెందిన అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రణబీర్‌గంగ్వాను, మూడు సాగుచట్టాలకు మద్దతు తెలిపినందుకు, సామాజిక బహిష్కరణలో భాగంగా అడ్డుకున్నారు. అప్పటికే క్రాంతికారీ కిసాన్ మజ్దూర్ సంఘనేత దర్శన్‌పాల్‌సింగ్, 'బీ.జే.పీ నేతృత్వంలోని ఎన్.డీ.ఏ ప్రభుత్వం అన్యాయంగా రూపొందించిన మూడు సాగుచట్టాలకు మద్దతు ఇచ్చే స్వతంత్రులతో సహా, అందరూ శాసన సభ్యులను శాంతియుతంగా బహిష్కరిస్తామనీ, రాష్ట్రవ్యాపితంగా గ్రామాలలోకి రాకుండా అడ్డుకుంటామని' ప్రకటించి ఉన్నాడు. ఈ పిలుపు నేపథ్యంలోనే ఈ సంఘటన జరిగింది. దీంతో సిర్సా పోలీసులు 100 మంది రైతులపై 124ఏ (రాజద్రోహం)తో పాటు, 307 (హత్యాయత్నం), 186 (ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వర్తించడంలో ప్రభుత్వ ఉద్యోగులను అడ్డుకోవడం) వంటి క్రూరమైన సెక్షన్‌ల కింద కేసులు బనాయించారు. కొంతమందిని వెంటనే అరెస్టు చేసి జైళ్ళలో వేసారు. దీంతో రైతులు తమ సహచరుల విడుదల కోసం, సిర్సాలో ఆందోళనలు తీవ్రతరం చేసారు. జాతీయ రహదారులపై బైఠాయించారు. రోడ్లను దిగ్బంధించారు. తమ సహచరులను విడుదల చేసే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని ప్రతిజ్ఞ చేసారు.

మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ క్రూరమైన నిర్బంధం, రైతుల మేరకే ఆగలేదు, చివరికి, అన్నదాతలకు అన్నం పెట్టడానికి వనరుల సహాయం చేస్తున్న, ధార్మికసంస్థల కార్యనిర్వాహకులను సైతం వెంటాడింది. వారిపై కూడా రాజద్రోహం కేసులు పెట్టింది. ఈ కేసులలో, సాక్షులుగా, ఎన్.ఐ.ఏ పోలీసులు హాజరు కావాలని సమన్లు జారీ చేసింది. రైతులపై జరుగుతున్న ఈ దాడుల్లో, పోలీసులతోపాటు, కొన్నిచోట్ల ఫాసిస్టు మూకలైన బీ.జే.పీ, ఆర్.ఎస్.ఎస్ కార్యకర్తలు కూడా పాల్గొన్నారు. ఢిల్లీ సరిహద్దులోని ఘాజీపూర్‌లో, జూన్ 30న ఈ ఫాసిస్టు మూకలు రైతులపై రాళ్ళదాడికి పాల్పడ్డారు. ఢిల్లీ-ఉత్తరప్రదేశ్ సరిహద్దు ఘాజీపూర్‌వద్ద, ఢిల్లీ-మీరట్ ఎక్స్‌ప్రెస్‌వే పై ఉన్న రైతుల పోరాట శిబిరంపై, మధ్యాహ్నం ప్రాంతంలో ఈ ఫాసిస్టు మూకలు బీ.జే.పీ జెండాలు పట్టుకొని గుంపుగా వచ్చి అరుపులు, కేకలతో దాడి చేసారు. ఈ దాడిలో రైతులతోపాటు, రైతు ఉద్యమానికి మద్దతునిచ్చేందుకు వచ్చిన ఇతర పార్టీల కార్యకర్తలు కూడా గాయపడ్డారు. దీంతో కోపోద్రిక్తులైన రైతులు, ప్రతిదాడికి దిగడంతో, ఈ గుండాలు తోకముడిచారు. మోడీ ప్రభుత్వం, ఢిల్లీ సరిహద్దులను, భారత సరిహద్దులకంటే బందోబస్త్‌గా, మూడంచెల బారికేడ్లను నిర్మించి, రైతాంగ ఉద్యమాన్ని క్రూరంగా అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నది.

మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ క్రూర నిర్బంధాన్ని, రైతుఉద్యమకారులు ధీటుగా ఎదుర్కొంటూ, ఉద్యమాన్ని తీవ్రతరం చేసే క్రమంలో, మరింతగా రాటుదేలుతున్నారు. ఎప్పటికప్పుడు సృజనాత్మక పద్ధతుల్లో, నూతన పోరాటరూపాలు చేపడుతున్నారు. మూడు సాగుచట్టాలకు వ్యతిరేకంగా, రైతాంగం నిర్వహిస్తున్న ఈ సమరశీల మహోద్యమానికి, మెజారిటీ ప్రతిపక్ష పార్టీలు అనివార్యంగా మద్దతునివ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ మద్దతు ఎంత అవకాశవాదంతో కూడుకున్నదైనప్పటికీ, ఆయా పార్టీలు ప్రస్తుతం జరుగుతున్న వర్షాకాలపు చట్టసభ(లోక్‌సభ, రాజ్యసభ)ల సమావేశాలలో, మూడు సాగుచట్టాలకు నిరసనగా ఆందోళన చేపట్టి, చట్టసభలను స్తంభింపజేస్తున్నారు. ఈ క్రమంలో, రైతాంగ ఉద్యమ న్యాయబద్ధతకు, దేశవ్యాపితంగా రోజురోజుకు మద్దతు పెరుగుతున్నది.

ఈ పరిణామాలతో బెంబేలెత్తిన మోడీ ప్రభుత్వం, ఒకవైపున రైతాంగ ఉద్యమాన్ని అణిచివేసేందుకు ఫాసిస్టు నిర్బంధాన్ని అమలు జరుపుతూనే, మరోవైపు మోసపూరిత గిమ్మిక్కులకు పాల్పడుతున్నది. గతంలో ప్రభుత్వానికీ, రైతాంగానికి మధ్య జరిగిన చర్చల సందర్భంగా, కేంద్ర వ్యవసాయశాఖమంత్రి రైతాంగ ప్రతినిధులతో, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ (మండి)లను మూసివేయడంలేదని చెప్పాడు. కానీ, వాస్తవంగా మూడు సాగుచట్టాల ప్రకటన వెలువడిన తర్వాత, మెజారిటీ మండీలు మూతపడ్డాయి. మండీలలో పని చేస్తున్న వందలాది మంది ఉద్యోగులు, ఉపాధి కోల్పోయి వీధిన పడ్డారు. ఈ చర్చల సందర్భంగానే, మోడీ ప్రభుత్వం, కనీస మద్దతుధర (ఎమ్.ఎస్.పీ)పై లిఖితపూర్వక హామినిస్తానంటున్నది. ఈ సంవత్సరం రైతాంగం నుంచి, ముఖ్యంగా పంజాబ్ రైతాంగం నుంచి ప్రభుత్వం ఎప్పుడూ సేకరించనంత ఆహార ధాన్యాలను, మద్దతు ధరకు సేకరించిందని ప్రకటనలు చేస్తున్నది. ఈ గిమ్మిక్కులను రైతాంగం ఏ మాత్రం విశ్వసించడం లేదు. చేసిన చట్టాలకే దిక్కులేనప్పుడు, ఇచ్చిన హామీలకు గ్యారంటీ ఏమిటని ప్రశ్నిస్తూ, ఎమ్.ఎస్.పీ విషయంలో కనీసం, చట్టమైనా చేయాలని పట్టుబడుతున్నారు.

ఈ మధ్య, జులై మాసంలో, మోడీ ప్రభుత్వం 'వ్యవసాయ మౌలిక వసతుల నిధి' (ఏ.ఐ.ఎఫ్) పేరిట, ఒక లక్ష కోట్ల రూపాయలను కేటాయిస్తూ రైతులను బురిడి కొట్టించి, ఉద్యమం నుంచి పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించింది. ఈ ప్రకటన వెలువడగానే 'సంయుక్త కిసాన్ మోర్చా', ఇది రైతులను వంచించేందుకు చేసిన కేటాయింపనీ, ఈ పథకం కింద రైతులు బ్యాంకు ఋణాలు పొందడం అసాధ్యమనీ, ఇది మరొక 'జుమ్లా' (తమాషా, ఆకర్షణ భాషణం) అని వర్ణించింది.

మోడీ ప్రభుత్వం మూడు సాగుచట్టాల పేరుతో, భారతదేశ వ్యవసాయ రంగాన్ని అంతర్జాతీయ, దేశీయ కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసేందుకు ఎంత మొండిగా ఉందో, రైతాంగం, భారతదేశ

వ్యవసాయరంగంతోపాటు, ప్రజాస్వామ్యాన్నీ, దేశ సార్వభౌమత్వాన్ని రక్షించేందుకు అంతకంటే అనేక రెట్ల వజ్రసంకల్పాన్ని కలిగి ఉన్నది. ఈ మహోద్యమం, భారతదేశంలో, మోడీ ప్రభుత్వం పెంచి పోషిస్తున్న బ్రాహ్మణవాద హిందుత్వ ఫాసిజానికీ, అది సంస్కరణల పేరుతో అమలు చేస్తున్న సామ్రాజ్యవాద అనుకూల నయాఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా, నిజమైన ప్రజాస్వామ్యం కోసం పోరాడమని భారత పీడిత ప్రజానీకానికి సందేశాన్ని ఇస్తున్నది. ఈ మధ్య కాలంలో, మోడీ ప్రభుత్వం 'అభివృద్ధి' పేరుతో నయా ఉదారవాద విధానాల అమలును వేగవంతం చేసింది. ప్రభుత్వరంగ పరిశ్రమలలో వందశాతం పెట్టుబడుల ఉపసంహరణ పేరుతో వాటిని ప్రైవేటీకరిస్తున్నది. ఈ నిర్ణయంలో భాగంగానే విశాఖ ఉక్కును అమ్మివేస్తున్నది. ప్రస్తుతం జరుగుతున్న శీతాకాలపు చట్టసభల సమావేశాలలో, ఈ దిశగా బిల్లులు వేగంగా ఆమోదం పొందుతున్నాయి. ఒకవైపున పెగాసెస్, సాగుచట్టాల వంటి కీలక సమస్యాత్మక అంశాల మీద చట్టసభలలో నిరసనలు వెల్లువెత్తుతున్నా, మోడీ ప్రభుత్వం మందబలంతో ప్రజావ్యతిరేక బిల్లులను ఆమోదింపజేస్తున్నది. ముఖ్యంగా జనరల్ ఇన్సూరెన్స్ బిజినెస్ (జాతీయికరణ) సవరణ బిల్లు – 2021ని, ఆమోదింపజేయడం ద్వారా, ప్రభుత్వ రంగ బీమాకంపెనీల్లో ప్రైవేటు పెట్టుబడి భాగస్వామ్యానికి వీలు కల్పించింది. అత్యవసర రక్షణ సర్వీసుల బిల్లు – 2021పై కూడా ఆమోద ముద్ర వేయించుకుంది. దీంతో రక్షణ రంగంలోని కీలక ఉత్పాదక సంస్థలను, ప్రైవేటీకరించడానికి అవరోధాలు లేకుండా చేసుకుంది. ఘోరమైన విషయమేమిటంటే, రక్షణ ఉత్పత్తుల సంస్థలలో కార్మికుల సమ్మె హక్కును అత్యంత అప్రజాస్వామికంగా రద్దు చేసింది. ఈ ప్రజావ్యతిరేక చట్టాలన్నీ 'అభివృద్ధి' ముసుగులో రూపొందుతున్నాయి. వాస్తవంగా మోడీ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, రూపొందిస్తున్న విధానాలు, చట్టాలు సంక్షోభంలోకి కూరుకుపోయిన ప్రపంచపెట్టుబడిదారీ విధానానికి ఊతమిచ్చేందుకే. సామ్రాజ్యవాదులకూ, దేశంలోని దళారీ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు లాభాలు చేకూర్చేందుకే.

గడిచిన 30 ఏళ్ళుగా, దేశ పాలకవర్గాలు అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలతో, పర్యావరణ సంక్షోభం, వనరుల సంక్షోభం వంటి ఆందోళన కలిగించే అంశాలే కాకుండా, ధనికులు, పేదల మధ్య వ్యత్యాసం ఎన్నడూ లేనంతగా పెరిగింది. పేదలకూ, అధిక సంపన్నులకు మధ్య అగాధాన్ని పూడ్చాలన్న, రాజ్యాంగంలోని ఆర్టికల్ 37 కింద పేర్కొన్న విద్యుక్త ధర్మాన్ని, దేశ పాలకవర్గాలు ఎప్పుడో అటకెక్కించేసాయి. ప్రస్తుతం మోడీ ప్రభుత్వం, నయా ఉదారవాద విధానాలను వేగంగా, మొరటుగా అమలు చేస్తూ, ఈ విధానాలకు ఆటంకం లేకుండా చేసేందుకు బ్రాహ్మణవాద హిందుత్వ ఫాసిజాన్ని ఒక రాజకీయ కార్యాచరణగా అమలు చేస్తూ, ప్రజలను విభజించి, పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నది. తన 'అభివృద్ధి' కార్యక్రమాలను వ్యతిరేకించేవారినందరినీ, జాతీయవాదాన్నీ, దేశభక్తిని ముందుకు తెచ్చి నోరు మూయిస్తున్నది. అమానవీయమైన రాజ్యహింసను అమలు చేస్తున్నది.

దేశంలో కొనసాగుతున్న పై రాజకీయ ధోరణికి పూర్తిగా వ్యతిరేక దిశలో, మరో రాజకీయ ధోరణి కూడా కొనసాగుతున్నది. అది ప్రజా రాజకీయాలకు సంబంధించిన ధోరణి. ఈ ధోరణిలో భాగంగా, దేశవ్యాపితంగా అనేక ప్రజా ఉద్యమాలు, స్పష్టమైన ప్రజాస్వామిక రాజకీయ అవగాహనతో పురోగమిస్తున్నాయి. వీటిలో మూడు సాగుచట్టాలకు వ్యతిరేకంగా జరుగుతున్న రైతాంగ ఉద్యమం, దేశవ్యాపిత స్వభావాన్ని సంతరించుకొంటున్నది. సీ.ఏ.ఏ, ఎన్.ఆర్.సీలకు వ్యతిరేకంగా, తిరిగి ఉద్యమించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. విశాఖ ఉక్కు పరిశ్రమను రక్షించుకొనేందుకు, ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం తమ పోరాట కరవాలాలకు సానపడుతున్నారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న హక్కులను, మోడీ ప్రభుత్వం కాలరాచివేస్తుండటంతో, కార్మికవర్గంలో ఆగ్రహం లావాలా రగులుతున్నది. వారు పోరాట చైతన్యాన్ని తమలో నింపుకుంటున్నారు. దేశవ్యాపిత సాధారణ సమ్మెలలో, వారు ఒక్కటై, తమ పోరాట చేవను ప్రదర్శిస్తున్నారు. ఆదివాసీ ప్రాంతాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఫాసిస్టు దమనకాండకు వ్యతిరేకంగా, ముఖ్యంగా, కార్పెట్ సెక్యూరిటీలో భాగంగా ఏర్పాటు చేస్తున్న పోలీసు క్యాంపులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ, సమరశీలంగా పోరాడుతున్నారు, అనేక త్యాగాలు చేస్తున్నారు. ఇంకా అనేక సెక్షన్ల ప్రజలు, తమ సమస్యల పరిష్కారం కోసం, పోరాటబాట పడుతున్నారు. ఈ పోరాటాలు జరగటమే కాదు, ఒకదానికి మరొకటి సంఘీభావం తెలుపుకుంటున్నాయి, మద్దతునిస్తున్నాయి.

ప్రస్తుతం దేశంలో, ప్రధానంగా పైన చెప్పుకున్న రెండు రాజకీయ ధోరణులు కొనసాగుతున్నాయి. ఈ రెండు రాజకీయ ధోరణులు, దేశంలో నెలకొని ఉన్న వస్తుగత స్థితిని అసాధారణమైన రీతిలో ప్రతిబింబిస్తున్నాయి. అయితే తిరోగామి స్వభావం కలిగిన ప్రభుత్వ విధానాలు, దాని ఫాసిస్టు చర్యలు తప్పనిసరిగా పరాజయం పాలవుతాయి. పురోగామి స్వభావం కలిగిన ప్రజా పోరాటాలు, నిరసన పోరాటాలు తప్పనిసరిగా విజయం సాధిస్తాయి. ఈ విజయం ప్రజాస్వామిక విజయంగా ఉంటుంది. ఈ చారిత్రక గమనాన్ని అర్థం చేసుకుంటూ, దేశంలోని పీడితవర్గాలు, పీడిత సామాజిక సెక్షన్లు వర్తమానంలో జరుగుతున్న పోరాటాలకు మద్దతునివ్వాలి. ముఖ్యంగా మూడు సాగుచట్టాలకు వ్యతిరేకంగా, రైతాంగం నిర్వహిస్తున్న చారిత్రక పోరాటానికి, క్రియాశీలక మద్దతును ఇవ్వాలి. అలాగే ప్రజాపోరాటాలన్నీ అనుసంధానించబడాలి. అవి ఐక్య ఉద్యమాలుగా సంఘటితపడాలి. అందుకు పోరాడే శక్తులన్నీ ఐక్యత కోసం గట్టిగా కృషి చేయాలి. అప్పుడే దేశవ్యాపితంగా ప్రజాఉద్యమ వెల్లువ సృష్టించబడి, నూతన ప్రజాస్వామ్యం దిశగా ముందడుగు వేయగలుగుతాము. ☆

# సింగరేణి బొగ్గు గనుల ప్రవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం!

# పాలక వర్గాల కుట్రలను ఎండగడుదాం!

సిరులు కురిపించే, నల్ల బంగారానికి పేరు గాంచిన సింగరేణి ఆంగ్లేయుల కాలం నుంచి బొగ్గు ఉత్పత్తి చేస్తున్న సింగరేణి కార్మికుల కష్టనష్టాలను అధిగమించి నిజాం రాజు ఆదరణతో ఆత్మ విశ్వాసం పెంచుకుని పారిశ్రామికాభివృద్ధికి నిలువుటద్దంగా నిలిచి తనకంటూ ప్రత్యేక గుర్తింపు దక్కించుకుంది. ఆనాటి నుండి ఈనాటి వరకు ఎన్నో మైళురాళ్ళను అధిగమిస్తూ కాలనుగుణ మార్పులతో నవ శంకరావం వైపు అడుగులు వేస్తూ ఉత్పత్తిలో రికార్డులతో దూసుకుపోతున్నది. మొదట్లో పాలేరొళ్ళను, పశువుల జీతగాళ్ళను, రైతు కూలీలను కార్మికులుగా చేసుకొని చేసిన సంస్థ వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నది. దశాబ్దాలుగా లక్షలాది మందికి అన్నం పెడుతూ, సింగరేణి ప్రాంత సామాజిక, ఆర్థిక అభివృద్ధికి బాటలు వేస్తోంది. కుల, మతాలకు అతీతంగా కాలనీల పేరిట మనుషులందరిని ఏకం చేయడమే కాక నలుగురిలో తలెత్తుకు బ్రతికేలా కార్మికులకు భరోసానిస్తూ వస్తున్నది.

ఏజెన్సీ ప్రాంతాలలోనే బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని 1925 లోనే గుర్తించారు. ఇల్లందు నుండి కొత్తగూడెం, బెల్లంపల్లి ఇతర ప్రాంతాలలో కూడా ఉన్నాయని పరిశోధన చేశారు. 1928లో మంచిర్యాల, కొమరం భీం, అసిఫాబాద్ జిల్లాలకు విస్తరించాయి. తెలంగాణలో బంగారు గనిగా పేరు గాంచినది బెల్లంపల్లి.

బెల్లంపల్లిలో మొట్టమొదట బ్రిటీష్ అధికారి మార్గాన్ పేరుతో మార్గాన్ ఫిట్‌గని ప్రారంభమైంది. దీనిని ముందు తాండూర్ కోల్‌మైన్స్‌గా పిలిచేవారు. బెల్లంపల్లి అనంతరం 68 డిప్, 2 ఇంక్లైన్, 85 డిప్, 44 డిప్, నార్త్ క్రాస్‌కట్, 24 డిప్ గనులు ఏర్పడ్డాయి. అనంతరం 65 డిప్ సమీపంలోనే శాంతిగని ఏర్పడింది. ఇవ్వన్నీ భూగర్భ గనులే. ప్రస్తుతం శాంతిగని మిషనరీతో నడుస్తోంది. ఓపెన్‌కాస్టు గనులు ఇక్కడ ఎక్కువగా నడుస్తున్నాయి. డోర్లీ, అబ్బాపూర్ లాంటి గనులు ఉత్పత్తిలో వేగంగా ముందుకు పోతున్నాయి. తాండూర్ ప్రాంతంలో డోర్లీ 1, 2 కైరిగూడ ఓపెన్ కాస్టు గనులు ఏర్పడ్డాయి. ఇంకా కూడా గనుల విస్తరణ జరుగుతూనే ఉన్నది. 1960 ప్రాంతంలో మందమర్రికి గనుల విస్తరణ జరిగింది. ఇందులో కాశీపేట గనులు మాత్రమే పని చేస్తున్నాయి. మిగతావన్ని మూత పడ్డాయి. 1975లో శ్రీరాంపూర్ ఏరియా ఏర్పడింది. తర్వాత 1981లో రామకృష్ణాపూర్ ఏర్పడింది. అందులో 5 గనులు పని చేస్తుండేవి, మిగతా వాటిని ఎత్తివేసారు. ఉన్న ఒక్క ఆర్కే-1ఏ గనిని ఇతర డిపార్ట్‌మెంట్‌లను మందమర్రిలో విలీనం చేసారు. 1991లో చెన్నూర్ ఏరియా ప్రారంభమైంది. ఆ ఏరియాలోని 3 గనులను 5 సంవత్సరాలలోనే మూసివేసారు.

సింగరేణి యాజమాన్యం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గడిచిన కొన్నేళ్ళుగా సింగరేణి సంస్థ లాభాలే పరమావధిగా యాంత్రీకీకరణ వైపు తీసుకుపోయారు. ఉత్పత్తిని పంపే లక్ష్యంగా మానవ వనరుల స్థానంలో యంత్రాలకు, భూగర్భగనుల స్థానంలో ఉపరితల గనులకు పెద్దపీట వేసారు. 1989లో లక్ష 16 వేల మంది కార్మికులుండగా వారి సంఖ్య 50,500లకు పడిపోయింది. 1989-90లో 17.5 మిలియన్ టన్నులుగా ఉన్న బొగ్గు ఉత్పత్తి 66 మిలియన్ టన్నులకు చేరింది. ఉపరితల గనుల ఏర్పాటు, యాంత్రీకీకరణ, కొత్త నియామకాలు లేకపోవడం వల్లే కార్మికుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. ఇప్పుడు 50 వేలకు పడిపోయింది. 20కి పైగా భూగర్భ గనులు మూతపడ్డాయి. 16కు పైగా ఓపెన్‌కాస్టు గనులు పెరగడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ సంస్థ చరిత్రలోనే 16 సార్లు గోల్డెన్ షేక్ హ్యాండ్‌ను పకడ్బందీగా అమలు చేసి 25వేల మంది కార్మికులను ఇంటికి పంపారు. మహిళా ఉద్యోగులను కూడా 500 మందిని వీఆర్ఎస్ ద్వారా ఈ సంస్థ వదిలించుకుంది. గైర్ హాజరు కారణం చెప్పి 4 వేల మంది కార్మికులను డిస్మిస్ చేసింది. 30 వేల మంది ఉద్యోగ విరమణ చేశారు. సంస్థలో ముఖ్యంగా యాంత్రీకీకరణ అమలు, భూగర్భ గనుల స్థానంలో ఓపెన్‌కాస్టు గనుల ఏర్పాటు కారణంగా ఉత్పత్తి భారీగా పెరుగుతున్నది. మరోవైపు కార్మికులను తగ్గించడం కొత్త నియామకాలు చేపట్టకపోవడంతో సింగరేణి ప్రాంతంలో నిరుద్యోగుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది.

ఎస్‌డీఎల్, ఎల్‌హెచ్‌డీల రాకతో తట్టా, చమ్మాస్ మాయం

1880లో ఆవిర్భవించిన సింగరేణి 1980వ దశకం వరకు పూర్తిగా కార్మికులపై ఆధారపడి ఉత్పత్తిని సాధించింది. సంస్కరణల పేరిట క్రమంగా మానవ వనరుల స్థానంలో భారీ యంత్రాలను ఉపయోగించడం ప్రారంభించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించిన ప్రపంచీకరణ ఆర్థిక పారిశ్రామిక విధానాల వల్ల సంస్థలో (సింగరేణి) ఓపెన్ కాస్టు మైనింగ్ ప్రారంభమైంది. 1979లో బొగ్గు బావుల్లో సైడ్ డిగార్జ్ లోడర్స్ (ఎస్‌డీఎల్ యంత్రాలు) ప్రవేశపెట్టారు. భూగర్భ గనుల్లో ప్రమాదకర, భౌగోళిక పరిస్థితులు ఉన్నచోట ఉపయోగించక తప్పదం లేదని సంస్థ యాజమాన్యం సమర్థించుకుంటున్నది. యాజమాన్యం యంత్రాలతో పని చేయిస్తూ కార్మికుల సంఖ్యను తగ్గించారు. 100 మంది పనిని ఒక్క యంత్రం చేస్తుంది. సింగరేణి వ్యాప్తంగా చూసుకుంటే 200పైగా ఎస్‌డీఎల్ యంత్రాలు ఉన్నాయి. వాటి మూలంగా 20 వేల మంది కోల్‌ఫిల్లర్లకు పని లేకుండా పోయింది.

1981లో తక్కువ ఎత్తుగల ప్రదేశాల్లో లోడ్ హాల్ డంపర్లు, రోడ్

మెద్దర్స్‌ను ప్రవేశపెట్టారు. 1983లో లాంగ్ వాల్ మైనింగ్ (ఇది జర్మని టెక్నాలజి) ప్రవేశపెట్టారు. 1989లో ఫ్రెంచ్ దేశం నుంచి దిగుమతి చేసుకున్న బ్లాస్టింగ్ గ్యాలరీ సిస్టం, తర్వాత లాంగ్‌వాల్, షాట్‌వాల్ సిస్టం అమలు కావడంతో టన్నుల కొద్ది బొగ్గును ఉత్పత్తి చేశారు. 1994లో ఇన్‌సిట్ క్రషింగ్ కన్వేయింగ్ సిస్టం ద్వారా భూగర్భ గనిలోంచి బొగ్గును తరలించడం ప్రారంభించారు. ఇలా రకరకాల యంత్రాలు తెచ్చి కార్మికులకు పని లేకుండా చేస్తున్నారు.

సింగరేణి ఆవిర్భవించిన తొలినాళ్లలో అసలు యంత్రాలే లేవు. మొత్తం మనుషులే పని చేసేవారు. స్త్రీలు సైతం బొగ్గుబావుల్లో దిగి ఉత్పత్తి చేసేవారు. కోల్ కట్టింగ్ ఉండేది. కార్మికులు తట్టా చమ్మాస్ ఉపయోగించి బొగ్గుని టబ్బుల్లోకి నింపేవారు. సింగరేణి యాజమాన్యం లాభాపేక్షలతో యంత్రాలను ప్రవేశ పెట్టడంతో తట్టా చమ్మాస్ మాయమైంది. కార్మికులు నిరుద్యోగులుగా మారారు.

సింగరేణి పారిశ్రామిక ప్రగతికి బాటలు వేసి నల్ల బంగారం వెలికితీస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు దక్కించుకుంది. సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యుత్తు రంగానికి ఎదిగి లాభాల ఖాతా తెరిచి, వెలుగులు విరజిమ్ముతూ ఆదర్శంగా నిలిచింది. సింగరేణి సంస్థ వ్యాపార రంగంలోనూ ముందంజలో ఉంది. ఆదిలాబాద్ జిల్లా, జైపూర్‌లో 1200 మెగావాట్లు, 600 మెగావాట్లు సామర్థ్యంగల విద్యుదుత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసి విద్యుత్తు విక్రయం ద్వారా నెలకు రూ. 380 కోట్లను ఆర్జిస్తోంది. దేశంలోనే అతిపెద్ద బొగ్గు పరిశ్రమ కోల్ ఇండియా తర్వాత స్థానం సింగరేణిదే. బెల్లంపల్లి ఏరియా మొత్తం ఆదుకుంటుంది. ఒక రకంగా చెప్పాలంటే భారీ లాభాలతో సింగరేణిని కాపాడుతుంది. 2017-18లో బెల్లంపల్లి ఒక్కటే రూ. 700 కోట్లు లాభాలు సాధించింది. మొత్తం సింగరేణి నికర లాభాలు రూ. 1000 కోట్లు అయితే ఒక బెల్లంపల్లిలోనే లాభాలు 700 కోట్లు వచ్చాయి. భారీ లాభాల బాటన పడడమే కాకుండా సంస్థకు ఇవాళ అతిపెద్ద లాభాలు సాధించే ఏరియాగా బెల్లంపల్లి విరాజిల్లుతుంది.

దేశంలోని బొగ్గు సంస్థల్లో పని చేస్తున్న కార్మికులు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారు. కారుణ్య నియామకాల ద్వారా నేరుగా ఉద్యోగాల నియామకాల ద్వారా 6 వేల మందికి మాత్రమే కొత్తగా ఉపాధి కలిగింది. బొగ్గు గనుల్లో కలుషితమైన వాతావరణం ఫలితంగా, కార్మికులు తీవ్రమైన అనారోగ్యాలకు గురవుతున్నారు. ఐఎల్ఓ కూడా ఈ విషయాన్ని గుర్తించి ఎన్నో సూచనలు చేసినప్పటికీ వాటిని పట్టించుకునే వారు లేరు. ఒకప్పుడు బొగ్గు బావులలో విధులు నిర్వహించడానికి వెళ్ళే కార్మికులకు రొట్టె, గుడ్డు, బెల్లం ఇచ్చే వారు అది బందయి రెండున్నర దశాబ్దాలు దాటింది. ప్రతీ గనిపై ఒక ప్రైమరీ ఆరోగ్య కేంద్రం ఉండాలనేది కేవలం కాగితాలకే పరిమితమైంది. సింగరేణిలో 48 వేల మంది వరకు పని చేస్తున్నారు. అందులో 80 శాతం కార్మికులు భూగర్భ గనుల్లో, 20 శాతం మంది ఉపరితలంలోని బొగ్గు బావుల్లో ఇతర డిపార్టుమెంట్లలో పని చేస్తున్నారు. వాతావరణంలో బొగ్గు గనుల వల్ల వస్తున్న మార్పు ఫలితంగా కార్మికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. గనుల పని స్థలంలో 4, 5 నుంచి 5 మీటర్ల వరకు కనీసం 283 క్యూబిక్ మీటర్ల గాలి అందించాల్సి ఉండగా, కేవలం 150 నుంచి 180 క్యూబిక్ మీటర్ల గాలి మాత్రమే అందుతున్న దాఖలాలు ఉన్నాయి. ఇలాంటి కారణాలతో బొగ్గు బావుల్లో పని చేస్తున్న కార్మికులలో హైపర్‌టెన్షన్ (హైబీపీ) కేసులు ఎక్కువవుతున్నాయి. బొగ్గు బావుల్లో పని చేస్తున్న దాదాపు సగం మంది కార్మికులకు హైబీపీ వుంటోంది. దాదాపు 20 శాతం కార్మికులకు షుగర్ వ్యాధి కూడా వస్తోంది. రానురాను హైపర్‌టెక్షన్ గుండెజబ్బు కూడా సులువుగా వచ్చేలా వాతావరణం ఉంటోంది. ఇలా గుండె ఆగి విధి నిర్వహణలో మరణిస్తున్న కార్మికుల సంఖ్య కూడా రోజు రోజుకు పెరిగిపోతున్నది.

ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలను నెరవేర్చి వారి మెప్పులు పొందటానికి తీసుక వచ్చిన కార్మికవర్గ చట్టాలను, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ కార్మికవర్గం కలిసికట్టుగా సమరశీల పోరాటాలను సమరశంఖం పూరించాలి. అప్పుడే సింగరేణిని కాపాడుకుంటాం. ☆

(... 32వ పేజీ తరువాయి)

## ఇంద్రవెల్లి అమరవీరుడు కామ్రేడ్ జుగునక జగదిరావుకు (గ్రామ పార్టీ సెల్ కార్యదర్శి) విప్లవ జోహార్లు

కా. జుగునక జగదిరావు 1981లో ఏప్రిల్ 20న జరిగిన ఇంద్రవెల్లి భూమి, భుక్తి, విముక్తి పోరాటాల్లో ఆదివాసీ విప్లవ రైతుకూలీ సంఘం తరపున పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నాడు. ఇంద్రవెల్లి కాల్పుల్లో ఎడమ కాళుకు గాయాలతో బయటపడి, ఎన్నో బాధలు అనుభవించి, చివరి వరకు విప్లవోద్యమాన్ని అంటిపెట్టుకొని ఉన్నాడు. తన కుటుంబం అంతా పార్టీకి సేవలు అందించారు. దళాన్ని సురక్షితంగా కాపాడినాడు. కా. జుగునక జగదిరావు అదిలాబాద్ జిల్లా, ఇంద్రవెల్లి మండలం, దశ్నాపూర్ గ్రామంలో పుట్టాడు. అక్కడే పెరిగాడు. బ్రతకడానికి సిరికుండ మండలం వాయిపేట గ్రామ పంచాయితీలోని భీంపూర్ గ్రామంలో బ్రతుకుతున్నాడు. ప్రస్తుతం 65 సం. వయస్సు, అనారోగ్యంతో 20 నవంబర్ 2020నాడు తుది శ్వాసవిడిచాడు. కా. జుగదిరావు గ్రామపార్టీ సెల్ కార్యదర్శిగా ఉంటూ మరణించాడు. వారి కుటుంబానికి కోమురం భీం-మంచిర్యాల డివిజన్ కమిటీ తీవ్ర సంతాపం తెలియచేస్తుంది. ☆

# అడవి - ఆదివాసులు

వనాలు విలపిస్తున్నాయి. అటవివాసులు ఆక్రోశిస్తున్నారు. ఒకటి కాదు రెండు కాదు... పది లక్షల కుటుంబాలు అడవుల నుంచి వెళ్ళిపోవాల్సిన పరిస్థితి దాపురించింది. షెడ్యూల్డ్ తెగల, ఇతర సంప్రదాయ అటవీవాసుల (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం-2006 (క్లుప్తంగా అటవీ హక్కుల చట్టం... ఎఫ్ఆర్ఏ)పై 13 ఫిబ్రవరి, 2019న దేశ సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పే ఆదివాసుల ఈ దురావస్థకు దారి తీసింది. ఆ చట్టం ప్రకారం అడవిలో నివసించేందుకు అర్హతలు లేని వారిని అడవుల నుంచి పంపించివేయాలన్నది సుప్రీం కోర్టు సారాంశం. అడవులలో నివసించడమే ఆదివాసుల అపరాధమైపోయింది. సుప్రీం కోర్టు తీర్పు ఆదివాసుల, ఇతర అటవీవాసుల సహజ హక్కులను కాలరాచివేయడమేనని దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఆ నిరసనలు నిశ్శబ్దమయ్యాయి. ఆదివాసుల మనుగడకే ముంచుకొచ్చిన విపత్తును రాజకీయ పార్టీలే కాదు ప్రజలు మరిచిపోయారు. అసలు సమస్య సుప్రీంకోర్టు తీర్పుతో కాక అటవీ హక్కుల చట్టం ఉత్పన్నమయిందని, ఈ చట్టం ప్రకారం 13 డిసెంబర్, 2005కి పూర్వం నుంచి అడవిలో నివసిస్తున్న గిరిజనులకు వారు సాగు చేసుకుంటున్న భూమిపై హక్కు ఉంటుంది. ఇతర సంప్రదాయ తెగలవారు ఎవరైనా నివాసం ఉంటే 13 డిసెంబర్ 2005కి ముందు 75 ఏళ్ళుగా అక్కడ నివసిస్తున్న వారై ఉండాలి.

అటవీ హక్కుల చట్టం అమలు ప్రక్రియ గ్రామసభతో ప్రారంభమవుతుంది. అడవులలోని ఏదైనా ఒక భూ కమతాన్ని లేదా మరేదైనా అటవీ వనరులపై తమకు హక్కు కల్పించాలని ఎవరైనా ఒక ఆదివాసీ గ్రామసభను కోరినప్పుడు అతడు లేదా ఆమె అభ్యర్థులను సబ్ డివిజనల్ కమిటీ ఆ తరువాత జిల్లా స్థాయి కమిటీ ఆమోదించకపోవచ్చు. అటవీ హక్కుల చట్టంలోని సమస్యాత్మక అంశమేమిటంటే తమ అర్హతలను నిరూపించుకునే బాధ్యతను ఆదివాసీలపైనే ఉంచడం, తమ కుటుంబం అడవిలోనే నివసిస్తుందని, తరతరాలుగా అడవిపైనే ఆధారపడి ఉందని అతడు లేదా ఆమె రుజువు చేయవలసివున్నది. తమ కుటుంబం స్వాతంత్ర్యానికి పూర్వమే అడవులలో సుస్థిరనివాసం ఏర్పర్చుకుందని రుజువు చేయవలసి వున్నది. వలస పాలకులు నిర్వహించిన జనాభా గణన వివరాలు ఎథ్నోగ్రాఫిక్ నోట్స్‌తో సహా చట్టం పేర్కొన్న రుజువుల జాబితాలోంచి ఏ ఒక్క దానినైనా ఆదివాసులు ఎంపిక చేసుకోవచ్చు. వాస్తవమేమిటంటే ఆదివాసులకు సంబంధించిన ఖచ్చితమైన గణాంకాలు ఇప్పటికీ లేవు. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే ఆదివాసులు ఇటీవల కాలంలో సంచార జీవులుగా ఉండేవారు. మరి వారు తమ ఆవాస ప్రాంతం ఇదని ఖచ్చితంగా ఎలా చెప్పగలుగుతారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాన్ని ఎవరి నుంచి పొందగలుగుతారు. ఈ సంక్లిష్టత వల్లే దాదాపు సగం దరఖాస్తులను తిరస్కరించడం జరిగింది.

వన్య ప్రాణుల సంరక్షణకు అంకితమైన ఎన్‌జీఓలు దాఖలు చేసిన పిటిషన్ ప్రకారం అటవీ హక్కుల చట్టం 2006 కింద తమ అటవీ హక్కులను గుర్తించాలని 44 లక్షల దరఖాస్తులు రాగా 23.5 లక్షల దరఖాస్తులను తిరస్కరించడం జరిగింది. 20.5 లక్షల దరఖాస్తుదారుల భూ హక్కులను మాత్రమే గుర్తించడం జరిగింది. అర్హత లేకుండా అడవుల్లో నివసిస్తున్న పది లక్షలకు పైగా కుటుంబాలను అడవి నుంచి ఖాళీ చేయించాలని సుప్రీంకోర్టు గత ఫిబ్రవరిలో రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది.

చారిత్రకంగా, ముఖ్యంగా బ్రిటీష్ వలస పాలనలో ఆదివాసులకు జరిగిన అన్యాయాలను అంతమొందించేందుకే అటవీ హక్కుల చట్టాన్ని తీసుకురావడం జరిగింది. వలస పాలకులు తమ స్వార్థ ప్రయోజనాలను నేరవేర్చుకునేందుకు వివిధ చట్టాల ద్వారా అడవులను తమ నియంత్రణలో ఉంచుకున్నారు. ఆదివాసులకు వారి స్వతసిద్ధ హక్కులను నిరాకరించడమేగాక వారిని అడవుల నుంచి గెంటివేయడం కూడా జరిగింది. ఆదివాసీ ఉద్యమాలను అదుపు చేసేందుకు మరింత కఠినమైన చట్టాలను తీసుకొచ్చారు. 1980 దశకంలో సంయుక్త అటవీ నిర్వహణ ప్రాజెక్టు ద్వారా ఆదివాసీలకు అటవీ వనరులపై హక్కులను పునరుద్ధరించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించింది. అయితే ఆ ప్రాజెక్టు పలువిధాలుగా విఫలమైంది. ముఖ్యంగా అడవుల పరిరక్షణకు అనుసరించిన చట్టబద్ధ విధానం ఆదివాసులకు వ్యతిరేకంగా ఉన్నది. అటవీ వనరులను వినియోగించుకోవడంలో ఆదివాసుల స్వేచ్ఛకు అది తీవ్ర పరిమితులు విధించింది.

అడవులలో ఆదివాసుల ఉనికి మావోయిస్టు రాజకీయాలను ప్రోత్సహిస్తుందనే అభిప్రాయం అధికార వర్గాలలో గట్టిగా ఉన్నది. చాలా మంది ఆదివాసీలు మావోయిస్టులకు సానుభూతిపరులుగా వ్యవహరిస్తున్నారనే కారణంగానే ఆదివాసులను అడవుల నుంచి ఖాళీ చేయించాలని రెవెన్యూ అటవీశాఖ అధికారులు చాలా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. అత్యంత 'ఆదిమ' తెగల నివాస హక్కులను గుర్తించడం, దేశవ్యాప్తంగా 85.6 మిలియన్ ఎకరాలలో విస్తరించి ఉన్న అడవులలోని అటవీ గ్రామాలను రెవెన్యూ గ్రామాలుగా మార్చడం మొదలైనవి అటవీ హక్కుల చట్టం లక్ష్యాలుగా ఉన్నాయి. అయితే ఈ చట్టాన్ని కేవలం 3 శాతం అటవీ ప్రాంతాలలో మాత్రమే అమలుపరచడం జరిగింది. చట్టం అమలులో ఉదాసీనత ఆదివాసుల సంక్షేమంపై ప్రభుత్వాల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

1972లో తీసుకొచ్చిన వన్య ప్రాణుల సంరక్షణ చట్టం ఆదివాసులను మరిన్ని ఒత్తిళ్లకు గురి చేసింది. వన్య ప్రాణుల (సంరక్షణ) సవరణ చట్టం 1982 అయితే, ఇప్పుడు సుప్రీం కోర్టు తీర్పు ఆదివాసులను ఏకంగా అడవులలో అక్రమంగా నివసిస్తున్న వారిగా పరిగణించింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే ఆదివాసులు అడవులను అక్రమంగా ఆక్రమించుకున్న నేరస్థులను చేసింది. ఈ చట్టం కిందే అసంఖ్యాక ఆదివాసీ కుటుంబాలను వారి వారి అటవీ భూముల నుంచి గెంటి వేశారు. ఇది వారిని అనేక కష్టనష్టాలకు గురి చేసిందని మరి చెప్పవలసిన అవసరం లేదు. దరిమిలా ఆదివాసీ ప్రాంతాలలో తరచూ సంభవిస్తున్న ఆకలి చావుల గురించి మీడియాలో వార్తలు వచ్చాయి.

2005లో ఒడిశాలో 75 శాతం మంది ఆదివాసీలు దారిద్ర్య రేఖకు దిగున జీవిస్తున్నారని అధికారిక నివేధికలే వెల్లడించాయి. ఈ కఠోర వాస్తవాలను దృష్టిలో ఉంచుకునే కేంద్ర ప్రభుత్వం 2006లో అటవీ హక్కుల చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం భూ హక్కులతో పాటు, కలప ఇతర అటవీ వనరులపైన ఆదివాసులకు హక్కు కల్పించింది. అటవీ హక్కుల చట్టం క్రింద ప్రభుత్వం ఆదివాసులకు చాలా పరిమితమైన హక్కులను మాత్రమే ఇచ్చింది. అడవులలో జీవ వైవిధ్యం, పరిమితమైన హక్కులను, సమతౌల్యతను కాపాడడానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆ చట్టం హెచ్చరించింది. ఆదివాసులకు కల్పించిన హక్కుల జాబిత చాలా సుదీర్ఘమైనదే అయినప్పటికీ వన్యప్రాణుల ఆవాస ప్రాంతాలు నేషనల్ పార్కులు, పేరిట ఆ హక్కులకు తీవ్ర పరిమితులు నిర్దేశించారు.

భారత ప్రజలలో ఆదివాసులే అత్యంత దుర్భర పరిస్థితులలో బతుకుతున్నారు. అన్ని అభివృద్ధి సూచికలలోనూ ఆదివాసులు అట్టడుగు స్థానంలో ఉన్నారు. ఇతర భారతీయ సామాజిక వర్గం వారిలో కంటే ఆదివాసులలోనే నిరక్షరాస్యత అధికంగా ఉన్నది. బడిబాటను పట్టనివారు అధికమే, పట్టా చదువును మధ్యలోనే ఆపివేస్తున్న వారి సంఖ్య అధికమే, పోషకాహార లోపం, వయస్సుకు తగ్గ విధంగా శారీరక ఎదుగుదల లేకపోవడం, వ్యాధిగ్రస్థత ఆదివాసీ బిడ్డలను పీడిస్తున్నాయి. మరణాల రేటులో కూడా అడవి బిడ్డలదే ప్రథమ స్థానం, కటిక పేదరికం. భయంకరమైన నిరుద్యోగం, వలసలు, ఆకలి చావులు ఆదివాసులలోనే అధికంగా ఉన్నాయి. ఈ అభాగ్యులకు రాజకీయాలలో భాగస్వామ్యం అత్యల్పంగా గాక మరెలా ఉంటుంది.

గిరిజనుల స్థితిగతులపై ఇటీవల ప్రొఫెసర్ వర్జినియస్ క్సాక్సా నేతృత్వంలోని ఒక ఉన్నత స్థాయి కమిటీ చాలా ఆందోళనకరమైన వాస్తవాలను వెల్లడించింది. ఆదివాసుల నుంచి భారత రాజ్యవ్యవస్థ సమకూరుస్తున్న లబ్ధిని సమస్థాయిలో నివేదిక పేర్కొంది. అడవులను నాశనం చేస్తున్నారనేది ఆదివాసులపై పలువురు తరచూ చేస్తున్న ఆరోపణ, ఇదోక అసత్య ఆరోపణ అయితే ఈ కట్టుకథను వలసపాలన కాలం నుంచీ అటవీ శాఖాధికారులు గట్టిగా విశ్వసిస్తున్నారు ఇంతకు సత్యమేమిటి? ప్రభుత్వం అడవులను తన నియంత్రణలోకి తీసుకుని, వాటిని నిర్వహించడం ప్రారంభమైనప్పటి నుంచే అవి ధ్వంసమవ్వడం ఆరంభమైంది. వలస పాలకులు అడవులను ఆర్థిక అస్తిత్వాలుగా సమకూర్చుకోవడానికి మాత్రమే ప్రయత్నిస్తుంది. అటవీ వనరుల వాణిజ్య దోపిడీని ప్రోత్సహించింది. అటవీ భూముల యాజమాన్య హక్కుల విషయంలో అడవులను ఎంతగా ధ్వంసం చేయాలో అంతగా ధ్వంసం చేసింది. ప్రభుత్వాలు చేపట్టిన అడవుల సంరక్షణ ప్రాజెక్టులు లక్ష్య పరిపూర్తిని సాధించక పోగా పలు విధాల అడవుల వినాశనానికే కారణమయ్యాయి.

ఆదివాసులు తమ సామాజిక సంప్రదాయాలు, మత ఆచారాల ద్వారా పర్యావరణ సమతౌల్యతను కాపాడుతున్నారు. పవిత్ర క్షేత్రాలు, పవిత్ర పర్వతాల భావన పర్యావరణ పరిరక్షణకు విశేషంగా తోడ్పడింది. ఆదివాసులు ఆదరించే ప్రతి దేవత ఏదో ఒక నిర్దిష్ట జంతువు లేదా వృక్షంతో ముడిపడి ఉంటుంది. దక్షిణాసియాలో అడవులకు పలు చారిత్రక అర్థాలు, ఉపయోగాలు ఉన్నాయని వివిధ అధ్యయనాలు ధ్రువీకరించాయి. అవి ఆవాస ప్రాంతాలుగాను, జీవనోపాధి వనరులుగాను ఉపయోగపడుతున్నాయి. శతాబ్దాలుగా అడవులలో నివసిస్తున్న తాము తమ స్థిర నివాసం గురించి ధ్రువీకరించవలసిన అవసరమేమిటో ఆదివాసులకు అర్థం కావడం లేదు. ఆదివాసులకు చారిత్రకంగా జరిగిన అన్యాయాలను అంతమొందించి వారికి పూర్తి న్యాయం చేయాలని భారత ప్రభుత్వం అభిలషిస్తుంటే.... ఎటువంటి చట్టపరమైన షరతులు లేకుండా అటవీ భూములను ఇతర అటవీ వనరులను స్వేచ్ఛగా ఉపయోగించుకునే హక్కును వారికి కల్పించాలి. చట్టాలతో సంబంధం లేకుండా అడవులను ఆదివాసీల ఉమ్మడి హక్కుగా ప్రకటించాలి. అప్పుడే ఆదివాసులు స్వేచ్ఛగా వారి జీవనాన్ని కొనసాగించగలుగుతారు. వలస పాలనాంతర సమస్యలను అధిగమించేందుకై ఆదివాసీలకు వారు కోల్పోయిన హక్కులను పునరుద్ధరించి తీరాలి.

### ఆదివాసీల తరలింపుకు – ప్రభుత్వం కుట్ర

అటవీ హక్కుల చట్టం ప్రకారం ఆదివాసులకు పట్టాలు ఇవ్వాలి. ప్రభుత్వం అడవుల నుంచి ఆదివాసీల తరలింపుకు కుట్ర చేస్తుంది. 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం ఆదివాసుల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి. 2019, జూలై 1 చలమన్ననగర్, చింతలపాడు గ్రామాలపై అటవీ శాఖాధికారుల ఆదివాసీ భూములపై దాడి చేసి ముగ్గురిని కొట్టుకుంటు తీసుకు వెళ్తుండగా ఆదివాసీ ప్రజలు "ఆడుకుంటున్నారు." 1997 సంవత్సరం మే నుంచి వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నామని, మాకు ప్రభుత్వం ఆధార్ కార్డులు, ఎన్నికల కార్డులు, ఆహార భద్రత కార్డులు జారీ చేయాలని ఆదివాసులు తెలిపారు. పోడు భూములపై దాడి చేసి, ఇళ్ళు ధ్వంసం చేసిన అటవీశాఖ అధికారులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేసారు.

ఆదివాసీలకు అడవులే ఆధారమని, ఆదివాసీల జీవన విధానమే అడవనీ, ఆదివాసీలను పౌరులుగా భారత ప్రభుత్వం గుర్తించాలి. పోడు సాగుదారులపై ప్రభుత్వం దాడులు ఆపాలి. అబ్బుగూడెం గ్రామంలో ఫారెస్టు అధికారులు సాగులో ఉన్న పోడు భూములను స్వాధీన పర్చుకొని మొక్కలు నాటినారు. అబ్బుగూడెం గ్రామంలో 110 కుటుంబాలకు చెందిన నాయక పోడు గిరిజనులు 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. వాటిని అధికారులు స్వాధీనం చేసుకుని మొక్కలు నాటడం, హక్కులకు ఆటంకం కలిగించాయి. మూడు తరాలుగా పోడు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆదివాసీలను అటవీశాఖ అధికారులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. 1983 నుంచి రుద్రాక్ష కుల్లి ప్రాంతంలో అటవీ భూములను సాగు చేసుకుంటూ అక్కడి గిరిజనులు స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు.

ప్రభుత్వం కడుతున్న ప్రాజెక్టుల కింద పోయిన అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా పోడు భూములు ఇవ్వాలని చూస్తోందనే పేరుతో కార్పొరేట్ శక్తులకు దాసోహం చేస్తుంది. అడవుల నుండి ఆదివాసులను గెంటివేసి అడవులలో ఉండే సంపదను కార్పొరేట్ చేతుల్లో పెట్టడానికి కంకణం కట్టుకుంది. వారి దోపిడీకి అడ్డంగా ఉన్న ఆదివాసులను, మావోయిస్టులను అంతం చేయాలని నిర్ణయించుకుంది. "జల్–జంగల్–జమీన్"పై హక్కు కొరకు గట్టిగా పోరాటం చేయాలి. రాంజీ గోండు, కోమురంభీం, ఇంద్రవెల్లి పోరాట స్ఫూర్తితో పోరాడవలసిన కర్తవ్యం ప్రజల ముందు ఉంది. ☆

# ఆర్థికవాదుల అనిపుణత విప్లవకారుల నిర్మాణం

(లెనిన్ వాల్యూం 1వ సంపుటంలోనిది)

రాజకీయాందోళనకు మిక్కిలి విస్తృతంగా వర్తించే సాధనం ఆర్థిక పోరాటమేననీ, ఆర్థిక పోరాటానికే రాజకీయ స్వభావాన్ని కల్పించడం ఈనాటి మన కర్తవ్యం అనీ "రబోచెయె దేలొ" చేసిన ఉద్ఘాటనలు-వీటిని నేనింతకు ముందే విశ్లేషించాను-మన రాజకీయ కర్తవ్యాలకు సంబంధించే కాక, మన నిర్మాణ పరమైన కర్తవ్యాలకు సంబంధించి కూడా సంకుచితమైన దృక్పథాన్ని వ్యక్తం చేస్తున్నాయి. "యజమానులకీ, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా జరిపే ఆర్థిక పోరాటంలో" అఖిల రష్యా కేంద్రీకృత సంఘమంటూ అవసరమే లేదు. అందుచేత ఈ పోరాటం రాజకీయ వ్యతిరేకత, నిరసన, కోపాతిరేకాల వ్యక్తీకరణలన్నింటినీ ఒకే సాధారణ దాడిలో ఏకీకృతం చెయ్యగల సంఘాన్ని, వృత్తి విప్లవకారులతో కూడి, యావన్మంది ప్రజల అసలైన రాజకీయ నాయకులచేత నడపబడే సంఘాన్ని ఉత్పన్నం చెయ్యజాలదు. ఇది సహజమే. ఏ సంఘపు స్వభావమైనా సహజంగానూ, తప్పనిసరిగానూ దాని కార్యకలాపాల సారాంశంపైనే ఆధారపడుతుంది. దీన్నిబట్టి, "రబోచెయె దేలొ", పైన విశ్లేషింపబడిన తన ఉద్ఘాటనల ద్వారా, రాజకీయ కార్యకలాపాల్లోని సంకుచితత్వాన్నే కాకుండా నిర్మాణపరమైన సంకుచితత్వాన్ని ఆశీర్వదిస్తుంది, సరైనదని ముద్రవేస్తుంది. "రబోచెయె దేలొ" ఎప్పటిమాదిరిగానే, ఈ సందర్భంలో కూడా, తను సద్యోజనితత్వానికి సాగిలపడే చైతన్యం కలిగిన పత్రిక అన్న సంగతిని రుజువుచేసుకుంది. అయితే, సద్యోజనితంగా అభివృద్ధి చెందే నిర్మాణ రూపాలకు దాసోహం అనడం, నిర్మాణరంగంలో మన కృషి సంకుచితత్వాన్నీ, అనిపుణతనూ అతి ముఖ్యమైన ఈ రంగంలో మనం అనుసరించేది చేతివృత్తుల నాటి పద్ధతులన్న విషయాన్నీ గుర్తించకపోవడం-ఇదే మన ఉద్యమాన్ని ఈ రోజున పట్టి పీడిస్తున్న ఓ పెద్ద వ్యాధి అని నా ఉద్దేశం. నిస్సందేహంగా ఇది పతన ఫలితంగా వస్తున్న వ్యాధి కాదు, పెరుగుదలతో వస్తున్న వ్యాధి. అయితే ప్రస్తుతం, సద్యోజనితంగా పెల్లుబుకుతున్న కోపపు వెల్లువ మననీ, మన ఉద్యమ నాయకుల్నీ, ఆర్గనైజర్లనీ ముంచెత్తుతున్న ఈనాడు, వెనుకబాటుతనాన్ని సమర్థించడంపైనా, ఈ విషయంలో సంకుచితత్వాన్ని ప్రమాణీకరించడంపైనా మనం రాజీలేని పోరాటం జరపవలసి ఉంది. కార్యరంగంలో ఉన్నవాళ్లందరిలోనూ లేక ఆ కృషిని చేబట్టేందుకు సన్నద్ధులవుతున్నవారిలోనూ, మనలో ప్రబలంగా ఉన్న "అనిపుణత"పట్ల అసంతృప్తిని రేకెత్తించడం, దాన్ని వదిలించుకోవాలన్న అచంచల సంకల్పాన్ని కలిగించడం ప్రత్యేకించి అవసరం.

**అనిపుణత అంటే ఏమిటి?**

1894-1901 నాటి నమూనాప్రాయమైన ఒక సోషల్ డెమోక్రటిక్ అధ్యయన బృందపు కార్యకలాపాలను క్లుప్తంగా వర్ణించడం ద్వారా ఈ ప్రశ్నకు సమాధానం ఇచ్చేందుకు నేను ప్రయత్నిస్తాను, ఆనాటి విద్యార్థి యువజన సామాన్యం మార్క్సిజంలో మునిగి తేలుతూ వుండేదన్న సంగతి మనకి తెలిసిందే. అయితే ఈ విద్యార్థులు ఒక సిద్ధాంతంగా మాత్రమే మార్క్సిజంలో మునిగి తేలలేదు, అంతకన్న ఎక్కువగా "ఏం చెయ్యాలి?" అన్న ప్రశ్నకు జవాబుగానూ, శత్రువుకు వ్యతిరేకంగా పోరాటరంగంలోకి ఒక పిలుపుగానూ మార్క్సిజంపట్ల వాళ్లు ఆకర్షితులయ్యారు. ఈ కొత్త యోధులు ఆశ్చర్యం కొలిపేటంతటి ఆదిమ ఆయుధాలతోనూ, శిక్షణతోనూ యుద్ధరంగంలో దిగారు. అనేక సందర్భాల్లో వాళ్లకి అసలు ఆయుధాల్లేవు, శిక్షణ అసలు బొత్తిగా లేదు. తమ పొలాలనుంచి దుడ్డుకర్రలు తీసుకుని బయల్దేరిన రైతుల మాదిరిగా వాళ్లు యుద్ధానికి దండెత్తి వెళ్లారు. ఉద్యమంలోని పూర్వ సభ్యులతో ఏ సంబంధమూ లేకుండా, ఇతర జిల్లాల్లో గాని, కనీసం అదే నగరంలోని ఇతర ప్రాంతాల్లో గాని (ఇతర విద్యా సంస్థల్లో గాని) ఉన్న అధ్యయన బృందాలతో ఎలాంటి సంబంధమూ లేకుండా, విప్లవ కృషియొక్క విభిన్న శాఖల నిర్మాణమేమీ లేకుండా, ఏ కొంచెం కాలవ్యవధికైనా కార్యకలాపాలకు సంబంధించి ఎటువంటి క్రమబద్ధమైన పథకమూ లేకుండా ఒక విద్యార్థి బృందం కార్మికులతో సంబంధాలు పెట్టుకుని పని మొదలుపెడుతుంది. ఆ బృందం తన ప్రచారాందోళనలను క్రమంగా పెంచుకుంటూపోతుంది. తన కార్యకలాపాల ద్వారా కార్మికుల్లో గణనీయమైన విస్తృతి విభాగాల సానుభూతిని సంపాదించుకుంటుంది. విద్యావంతుల శ్రేణిలో ఒక విభాగపు సానుభూతిని సంపాదించుకుంటుంది. విద్యావంతుల శ్రేణిలో ఒక విభాగపు సానుభూతిని కూడా పొందుతుంది. తనకు ధన సహాయం చేసే ఈ విభాగం నుంచే విద్యార్థి "కమిటీ" కొత్త యువజన బృందాలను సభ్యులుగా చేర్చుకుంటుంది. ఈ కమిటీ (లేక పోరాట సమితి) ఆకర్షణ శక్తి పెరుగుతుంది, దాని కార్యకలాపాల పరిధి మరింత విస్తరిస్తుంది. ఆ కమిటీ తన ఈ కార్యకలాపాన్ని పరమ సద్యోజనితంగా విస్తృతం చేస్తుంది. ఓ ఏడాది క్రితమో, కొద్ది నెలల క్రితమో విద్యార్థి బృందపు సమావేశాల్లో ప్రసంగించి, "ఎక్కడికి వెళ్లాలి?" అన్న సమస్యపై చర్చలు జరిపి, కార్మికులతో సంబంధాలు నెలకొల్పుకుని, వాటిని కొనసాగించి, కరపత్రాలు రాసి, ప్రచురించినవాళ్లే, ఇప్పుడు విప్లవకారుల ఇతర

గ్రూపులతో సంబంధాలు పెట్టుకుంటారు, సాహిత్యం సంపాదిస్తారు, స్థానిక పత్రిక ప్రచురణకు పూనుకుంటారు, ఒక ప్రదర్శన ఏర్పాటును గురించి మాట్లాడటం మొదలెడతారు. చివరకు బాహాటమైన పోరాటం మొదలుపెడతారు.(ఇది ఆయా పరిస్థితులనుబట్టి మొదటి ఆందోళనా కరపత్ర ప్రచురణ కావచ్చు, లేక పత్రిక మొదటి సంచిక ప్రచురణ కావచ్చు, అదీ కాకపోతే మొదటి ప్రదర్శన ఏర్పాటు కావచ్చు). సర్వ సామాన్యంగా అలాంటి కార్యాచరణకి పురిటిలోనే పూర్తిగా సంధికొట్టేస్తుంది. పురిటిలోనే, పూర్తిగా అని ఎందుకు అంటున్నామంటే, ఈ బహిరంగ పోరాటం క్రమబద్ధంగా, బాగా ఆలోచించి, కాలక్రమంలో తయారుచేసిన పథకం మేరకు దీర్ఘకాలం పాటు పట్టుదలగా జరిగేది కాక, సాంప్రదాయిక అధ్యయన బృందపు కృషి సద్యోజనిత పెరుగుదల పర్యవసానం కనుక, సహజంగానే, దాదాపు అన్ని సందర్భాల్లోనూ, పోలీసులకు స్థానిక ఉద్యమ ప్రధాన నాయకులెవరో ముందే తెలిసివుంటుంది. విద్యార్థులుగా ఉన్న రోజుల్లోనే వాళ్లు "ప్రసిద్ధులయ్యారు" కనుక, పోలీసులు దాడిచేసి వాళ్లని పట్టుకునేందుకు కేవలం సరైన అదనుకోసం మాత్రమే వేచివున్నారు. వాళ్లు కావాలనే అధ్యయన బృందం తన కృషిని పెంపొందించుకునేందుకు తగినంత వ్యవధిని-నేరారోపణకు ప్రత్యక్ష ఆధారాన్ని చేజిక్కించుకునేందుకు వీలుగా-ఇచ్చారు. తమకు తెలిసినవారిలో కొందరిని "కొత్త తరాన్ని వృద్ధిచేసేందుకు" (నాకు తెలిసినంతవరకు, ఇది, మనవాళ్లూ, పోలీసులూ కూడా వాడే సాంకేతిక పదం) స్వేచ్ఛగా ఉండనిచ్చేవారు. ఈ మాదిరి పోరాటాన్ని రైతులు తమ దుడ్డు కర్రలతో ఆధునిక సైన్యంమీదకి తరలి వెళ్లడంతో సరిపోల్చకుండా ఉండలేం. యోధులకి శిక్షణ బొత్తిగా కొరవడినప్పటికీ, విస్తరించి, పెరిగి, విజయాలను సాధించిన ఉద్యమ జీవశక్తిని చూసి ఆశ్చర్యపోకుండా ఎవరూ ఉండలేరు. నిజమే, చారిత్రక దృష్ట్యా ఆయుధాల ఆదిమత్వం ఆదిలో అనివార్యమే కాకుండా, యోధులను భారీఎత్తున చేర్చుకునేందుకు అవసరాల్లో ఒకటిగా ఉచితమైనదే కూడా. కాని ఆసలైన పోరాటాలు ప్రారంభమైనప్పుడు (వాస్తవానికి అవి 1896 వేసవిలో సమ్మెలతో మొదలయ్యాయి); మన పోరాట శాఖల్లో ఉన్న లోపాలు అంతకంతకు అధిక స్థాయిలో బయటపడ్డాయి. మొదట విభ్రాంతి చెంది, అనేక పొరపాటు చర్యలు తీసుకున్న ప్రభుత్వం (ఉదాహరణకు, సోషలిస్టుల దుష్కార్యాలను వర్ణించి జనసామాన్యానికి విజ్ఞప్తి చేసి, కార్మికులను రాజధాని నగరాలనుంచి ప్రాంతీయ పారిశ్రామిక కేంద్రాలకు, వెళ్లగొట్టి), అతి త్వరలోనే పోరాటపు కొత్త పరిస్థితులకు అనుగుణంగా సర్దుకుని, అన్ని రకాల అస్త్ర శస్త్రాలతోనూ సుసజ్జితులైన ఏజెంట్ల, గూఢచారుల, రాజకీయ బృందాలను రంగంలోకి పకడ్బందీగా దింపింది. దాడులు ముమ్మరమయ్యాయి, విస్తృత సంఖ్యలో అరెస్టులు జరగడంతో స్థానిక అధ్యయన బృందాల సభ్యులను పూర్తిగా ఏరివెయ్యడంతో కార్మిక జనసామాన్యం దాదాపుగా నాయకత్వమంతటినీ కోల్పోయింది. ఉద్యమం ఆశ్చర్యం కొలిపేటంతగా ఎగుడుదిగుళ్ల స్వభావాన్ని సంతరించుకుంది. కార్యకలాపాల్లో ఒక అనుస్యూతినీ, పొందికనూ నిలబెట్టడం పూర్తిగా అసంభవమైంది. పైన వర్ణించిన పరిస్థితుల అనివార్య పర్యవసానం ఏమిటంటే: స్థానికి నాయకులు ఘోరంగా చెల్లాచెదరైపోయి గడపవలసి రావడం, అధ్యయన బృంద సభ్యత్వాల అస్థిర స్వభావం, సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ సమస్యల్లో శిక్షణలోపం, అదే సమస్యలపై సంకుచిత దృక్పథం ఏర్పడటం. పరిస్థితులు ఏ దశకు చేరుకున్నాయంటే, కొన్నిచోట్ల, మనలో ఆత్మ సంయమనమూ, రహస్య గోపన సామర్థ్యమూ కొరవడినందువల్ల కార్మికులు మేధావుల్లో విశ్వాసాన్ని కోల్పోయి, వాళ్లకు దూరంకావడం మొదలెట్టారు. మేధావులు చాలా అజాగ్రత్తపరులనీ, పోలీసుదాడులకు కారణభూతులవుతున్నారనీ అనడం మొదలెట్టారు!

ఉద్యమాన్ని గురించి ఏ కొంచెం తెలిసినవాడికైనా కూడా, ఆలోచనాపరులైన సోషల్ డెమోక్రట్లందరూ ఈ అనిపుణ పద్ధతులను చివరకు ఇప్పుడు ఒక వ్యాధిగా పరిగణిస్తున్నారన్న సంగతి తెలుసు. ఉద్యమంతో పరిచయంలేని పాఠకుడు, ఉద్యమానికి సంబంధించిన ఓ ప్రత్యేక దశను, ఓ ప్రత్యేక వ్యాధిని నేను "కల్పిస్తున్నాను" అని అనుకోకుండా ఉండేందుకుగాను, ఇంతకుముందు పేర్కొన్న సాక్షి రచననుంచే మళ్లీ ఉదహరిస్తున్నాను. ఈ ఖండిక పెద్దదైనందుకు పాఠకులు నన్ను మన్నిస్తారని ఆశిస్తాను:

బి-వ "రబోచెయెదేలొ" 6వ సంచికలో ఇలా రాశాడు: "మరింత విస్తృతమైన ప్రత్యక్ష కార్యకలాపాలకు క్రమ పరివర్తన, రష్యన్ కార్మికోద్యమం ఈనాడు ఏ దశగుండా గడుస్తోందో ఆ సాధారణ పరివర్తన దశపై నేరుగా ఆధారపడిన పరివర్తన ఒక విశిష్ట లక్షణం కాగా, రష్యన్ కార్మికుల విప్లవ సాధారణ యంత్రాంగంలో, ఇంతకంటె తక్కువ ఆసక్తిదాయకం కాని మరో లక్షణం ఉంది. నా ఉద్దేశంలో అది కార్యాచరణకు యోగ్యమైన విప్లవ శక్తుల సాధారణ కొరత, ఈ కొరత ఒక్క పీటర్స్‌బుర్గ్‌లోనే కాకుండా, రష్యా అంతటా కనిపిస్తోంది. కార్మికోద్యమ సాధారణ పునరుజ్జీవనంతో, కార్మిక జనసామాన్యపు సాధారణాభివృద్ధితో, సమ్మెల మధ్య వ్యవధి తగ్గడంతో, కార్మికుల సామూహిక పోరాటం అంతకంతకు అధికంగా బహిరంగరూపాన్ని ధరించడంతో, దమనకాండ, అరెస్టులను, ప్రవాస, దేశాంతరవాస శిక్షలను ప్రభుత్వం ముమ్మరంచెయ్యడంతో అత్యంత నిపుణమైన విప్లవశక్తుల కొరత అంతకంతకు ఎక్కువగా ప్రస్ఫుటమవుతోంది, నిస్సందేహంగా ఇది ఉద్యమపు ప్రగాఢత్వాన్నీ, సాధారణ స్వభావాన్నీ దెబ్బతియ్యకుండా ఉండజాలదు. తమమీద విప్లవ సంఘాల గట్టి, ప్రత్యక్ష ప్రభావం లేకుండానే అనేక సమ్మెలు జరుగుతున్నాయి... ఆందోళనకు సంబంధించిన కరపత్రాలూ, రహస్య సాహిత్యాల కొరత కనిపిస్తోంది... కార్మికుల అధ్యయన బృందాలు ఆందోళనకారులు లేకుండా పోయారు. దీనికితోడు, ఎప్పుడూ నిధుల కొరత ఒకటి.

ఒక్కముక్కలో చెప్పాలంటే, కార్మికోద్యమపు పెరుగుదల విప్లవ సంఘాల పెరుగుదలనీ, అభివృద్ధినీ అధిగమించి ముందుకుపోతోంది. క్రియాశీల విప్లవకారుల సంఖ్య, అసంతృప్త కార్మిక జనసామాన్యంపై విస్తరించిన ప్రభావాన్నంతనీ తమ చేతుల్లోకే తెచ్చుకోజాలనంత, లేక ఈ అసంతృప్తికి లేశమాత్రపు వ్యవస్థితమూ, సంఘటితమూ అయిన రూపాన్ని ఇవ్వజాలనంత మరీ తక్కువగా ఉంది. వేర్వేరు అధ్యయన బృందాలూ, విడివిడి విప్లవకారులూ చెదురుబదురుగా, అసంఘటితంగా ఉండి, క్రమక్రమంగా అభివృద్ధి చెందిన శాఖలతో కూడిన క్రమశిక్షణాయుతమైన ఒకే ఒక, బలమైన సంఘంగా తయారుకాలేకపోయారు...” విచ్ఛిన్నం చెయ్యబడిన అధ్యయన బృందాల స్థానంలో సరికొత్త  అధ్యయన బృందాలను ఏర్పాటుచెయ్యడమన్నది “ఉద్యమంలో ఉన్న జీవశక్తిని నిరూపిస్తుందే గాని.. తగినంతగా శిక్షణ పొందిన విప్లవ కార్యకర్తలు తగినంత సంఖ్యలో ఉన్నారని నిరూపించడంలేదు” అని ఒప్పుకుంటూ, ఆ రచయిత ఇలా ముగిస్తాడు: “పీటర్స్‌బుర్గ్ విప్లవకారుల్లో కార్యాచరణకు సంబంధించిన శిక్షణ లోపం వాళ్ల కృషి ఫలితాలపైన ప్రతిబింబిస్తోంది. ఇటీవలి కేసులు, ప్రత్యేకించి ‘స్వీయ విమోచన గ్రూపు,’ ‘పెట్టుబడి వ్యతిరేక శ్రమ పోరాట’ గ్రూపులమీద జరిగిన విచారణలు, కార్మికవర్గ పరిస్థితులకు సంబంధించిన విస్తృత పరిజ్ఞానం లేని, తత్పర్యవసానంగా, ఒకానొక నిర్దిష్టమైన ఫ్యాక్టరీలో ఏ పరిస్థితుల్లో ఆందోళన సాగించడం సాధ్యమో తెలియని, రహస్య గోపన సూత్రాలు తెలియని, సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ సాధారణ సూత్రాలు మాత్రమే తెలిసిన (అసలంటూ అతనికి తెలిస్తే) యువ ఆందోళనాకారుడు మహా అయితే నాలుగో, అయిదో, లేక ఆరు నెలలో మాత్రమే తన కార్యకలాపాలను కొనసాగించగలడు. తర్వాత అరెస్టులు జరుగుతాయి, అవి మొత్తం సంఘపు విచ్ఛిన్నానికీ, లేక దానిలో కొంత భాగపు విచ్ఛిన్నానికీ దారితీస్తాయి. కాగా, గ్రూపు అస్థిత్వం నెలల్లోకి దిగజారినప్పుడు, ఆ గ్రూపు విజయవంతంగా కార్యకలాపాలను నిర్వహించగలదా? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ప్రస్తుతం ఉన్న సంఘాల లోపాలను పూర్తిగా పరివర్తన దశకే ఆపాదించడం సాధ్యం కాదన్న విషయం స్పష్టం. క్రియాశీల సంఘాల సభ్యత్వ సంఖ్యా, అన్నింటికన్న ముఖ్యంగా వాటి గుణాత్మకమైన స్వరూపం తక్కువ ప్రాముఖ్యం కలిగిన అంశం కాదనడం స్పష్టం, కాగా మన సోషల్ డెమోక్రట్లు తప్పక చేబట్ట వలసిన మొట్టమొదటి కర్తవ్యం ఏమిటంటే. సంఘాలను ఆచరణలో ఏకంచెయ్యడం, వాటి సభ్యులను నిక్కచ్చిగా ఎంపికచెయ్యడం.”

### అనిపుణత, ఆర్థికవాదం

నిస్సందేహంగా ప్రతి పాఠకుడి మనస్సులోకీ వచ్చిన ఒక ప్రశ్నను గురించి మనం ఇప్పుడిక చర్చించవలసి ఉంది. మొత్తం ఉద్యమానికి ఎదిగే దశలో సహజంగా సోకే వ్యాధి మాదిరి అనిపుణతకీ, రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో ఒక ధోరణి అయిన ఆర్థికవాదానికీ మధ్య సంబంధం ఉండడం సాధ్యమేనా? సాధ్యమనే నా ఉద్దేశం, కార్యాచరణకు సంబంధించిన శిక్షణ నిర్మాణ కృషిని కొనసాగించగల సామర్థ్యం–వీటి లోపం, ఆది నుంచీ విప్లవాత్మక మార్క్సిజాన్ని ఆచంచలంగా సమర్థించిన విప్లవకారులతోబాటు మనందరిలోనూ ఉంది. ఆచరణకు సంబంధించిన శిక్షణ లోపం మాత్రమే అయినట్లయితే, కార్యకర్తల్ని ఎవ్వరూ తప్పుపట్టలేరు. కాని “అనిపుణత” అన్న పదంలో శిక్షణ లోపంకన్న ఏదో ఎక్కువే ఇమిడిఉంది: సాధారణ విప్లవ కృషి పరిమితం కావడం, అటువంటి పరిమిత కార్యకలాపాల ప్రాతిపదికపైన మంచి విప్లవకారుల సంఘం నిర్మింపబడ జాలదన్న అవగాహన లోపం ఉంది, చివరి సంగతి–ఇదే ముఖ్యమైనది–ఈ పరిమితత్వాన్ని సరైనదని సమర్థించి, దాన్నొక ప్రత్యేక “సిద్ధాంతంగా” పై కెత్తే ప్రయత్నం ఉంది, అంటే, ఈ రంగంలో కూడా సద్యోజనితత్వానికి దాసోహమనడం ఉంది. అటువంటి ప్రయత్నాలు ఎప్పుడైతే వ్యక్తం అయినాయో, అప్పుడు అనిపుణత ఆర్థికవాదంతో ముడిపడిఉందనీ, మనం మొత్తంగా ఆర్థికవాదం నుంచి (అంటే మార్క్సిస్టు సిద్ధాంతానికీ, సోషల్ డెమోక్రసీ పాత్రకీ, దాని రాజకీయ కర్తవ్యాలకీ సంబంధించిన సంకుచిత అవగాహననుంచి) బయటపడితేగాని, నిర్మాణపర కార్యకలాపానికి సంబంధించిన ఈ పరిమితత్వంనుంచి మనం ఎన్నడూ బయటపడలేం. ఈ ప్రయత్నాలు ద్విముఖంగా వ్యక్తమయ్యాయి. కొందరు ఇలా అనడం మొదలెట్టారు: విస్తృతమూ, సమరశీలమూ అయిన కర్తవ్యాలను విప్లవకారులు కార్మికులమీద “రుద్దేందుకు” ప్రయత్నిస్తున్నారే తప్ప, కార్మికులు తమంతట తాముగా వాటిని ముందుకింకా తేలేదు. అందుచేత కార్మికులు తక్షణ రాజకీయ డిమాండ్ల కోసం, “యజమానులకూ, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా ఆర్థిక పోరాటాన్ని” సాగించేందుకోసమూ పోరాటాన్ని కొనసాగించాలి. (కాగా, సహజంగానే, జనసామాన్య ఉద్యమానికి “అందుబాటులో ఉండే” ఈ పోరాటానికి అనుగుణంగానే బొత్తిగా శిక్షణలేని యువకులకు సైతం “అందుబాటులో ఉండే” సంఘం ఉండాలి.) ఏ క్రమత్వ సిద్ధాంతానికీ కట్టుబడని మరి కొందరు “రాజకీయ విప్లవాన్ని తీసుకురావడం” సాధ్యమూ, అవసరమే గాని, శ్రామిక వర్గాన్ని ఎడతెగని సుదృఢమైన పోరాటంకోసం సుశిక్షతులను చేసేందుకు బలమైన విప్లవకారుల సంఘాన్ని నిర్మించనవసరం లేదన్నారు. మనం చెయ్యవలసిందంతా ఏమిటంటే, మన పాత మిత్రమైన, “అందుబాటులో ఉన్న” దుడ్డుకర్రని చేతిలోకి తీసుకుని ముందుకు పోవడమే. రూపకాలంకారాన్ని వదిలేస్తే దీని అర్థమేమిటంటే, మనం సార్వత్రిక సమ్మెని నిర్వహించాలి, లేకపోతే కార్మికోద్యమపు “మంద”గతిని “ఉత్తేజకర హింసాకాండ” ద్వారా మనం ఉత్తేజపరచాలి,'' ఈ రెండు ధోరణులూ–అవకాశవాదులూ, “విప్లవకారులూ” ప్రాచుర్యంలో ఉన్న అనిపుణతని దాసోహం అంటారు. దాన్ని తొలగించవచ్చునని ఈ ఇద్దరిలో  ఏ ఒక్కరూ విశ్వసించరు. రాజకీయ పోరాటానికి శక్తినీ, స్థిరత్వాన్నీ, అనుస్యూతినీ కలిగించే

సామర్థ్యం కలిగిన విప్లవకారుల సంఘాన్ని స్థాపించడమే మన ప్రధాన, ఆచరణాత్మక కర్తవ్యమన్న విషయాన్ని ఈ ఇద్దరిలో ఏ ఒక్కరూ అర్థంచేసుకోరు.

బి-వ్ అన్న ఈ కింది మాటల్ని నేనింతకు ముందే ఉదహరించాను: "కార్మికోద్యమపు పెరుగుదల విప్లవ సంఘాల పెరుగుదలనీ, అభివృద్ధినీ అధిగమించి ముందుకుపోతోంది." "సన్నిహిత పరిశీలకుని" ఈ "విలువైన వ్యాఖ్య"కి (బి-వ్ వ్యాసంమీద "రబోచెయె దేలో" వ్యాఖ్య) మనకు సంబంధించి రెండు రకాల విలువ ఉంది. రష్యన్ సోషల్ డెమొక్రటిక్ ఉద్యమంలో ఈనాడున్న సంక్షోభానికి జనసామాన్యపు సద్యోజనిత విజృంభణకన్న నాయకులు (సిద్ధాంతకర్తలు," విప్లవకారులు, సోషల్ డెమొక్రట్లు) వెనకబడటమే ప్రధాన కారణం అన్న నా అభిప్రాయం సరైనదేనన్న విషయాన్ని ఇది నిరూపిస్తోంది. దీన్నిబట్టి, "ఆర్థికవాద" లేఖా రచయితలూ ("ఇస్క్రా" 12వ సంచికలో), బి. క్రిచేవ్‌స్కీ, మర్తీనొవూ సద్యోజనిత అంశపు ప్రాముఖ్యాన్ని తక్కువ అంచనా వెయ్యడంలోవున్న ప్రమాదాన్ని గురించీ సాదా, రోజువారీ పోరాటాలను గురించీ ఎత్తుగడలు ఓ క్రమంగా వుండటం, వగైరాలను గురించీ ముందుకు తెచ్చిన వాదనలు అనిపుణతను ఆకాశానికెత్తడం, వెనకేసుకురావడం తప్ప మరేమీ కాదని తేలుతోంది. "సిద్ధాంతకారుడు" అన్న పదాన్ని ఎద్దేవా లేకుండా ఉచ్చరించలేని వీళ్లు, ప్రచలితంగా ఉన్న శిక్షణ లోపానికీ, వెనుకబాటుతనానికీ ముందు తమ సాష్టాంగ దండ ప్రమాణాలను "జీవిత వాస్తవాల అవగాహన"గా వర్ణించుకునే వీళ్లు, క్రియలో మన అత్యంతావసర ఆచరణాత్మక కర్తవ్యాలేమిటో కూడా తెలుసుకోలేకుండా ఉన్నారు. వెనకబడ్డ వాళ్లని ఉద్దేశించి వాళు ఇలా చెప్పారు: అడుగూ అడుగూ కలిపి నడవండి, ముందుకి పరుగెత్తకండి! నిర్మాణపర కృషిలో శక్తీ, చొరవా లేనివాళ్లకీ, విస్తృతమూ, సాహసికమూ అయిన కార్యకలాపాలకు "పథకాలు" లేనివాళ్లకీ "ఎత్తుగడలు ఓ క్రమంగా" ఉండాలంటూ ఉపదేశిస్తున్నారు! మన రాజకీయ, నిర్మాణపర, కర్తవ్యాలను మనం రోజువారీ ఆర్థిక పోరాటపు తక్షణ, "ప్రత్యక్ష," "నిర్దిష్ట" ప్రయోజనాల స్థాయికి దిగజారుస్తూ ఉంటాం, ఇదే మనం చేసే పొరపాట్లన్నింటిలోకీ పెద్దది. కాని వీళ్లు ఆర్థిక పోరాటానికే రాజకీయ స్వభావాన్ని కల్పించండి అంటూ పాచిపాటనే పాడుతూ ఉంటారు. మనం దానికి ఇలా జవాబిస్తాం: ప్రచారంలో ఉన్న ఓ జానపద కథలో నాయకుడు శవయాత్రలోని వాళ్లని ఉద్దేశించి "ఈ శుభదినం మీకు పదే పదే వచ్చుగాక!" అన్న దానిలో "జీవిత వాస్తవాల అవగాహన" ఎంత ఉందో వీళ్ల ఈ ధోరణిలో కూడా అంతే ఉంది.

ఈ మహా తెలివిపరులు సాటిలేని, నిజమైన "నార్సిసస్ మాదిరి" స్వాతిశయభావంతో, "కార్మిక అధ్యయన బృందాలు మొత్తంమీద" "వాస్తవికమూ, ఆచరణాత్మకమూ అయిన అర్థంలో, అంటే, రాజకీయ డిమాండ్లకోసం జరిగే ప్రయోజనకర, సఫల ఆచరణాత్మక పోరాటమనే అర్థంలో, రాజకీయ కర్తవ్యాలను అందుకోలేవు" అంటూ ప్లెహానొవ్‌ని ఉద్దేశించి ఎలా ఉపన్యాసం దంచారో గుర్తుకి తెచ్చుకోండి. మహాశయులారా, బృందాల్లో అనేక రకాలుంటాయి! "అనిపుణుల" బృందాలు, తమ అనిపుణతని గుర్తించి, దీన్ని విసర్జించేదాకా, రాజకీయ కర్తవ్యాలను ఎదుర్కోలేవు. దీనికితోడు, ఈ అనిపుణులు తమ అనిపుణ పద్ధతుల పట్ల వ్యామోహితులైపోయి, "ఆచరణాత్మక" అన్న పదాన్ని నొక్కిచెప్పాలని పట్టుపట్టి ఆచరణాత్మకంగా ఉండటమంటే జనాభాలోని మిక్కిలి వెనుకబడ్డ విభాగాలు అర్థంచేసుకునే స్థాయికి తమ కర్తవ్యాలను దిగజార్చాలని అనుకుంటే, అప్పుడిక వాల్లు ఎందుకూ పనికిరాని అనిపుణులే అవుతారు, మొత్తంమీద ఎలాంటి రాజకీయ కర్తవ్యాలతోనూ ఎంత మాత్రం సరితూగలేరు అనడం స్పష్టం. కాని, లెక్సేయెవ్, మీష్కిన్, హల్తూరిన్, జెల్యాబొవ్ మాదిరి నాయకుల బృందం ఈ రాజకీయ కర్తవ్యాలతో నిజాయితీగానూ, అత్యంత క్రియాపరమైన అర్థంలోనూ, సరితూగగలుగుతుంది. వాళ్లు ఏ కారణంగా, ఏ మేరకు అలా చెయ్యగలుగుతారంటే వాళ్లు చేసే ఆవేశపూరిత ప్రచారానికి సద్యోజనితంగా జాగృతులవుతున్న జనసామాన్యం ప్రతిస్పందించింది కనుక, ప్రతిస్పందించిన మేరకు, వాళ్ల పొంగిపొర్లే శక్త్యుత్సాహాలకు విప్లవ వర్గపు ప్రతిస్పందనా, తోడ్పాటూ లభించింది కనుక, లభించిన మేరకు అలా చెయ్యగలుగుతుంది. ప్లెహానొవ్ ఈ విప్లవ వర్గాన్ని నిర్దేశించి చూపి, సద్యోజనితంగా అది జాగృతమవడం అనివార్యం అన్న విషయాన్ని నిరూపించడమే కాకుండా, "కార్మికుల అధ్యయన బృందాల" ముందు మహత్తరమూ, ఉన్నతమూ అయిన ఓ రాజకీయ కర్తవ్యాన్ని కూడా పెట్టాడు. ఇది పూర్తిగా సరైనదే. కాని ఈ కర్తవ్యాన్ని తక్కువ చేయడానికీ, "కార్మికుల అధ్యయన బృందాల" శక్తినీ, కార్యకలాపాల పరిధినీ సంకుచితం చేసేందుకూ అప్పటినుంచీ పెల్లుబికిన ప్రజాందోళనను మీరు ప్రస్తావిస్తున్నారు. మీ అనిపుణ పద్ధతులపట్ల వ్యామోహితులైన అనిపుణులు కాకపోతే మీరు మరేమిటి? మీరు మీకు క్రియా దృష్టి ఉందంటూ దబ్బా వాయించుకుంటూ ఉంటారు, కాని, రష్యన్ కార్యకర్తల్లో ప్రతి ఒక్కడికీ తెలిసినదాన్ని, అంటే, విప్లవాందోళన విషయంలో ఒక బృందం మాట అటుంచి విడి వ్యక్తుల శక్త్యుత్సాహాలు సైతం ఎంతటి అద్భుత ఫలితాలను చేకూర్చగలవో అన్న విషయాన్ని మీరు తెలుసుకోలేరు. లేకపోతే, 1870 దశకం సృష్టించిన మాదిరి నాయకులను మన ఉద్యమం సృష్టించలేదని మీరు అనుకుంటున్నారా? ఒకవేళ అలాగే అనుకుంటూఉంటే, ఎందుకు మీరు అలా అనుకుంటున్నారు? మనకి శిక్షణ కొరవడింది కనుకనా? కాని మనకి మనం శిక్షణ ఇచ్చుకుంటూనే ఉన్నాం. మనకి మనం శిక్షణ ఇచ్చుకుంటూనే ఉంటాం, మనం శిక్షణ పొంది తీరుతాం! దురదృష్టవశాత్తూ, "యజమానులకూ, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా ఆర్థిక పోరాటం" అనే నిలవ నీటిపైన మురికి తెట్టు కట్టింది; మనలో సద్యోజనితత్వం ముందు సాగిలపడేవాళ్లూ, రష్యన్ శ్రామికవర్గపు

"పృష్టభాగాన్నే" (ప్లెహానొవ్ మాటల్లో) దిగ్భ్రాంతులై నోళ్లు తెరుచుకుని చూస్తూ ఉండి పోయేవాళ్లూ కొందరు తయారయ్యారు. కాని మనం ఈ మురికి తెట్టుని వదిలించుకుంటాం. నికరమైన విప్లవ సిద్ధాంత మార్గదర్శకత్వంలో, సిసలైన విప్లవకరమూ, సద్యోజనితంగా జాగృతమయ్యే వర్గంపై ఆధారపడి, చివరకు–చిట్టచివరకు ఎన్నాళ్లకో!–తమసమస్త విరాట్ శక్తినీ కూడగట్టుకొని రష్యన్ విప్లవకారులు రొమ్ము విరుచుకొని నిలబడగల సమయం వచ్చింది. మన రాజకీయ కర్తవ్యాలను తక్కువ చేసే ప్రయత్నాలనూ, నిర్మాణ రంగంలో మన కృషి పరిధిని సంకుచితం చేసే ప్రయత్నాలనూ మన కార్యకర్తల సముదాయం, తాము చదువుకుంటున్న రోజుల్నుంచీ కార్యకర్తలుగా పనిచెయ్యాలని కలలుగన్నవాళ్ల మరింత పెద్ద సముదాయం అసహ్యించుకోవడం, ఎద్దేవా చెయ్యడమే ఇప్పుడు కావలసిందల్లా. మహాశయులారా, మేమీ పనిని సాధించి తీరుతాం, కంగారు పడకండి!

"దేనితో ప్రారంభించాలి?" అన్న వ్యాసంలో "రబోచెయె దేలొ"కి సమాధానంగా నేనిలా రాశాను: " ఏదో ఒక ప్రత్యేక సమస్యపై జరిపే ఆందోళనల ఎత్తుగడలను, లేక పార్టీ నిర్మాణంలో ఏదో ఒక వివరానికి సంబంధించిన ఎత్తుగడలను 24 గంటల్లో మార్చవచ్చు; అంతేగాని, పోరాటాన్ని నిర్వహించవలసిన సంఘపు ఆవశ్యకతపైనా, జనసామాన్యంలో రాజకీయ ఆందోళనను (మొత్తంమీద, నిరంతరాయంగా, తిరుగు లేకుండా) సాగించవలసిన ఆవశ్యకతపైనా 24 గంటల్లో, లేక, ఆమాటకొస్తే 24 నెలల్లో తమ అభిప్రాయాలను మార్చుకోగలిగినవాళ్లు బొత్తిగా ఏ సూత్రమూ పాటించనివాళ్లు మాత్రమే." దీనికి "రబోచెయె దేలొ" ఇలా జవాబిచ్చింది: " 'ఇస్క్రా' చేసిన ఆరోపణల్లో వాస్తవాలపై ఆధారపడినట్లు కనిపించే ఈ ఒకే ఒక్క ఆరోపణకు సైతం బొత్తిగా ఆధారం లేదు. ఆది నుంచీ, 'ఇస్క్రా' ప్రచురణకోసం వేచి ఉండకుండానే మేము రాజకీయ ఆందోళన కావాలని చెప్పిన సంగతి 'రబోచెయె దేలొ' పాఠకులకి తెలిసిందే... (అయితే అదే సమయంలో, కార్మికుల అధ్యయన బృందాలు మాత్రమే కాక, "కార్మిక జనసామాన్యపు ఉద్యమం సైతం నిరంకుశ ప్రభుత్వాన్ని కూలదొయ్యడాన్నే తన ప్రథమ రాజకీయ కర్తవ్యంగా పరిగణించజాలదు" అనీ, తక్షణ రాజకీయ డిమాండ్లకోసం జరిగే పోరాటాన్ని మాత్రమే ప్రథమ రాజకీయ కర్తవ్యంగా పరిగణించాలనీ, "జనసామాన్యం ఒకటి, లేక కొన్ని సమ్మెల తర్వాత తక్షణ రాజకీయ డిమాండ్లను అర్థం చేసుకుంటారు" అనీ చెప్తూ),... కాని రష్యాలో పనిచేసే కామ్రేడ్లకి మేము విదేశాలనుంచి తెప్పించిన ప్రచురణల ద్వారా ఏకైక సోషల్ డెమోక్రటిక్, రాజకీయ, ఆందోళనా సమాచారాన్ని సమకూర్చాం... (అంతేకాదు, ఈ ఏకైక సమాచారంలో మీరు అత్యంత విస్తృత రాజకీయాందోళనను కేవలం ఆర్థిక పోరాటంపై ఆధారపడేలా చెయ్యడమే కాకుండా, ఈ పరిమిత ఆందోళనే "మిక్కిలి విస్తృతంగా అన్వయింపదగినది"గా వాదించేదాకా వెళ్లారు. మహాశయులారా, సమకూర్చబడిన సమాచారం ఇది ఒక్కటే అన్న మీ వాదనే, 'ఇస్క్రా' ప్రచురణావశ్యకతనూ, 'రబోచెయె దేలొ'కి వ్యతిరేకంగా దాని పోరాటావశ్యకతనూ రుజువుచేస్తున్న సంగతి మీకు కనిపించడం లేదా?)... "మరోవంక, వాస్తవానికి మా ప్రచురణ కార్యక్రమం పార్టీ ఎత్తుగడలకు సంబంధించి పార్టీ ఐక్యతకు భూమికను తయారుచేశాయి"... (ఎత్తుగడలు పార్టీ కర్తవ్యాల పెరుగుదల క్రమం, అవి పార్టీతోబాటే పెరుగుతాయి అన్న విశ్వాసంతోనా ఐక్యత?– నిజానికి బహువిలువైన ఐక్యతే!)... "తద్వారా 'ఒక సమరశీల సంఘ' స్థాపనను సాధ్యంచేసింది, దీనికోసం 'దేశాంతర యూనియనే,' విదేశాల్లోని ఏ సంఘమైనా చెయ్యగలదంతా చేసింది" (రబోచెయె దేలొ," సంచిక 10, పేజి 15). దాటవేసేందుకు శుష్క ప్రయత్నం! మీరు చెయ్యగలిగినదంతా చేశారన్న విషయం నేను కాదనను. మీరు చెయ్యగలిగిన పనుల "సాధ్యత"కు మిత్రులు సైతం మీ సంకుచిత దృక్పథంచేత పరిమితం చెయ్యబడ్డాయని నేను ఇంతకు ముందూ చెప్పాను, ఇప్పుడూ చెప్తున్నాను. "తక్షన రాజకీయ డిమాండ్ల" కోసం పోరాడేందుకూ, లేక "యజమానులకూ, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా ఆర్థిక పోరాటం" జరిపేందుకూ "సమరశీల సంఘాన్ని" గురించి మాట్లాడటం హాస్యాస్పదం.

కాని, అనిపుణత విషయంలో "ఆర్థికవాది"కీ ఉన్న విపరీత వ్యామోహానికి సంబంధించి ఆణిముత్యాలని చూడాలని పాఠకుడు అనుకుంటే, అతను కలగూరగంపలాంటి భావాలూ, ఊగిసలాడే స్వభావమూ ఉన్న "రబోచెయె దేలొ"ని విడిచిపెట్టి సుసంగతంగానూ, దృఢసంకల్పంతోనూ ఉండే "రబోచయ మీస్ల్"ని చూడాలి. దాని ప్రత్యేకానుబంధం, పేజి 13లో ఆర్.ఎమ్. ఇలా రాశాడు: "ఇప్పుడు అసలు విప్లవాత్మక మేధావివర్గం అనబడేదాన్ని గురించి రెండు మాటలు. అది కొన్ని సందర్భాల్లో 'జారిజంతో కృతనిశ్చిత పోరాటానికి దిగేందుకు' తను సిద్ధమేనని రుజువుచేసుకున్న మాట నిజమే. అయితే, దురదృష్టకర విషయం ఏమిటంటే, రాజకీయ పోలీసులచేత నిర్దాక్షిణ్యంగా హింసించబడిన మన విప్లవాత్మక మేధావివర్గం, రాజకీయ పోలీసులకు వ్యతిరేకంగా జరిపే పోరాటాన్నే నిరంకుళ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిపే రాజకీయ పోరాటమని భావించింది. అందుకనే ఈ నాటికీ అది నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడే శక్తులు ఎక్కడి నుంచి వస్తాయో అర్థం చేసుకోలేకపోతోంది."

సద్యోజనిత ఉద్యమపు ఈ ఆరాధకుడు (ఈ మాటకి ఉన్న మిక్కిలి చెడ్డ అర్థంలో) పోలీసు వ్యతిరేక పోరాటంపట్ల చూపిన తిరస్కార భావం నిజంగా సాటిలేనిదే! సద్యోజనిత ప్రజాందోళన జరిగేటప్పుడు రాజకీయ పోలీసులతో పోరాటం జరపడం ఎంతమాత్రం ముఖ్యం కాదన్న వాదంతోటి రహస్య కార్యకలపాల నిర్వహణ విషయంలో మన అశక్తతని ఆయన సమర్థించ సిద్ధమవుతున్నాడు! నిస్సారమైన ఈ నిర్ధారణను

నిజానికి బహుకొద్ది మంది మాత్రమే బలపరుస్తారు; విప్లవ సంఘాలలో మన లోపాల సమస్య అంతటి నిశిత ప్రాముఖ్యాన్ని సంతరించుకుందన్నమాట. కాని, ఉదాహరణకు మర్తీనొవ్ ఈ నిర్ధారణతో ఏకీభవించకపోతే, అందుకు, తన భావాలను తర్కబద్ధంగా ఆమూలాగ్రం పరిశీలించలేకపోవడమో, లేక అందుకు సాహసించకపోవడమో, శక్తి లేకపోవడమో కారణం అయ్యుంటుంది. వాస్తవానికి, జనసామాన్యం నిర్దిష్టమైన డిమాండ్లను, ప్రత్యక్ష ఫలితాలనిచ్చే అవకాశమున్న డిమాండ్లను, ముందుకు తెచ్చే "కర్తవ్య" పరిపూర్తికి సుస్థిరమూ, కేంద్రీకృతమూ, సమరశీలమూ అయిన విప్లవకారుల సంఘాన్ని నిర్మించడానికి ప్రత్యేక ప్రయత్నాలు అవసరమా? అటువంటి "కర్తవ్యాన్ని" "రాజకీయ పోలీసులకు వ్యతిరేకంగా పోరాటం జరవని'' జనసామాన్యం సైతం నిర్వహించలేరా? అంతేకాకుండా, కొద్దిమంది నాయకులకు తోడు, "రాజకీయ పోలీసులకు వ్యతిరేకంగా పోరాడే" సామర్థ్యం బొత్తిగాలేని కార్మికులు (అత్యధిక సంఖ్యాకులు) కూడా దాన్ని అమలుజరపడంలో పాల్గొనకపోతే ఈ కర్తవ్యాన్ని పరిపూర్తి చెయ్యడం సాధ్యమా? అటువంటి కార్మికులు, జనసామాన్యంలోని సామాన్యమైన మనుషులు, సమ్మెల్లోనూ, పోలీసులతోనూ, సైనికులతోనూ జరిగే వీధి పోరాటాల్లోనూ బృహత్తరమైన శక్తినీ, మహత్తరమైన ఆత్మ త్యాగాన్నీ ప్రదర్శించగలరు. వాళ్లే మన యావత్తు ఉద్యమ ఫలితాన్నీ నిర్ధారించగల సమర్థులు (నిజానికి, వాళ్లు మాత్రమే సమర్థులు)-కాని రాజకీయ పోలీసులకు వ్యతిరేకంగా జరిగే పోరాటానికి ప్రత్యేక లక్షణాలు ఉన్నవాళ్లు అవసరం. దానికి వృత్తి విప్లవకారులు అవసరం. జనసామాన్యం నిర్దిష్టమైన డిమాండ్లను "ముందుకు తెచ్చేలా" చూడటమే కాకుండా, కార్మిక జనసామాన్యం అటువంటి వృత్తి విప్లవకారులను అధికతర సంఖ్యలో "ముందుకు తెచ్చేలా" మనం చూడాలి. ఈవిధంగా, వృత్తి విప్లవకారుల సంఘానికీ, శుద్ధ సరళ కార్మికోద్యమానికీ మధ్య సంబంధపు సమస్య దగ్గరకి మనం చేరుకున్నాం. ఈ సమస్య సాహిత్యంలో ఏమంత ఎక్కువగా ప్రస్తావించబడకపోయినప్పటికీ, ఎక్కువ తక్కువ మోతాదుల్లో ఆర్థికవాదంవైపు మొగ్గుచూపే కామ్రేడ్సుతో సంభాషణలోనూ, వాదాల్లోనూ "రాజకీయవేత్తలమైన" మనకు, ఈ సమస్యపట్ల ఎక్కువ శ్రద్ధ వహించవలసిన అవసరం కలిగింది. ఇది ప్రత్యేకించి చర్చించవలసిన సమస్య. అయితే, ఈ సమస్యని గురించి చర్చించేందుకు ముందర, అని పుణతకీ ఆర్థికవాదానికీ మధ్య ఉన్న సంబంధాన్ని గురించి మన సూత్రీకరణపై వెలుగును ప్రసరించే మరో ఖండికను ఈ కింద ఇస్తాను:

ఎన్.ఎన్.గారు తన "సమాధానం"లో ఇలా రాశాడు: " శ్రమ విమోచన' గ్రూపు, ఈ పోరాటంకోసం పాదార్థిక శక్తులను ఎక్కడ సమకూర్చుకోవాలన్న అంశాన్ని గురించి ముందు ఆలోచించకుండా పోరాట పంథా ఏమిటో సూచించకుండా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రత్యక్ష పోరాటం కావాలని డిమాండుచేస్తుంది." పోరాట పంథా అన్న మాటలను వక్కాణిస్తూ, "పంథా" అన్న దానికి రచయిత ఈ కింది పాద పీఠికను జోడించాడు: "కార్యక్రమం ఒక ప్రజోద్యమానికి సంబంధించిందే గాని ఒక కుట్రకి సంబంధించింది కాదు గనుక, రహస్య గోపన కారణాలతో దీన్ని మనం వివరించలేం. మరి జనసామాన్యం రహస్య పంథాల్లో ముందుకి వెళ్లజాలరు. రహస్య సమ్మెని మనం ఊహించుకోగలమా? రహస్య ప్రదర్శనలనీ, రహస్య విజ్ఞాపనలనీ మనం ఊహించుకోగలమా?" రచయిత ఈ విధంగా, "పాదార్థిక శక్తుల" (సమ్మెల, ప్రదర్శనల నిర్వాహకుల) సమస్యకీ, పోరాట "పంథాల" సమస్యకీ దగ్గరగా వచ్చాడు. కానైతే, ఆయన ఇంకా దిగ్భ్రాంతిలోనే ఉన్నాడు, ఆయన ప్రజోద్యమాన్ని "ఆరాధించడమే" ఇందుకు కారణం. అంటే, మనల్ని ప్రోత్సహించ వలసినదిగానూ, మన విప్లవ క్రియాశీలతను ఉత్తేజితం చెయ్యవలసిందిగానూ కాక, విప్లవ కార్యకలాపాలను నిర్వహించవలసిన ఆవశ్యకతనుండి మనల్ని తప్పించే ఏదోగా ప్రజోద్యమాన్ని ఆయన పరిగణించడమే ఆయన ఈ దిగ్భ్రాంతికి కారణం. సమ్మెలో పాల్గొనేవాళ్లకీ, దానితో సన్నిహిత సంబంధం కలిగిఉన్న వాళ్లకీ అది రహస్యంగా ఉండటమన్నది అసాధ్యం, కాని, రష్యన్ కార్మిక జనసామాన్యానికి అది రహస్యంగా ఉండిపోవచ్చు (ఎక్కువ సందర్భాల్లో అలా ఉండిపోతుంది కూడా). సమ్మెదారులతో సంబంధాలన్నింటినీ తెంచివేసేందుకూ, సమ్మెలకు సంబంధించిన ఏ వార్తలూ వ్యాపించకుండా నివారించేందుకూ ప్రభుత్వం శ్రద్ధతీసుకోవడమే ఇందుకు కారణం. "రాజకీయ పోలీసులకు వ్యతిరేకంగా" ప్రత్యేక "పోరాటం" -సమ్మెల్లో పాల్గొనేటంత పెద్ద జనసమూహంచేత క్రియాశీలంగా నిర్వహించబడజాలని పోరాటం-దానికి అవసరము. విప్లవ కార్యకలాపాలే జీవిత ధ్యేయంగా కలిగినవాళ్లు "ఆ కళకి సంబంధించిన నియమాలన్నింటి" ప్రకారం ఈ పోరాటాన్ని సంఘటితం చెయ్యాలి. ఉద్యమంలోకి జనం సద్యోజనితంగా వస్తున్నారన్నంత మాత్రాన ఈ పోరాట ఆవశ్యకత తగ్గదు. తద్భిన్నంగా అది మరింత ఆవశ్యకం అవుతుంది. ఎందుకంటే, సోషలిస్టులమైన మనం పోలీసులు అన్ని సమ్మెలని గురించీ, ప్రదర్శనలను గురించీ కప్పెట్టకుండా నివారించకపోయినట్లయితే (మధ్య మధ్య సమ్మెలకూ, ప్రదర్శనలకూ మనమే రహస్య సన్నాహాలు జరపకపోయినట్లయితే) జనసామాన్యం పట్ల మనకి ఉన్న ప్రత్యక్ష బాధ్యతా నిర్వహణలో మనం విఫలమవుతాం. సద్యోజనితంగా జాగృతులవుతున్న జనసామాన్యం కూడా, తమ శ్రేణుల్లో నుంచే, అధికతర సంఖ్యలో "వృత్తి విప్లవకారులను" తయారుచేస్తారు గనుక (అంటే, కార్మికుల్ని చేతులు కట్టుకుని కూర్చోమని సలహా ఇవ్వాలన్న ఆలోచన మన మనస్సులపై సవారీచెయ్యకపోతే), ఈ పని చెయ్యడంలో మనం సఫలమవుతాం. ☆

# కామ్రేడ్ కత్తి మోహన్‌రావు (ప్రకాశ్, దామదాద)

విప్లవ ధృవతార, మార్క్సిస్టు మేధావి, విమర్శకుడు, గురువు, ప్రజా పక్షపాతి, పీడిత ప్రజల ప్రియ నేత కా.కత్తి మోహన్‌రావు (ప్రకాష్, దామదాద) 2021 జూన్ 10 తేదీ 9.గంటల 50 నిమిషాలకు ఈ సమాజం నుండి నిష్క్రమించారు. కా.దామదాద మరణం విప్లవ కారులను, పీడిత ప్రజలను, శోక సంద్రంలో ముంచింది. ఇంతటి ఆదరాభిమానం చూరగొన్న, విప్లవ ప్రజా నాయకుడిది మహబూబ్‌బాద్(ఉమ్మడి వరంగల్) జిల్లా, గార్ల మండల కేంద్రం. కా. కత్తి మోహన్‌రావు 1961లో జన్మించాడు. 60 సంవత్సరాల వయస్సులో ప్రజలకు భౌతికంగా దూరమయ్యాడు. కత్తి రామయ్యకు నలుగురు సంతానంలో కత్తి మోహన్‌రావు రెండోవాడు. ఒక అన్న, చెల్లి, తమ్ముడు వున్నారు. వీరిది మధ్య తరగతి కుటుంబం. తండ్రి రామయ్య గ్రామ పెద్దగా అందరికి తెలుసు. అభ్యుదయ భావజాలం కలిగిన రామయ్య ప్రభావం కొడుకు మోహన్‌రావుపై కూడా పడింది. రామయ్య లాగానే ప్రతిది ప్రజల కోసమే ఆలోచించే వాడు. అయితే చదువుకునే రోజుల్లో తన ఆలోచనలను మెరుగు పరుచుకొని, లెఫ్ట్ భావజాలం వైపు మళ్ళి, ఇంకా ఉన్నతంగా ఆలోచించడం మొదలు పెట్టాడు.



కా.కత్తి మోహన్ రావు ప్రాథమిక పాఠశాల విద్య నుండే చదువులో చాలా చురుకుగా వుండేవాడు. ప్రాథమిక విద్యను గార్లలోనే చదివి ఉన్నత చదువుల కోసం ఖమ్మం వెళ్ళాడు. ఖమ్మం పట్టణంలో ఎస్ఆర్ అండ్ బిజీఎస్ఆర్ కళాశాలలో డిగ్రీని పూర్తి చేశాడు. ఎంఎస్‌సి రసాయన శాస్త్రం చదవడానికి కాకతీయ యూనివర్శిటీకి వెళ్ళాడు. అక్కడ మాస్టర్ ఆఫ్ సైన్స్‌లో గోల్డ్ మెడల్ సంపాదించాడు. చదువుతో పాటు విప్లవ రాజకీయాలను అధ్యయనం చేశాడు. అప్పటికే కాకతీయ యూనివర్శిటీలో నగ్జల్బరీ, శ్రీకాకుళ సాయుధ రైతాంగ ఉద్యమాల ప్రభావం కొనసాగుతుంది.

రివిజనిజాన్ని బద్దలు కొట్టుకొని నగ్జల్బరీ, శ్రీకాకుళ సాయుధ రైతాంగ ఉద్యమాలు దేశ నలుమూలల వ్యాప్తి చెంది, వాటి ప్రభావం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, ముఖ్యంగా తెలంగాణలో యూనివర్శిటి విద్యార్థులపై పడింది. దీనితో వందలాది మంది విద్యార్థులు విప్లవాల బాట నడిచారు. ప్రజా ఉద్యమాల ప్రభావంతో పాటు యూనివర్శిటీలో కార్మిక వర్గ సంస్కృతి కా.కత్తి మోహన్‌రావును విశేషంగా ఆకట్టుకుంది. దీనితో 22 సంవత్సరాల వయస్సులో పీపుల్స్‌వార్ విప్లవ రాజకీయాల వైపు మళ్ళాడు. లైపు ఇన్సురెన్స్ ఏజెంట్‌గా ఉద్యోగం చేస్తున్న కత్తి మోహన్‌రావు పీడిత ప్రజల విముక్తి కోసం ఉద్యోగాన్ని వదులుకొని రాడికల్ విద్యార్థి సంఘంలో చేరాడు. సంఘం కార్యదర్శిగా, యూనివర్శిటి పార్టీ సెల్ సభ్యుడుగా పని చేశాడు. 1983లో పార్టీలో పూర్తి కాలం కార్యకర్తగా చేరాడు. రెండు సంవత్సరాలు వరంగల్ పట్టణంలో టౌన్ స్టూడెంట్స్ పార్టీ కమిటీ (టీఎస్‌పిసీ)లో వుంటూ విద్యార్థి ప్రత్యేక ఆర్గనైజర్‌గా పని చేశాడు. ఆ కాలంలో విద్యార్థి ఉద్యమాల్లో క్రియాశీలంగా పాల్గొన్నాడు.

తెలుగు దేశం ప్రభుత్వం అప్రకటిత యుద్ధం ప్రారంభించిన కాలంలో 1985లో ఖమ్మం టౌన్ ఆర్గనైజర్‌గా బదిలిపై వెళ్ళాడు. ఆ క్రమంలోనే అరెస్టు కాబడ్డాడు. రీజినల్ కమిటీ సభ్యుడు, అప్పటి ఖమ్మం జిల్లా బాధ్యుడు కా.జీవన్ (సంతోష్ రెడ్డి)తో పాటు అరెస్టు అయ్యి 5 సంవత్సరాలు జైలు జీవితం గడిపాడు. ఖైదీల సమస్యల పరిష్కారానికి జైల్లో కూడా వివిధ నిర్దిష్ట డిమాండ్లపై అవిశ్రాంతంగా పోరాడాడు. అరెస్టు అయిన రాజకీయ ఖైదీల చదువుతో పాటు రాజకీయంగా ఎదిగించుకొని తిరిగి విప్లవోద్యమంలోకి పంపడానికి, శతృవు చేతికి చిక్కి చిత్ర హింసలకు గురైన కామ్రేడ్స్ ఆరోగ్యాలను బాగు చేసుకోవడానికి, పరిశుభ్రమైన ఆహారం ప్రత్యేకంగా ఏర్పర్చుకోవడానికి ప్రత్యేక కమ్యూన్ ఏర్పర్చాలనే డిమాండ్లతో జైలు అధికారులకు పిటిషన్లు ఇవ్వడం జరిగింది. తద్వారా ఫలితం లేక పోవడంతో అనేక సార్లు అమరణ నిరహార దీక్షలు చేపట్టి అంతిమంగా ప్రత్యేక కమ్యూన్ సాధించుకున్నారు. అంతే కాకుండా సాధారణ ఖైదీల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేపట్టారు. సాధారణ ఖైదీలకు సైతం పౌష్టికాహారం అందించాలని, మెరుగైనా వైద్య సౌకర్యాలు కల్పించాలని అధికారులతో పోరాడారు. అయితే జైల్లో పోరాటాలు అంత సులువుగా జరగలేదు. పోరాటాల సందర్భంగా జైలు అధికారులు లాఠీచార్జి చేశారు. చాలా మందికి తలలు పగిలాయి. కాళ్ళు, చేతులు విరిగాయి. పోరాటాలకు నాయకత్వం వహించే వారిని సింగిల్ సెల్లో వేశారు. అయినప్పటికి వెనకడుగు వేయలేదు, నిర్భంధానికి భయపడలేదు. పట్టుదలతో మరింత సాహసంగా పోరాడారు. ఈ పోరాటాల్లో కా.కత్తి మోహన్‌రావు క్రియాశీలంగా పాల్గొన్నాడు. కా.మహేష్‌తో పాటు నాయకత్వాన్ని సింగిల్ సెల్‌లో వేసినప్పుడు కా.కత్తి మోహన్‌రావు కమ్యూన్ కార్యదర్శిగా ఎన్నుకోబడ్డాడు. కమ్యూన్ బాధ్యతలు చేపట్టిన తరువాత ఖైదీల ఆరోగ్యాల విషయంలో డాక్టర్లతో మాట్లాడి బయటి హాస్పటల్‌కి పంపించేవాడు. రాజకీయ ఖైదీలందరికి రాజకీయ తరగతులు నిర్వహించేవాడు. కామ్రేడ్స్‌ను ప్రేమతో, ఆప్యాయతతో పలుకరించేవాడు.

5 సంవత్సరాలు జైలు జీవితం తరువాత 1991లో జైలు నుండి విడుదలయ్యాడు. తిరిగి పార్టీలోకి వచ్చి, దళంలో కొనసాగాడు. ఆరు నెలలు ఖమ్మం దళం డిప్యూటి కమాండర్‌గా పని చేశాడు. 1992 జనవరి నుండి డిసెంబర్ వరకు మహదేవ్‌పూర్ దళ కమాండర్‌గా పని చేశాడు. కా. కత్తి మోహనరావుని 1992 డిసెంబర్‌లో పార్టీ ఉత్తర తెలంగాణ ఫారెస్టు డివిజనల్ (ఎన్‌టీఎఫ్‌డి) కమిటీలోకి కోఆప్ట్ చేసింది. 1992లోనే మానసిక జబ్బుతో హాస్పటల్‌కు వెళ్తె రెండవ సారి అరెస్టు అయ్యాడు. తిరిగి దళంలో చేరిన తరువాత 1993లో పిఎంగా-ఏసిఎంగా పాండవ దళంలో కొనసాగాడు. 1998 నుండి 2000 జూన్ వరకు ఉత్తర తెలంగాణ రాజకీయ ప్రచార పత్రిక ప్రజా విముక్తి ప్రచురణ కోసం ప్రెస్ విభాగంలో కృషి చేశాడు. 2000 సంవత్సరం అర్ధ భాగం నుండి ఖమ్మం డివిజన్ కమిటి సభ్యునిగా బాధ్యతను చేపట్టాడు. రివిజనిస్టు గ్రూపుల దివాళాకోరు రాజకీయాలను సైద్ధాంతికంగా ఎండగడుతూనే వారితో ఐక్యత కోసం కృషి చేశాడు. 2005లో ఖమ్మం-వరంగల్ కమిటీ కార్యదర్శిగా 2006 మార్చి వరకు బాధ్యతలు నిర్వహించాడు. దెబ్బ తిన్న డివిజనల్ ఉద్యమాన్ని పునర్నిర్మించడానికి కార్యదర్శిగా ఎంతో కృషి చేశాడు. అన్ని పార్టీ కమిటీలను, సంఘాల నిర్మాణాలను, రాజకీయంగా, సైద్ధాంతికంగా అభివృద్ధి చేసాడు. ఎక్కువ కాలం కార్యదర్శిగా పని చేసే అవకాశం దొరకలేదు. శతృవు నిర్బంధం కారణంగా నష్టాలు జరిగి, స్వీయాత్మక శక్తులు తగ్గిపోయి, డివిజన్ ఉద్యమాలు కుదించుకు పోయాయి. దీనితో రెండు డివిజన్ ఉద్యమాలను కలుపుతూ ఖమ్మం, కరీంనగర్, వరంగల్ (కేకేడబ్ల్యు) డివిజన్‌గా ఏర్పర్చడం జరిగింది. 2006 మార్చి నుండి 2007 వరకు డివిజన్ కమిటీ సెక్రటెరీయేట్ సభ్యుడుగా కొనసాగాడు. తెలంగాణలో చివరి సారిగా 2007లో జరిగిన కాన్ఫరెన్స్‌లో క్రియాశీలంగా పాల్గొన్నాడు. అనారోగ్యం తనను దీర్ఘకాలంగా వెంటాడుతుండడంతో తెలంగాణలో కొనసాగుతున్న నిర్బంధాన్ని దృష్టిలో పెట్టుకొని 2008లో కా.కత్తి మోహన్‌రావును కేంద్ర కమిటి దండ కారణ్యానికి బదిలి చేయడం జరిగింది.

తాను ఎంతగానో విప్లవోద్యమ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలనుకున్నప్పటికి ఎంతో కాలంగా వెంటాడుతున్న అస్తమా, షుగర్, బీపి, మానసిక జబ్బు తన ఆలోచనలకు, ఆచరణకు ఆటంకంగా మారాయి. అనారోగ్యంతో విశ్రాంతి కోసం కృషి విభాగం వద్ద 2012 వరకు వున్నాడు. 2012 నుండి తన చివరి శ్వాస వరకు జనతన సర్కార్ స్కూల్లో ఉపాధ్యాయుడిగా సేవలందించాడు. పిల్లలకు, క్యాడర్‌కు రాజకీయ పాఠాలు చెప్పడమంటే తనకు చాలా ఇష్టం. ఉపాధ్యాయుడు అంటే బెత్తం పట్టుకొని పిల్లలను భయపెట్టి, బట్టీ పట్టించి విద్యను మూస పద్ధతిలో పాఠాలు భోధించేవాడు కాదు అంటాడు. ఉపాధ్యాయుడు అంటే పిల్లలకు సన్నిహితంగా, మంచి స్నేహితుడిగా అమ్మ, నాన్నలాగా వుంటూ సమాజ హితం కోరి విద్యనందించే వాడే అసలైన ఉపాధ్యాయుడు అంటాడు. తను అదే ఆచరించాడు. శాస్త్రీయ పద్ధతిలో సృజనాత్మకంగా పాఠాలు భోధించాడు. స్కూల్ గదికి పరిమితం చేయకుండా ఆటలు, పాటలు, ఉత్పత్తిలో పాల్గోవడం ద్వారా సామాజిక శాస్త్రాన్ని అధ్యయనం చేయించాడు. చైనాలోని మహత్తర సాంస్కృతిక విప్లవం గురించి పిల్లలకు ఎప్పుడూ చెపుతుండే వాడు. వెనకబడిన ఆదివాసీ చిన్నారులకు సులువుగా అర్ధం అయ్యే విధంగా పద్ధతులను ఎంచుకొని చెప్పేవాడు. వాళ్లతో పాటు తను ఆడుతూ పాడుతూ విద్యను నేర్పాడు. నాన్నలాగా విద్య బుద్ధులను చెప్పాడు. ఇప్పటికి జనతన సర్కార్ పిల్లలు ఆయన్ని నాన్నగానే భావిస్తున్నారు. జైల్లో ఎంతో మందికి ఉపాధ్యాయుడుగా రాజకీయ తరగతులు నిర్వహించి ఎందరో విప్లవ కారులను తయారు చేశాడు. జనతన సర్కార్ స్కూల్లో కూడా మరెందరో విప్లవ కారులను తీర్చి దిద్దాడు. కొద్ది మంది విద్యార్ధులను ఉపాధ్యాయులుగా తయారు చేశాడు. వాళ్ళే ఈరోజు స్వతంత్రంగా స్కూళ్లను నడుపుకునే స్థాయికి ఎదిగారు. స్కూళ్ళను కేవలం రాజకీయ పాఠశాలగానే కాదు ఆటలు, పాటలతో ఎప్పుడు ఉల్లాసంగా వుంచేవాడు. ఎంతగా అంటే సాధారణంగా స్కూల్‌కు వెళ్లడానికి పిల్లలు భయపడుతూ వుంటారు. కాని ఇక్కడ ఒక్కసారి స్కూల్లో చేరిన విద్యార్థి, తిరిగి పండుగలకు సెలవులిచ్చినా ఇంటికి వెళ్లడానికి సిద్ధ పడరంటే అతిశయోక్తి కాదు. నిర్బంధంలో కూడా ఏరోజు స్కూళ్ళను నిలిపి వేయలేదు. జనతన సర్కార్లలో పని చేస్తున్న వారికి ఆర్‌పిసి నిబంధనావళిని క్లాసుగా చెప్పేవాడు.

కా.కత్తి మోహన్‌రావు ఎక్కడ వుంటే అక్కడ రాజకీయ పాఠశాల వుంటుంది. ప్రతి విషయాన్ని, ప్రతి సమస్యను నాయకత్వంతో, క్యాడర్లతో ప్రజలతో సైద్ధాంతిక కోణంలోకి వెళ్ళి రాజకీయాలు చర్చించడం అతని అలవాటుగా మారింది. ఆర్గనైజేషన్ కామ్రేడ్స్ కలిసినప్పుడు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, ఫీల్డ్‌లో మనం ఎదుర్కొంటున్న సమస్యలను వివరంగా అడిగి తెలుసుకొని వాటికి పరిష్కార మార్గాలను చెప్పేవాడు. ప్రజలతో ఎలా మాట్లాడాలో చెప్పేవాడు. జనతన సర్కార్ల అభివృద్ధికి చాలా మేరకు సలహాలు అందించేవాడు.

40 సంవత్సరాల విప్లవ జీవితంలో ఎన్నో రకాల కష్టాలను ఎదుర్కొన్నాడు. ఎన్నో నష్టాలను చూశాడు. కా.దామదాదాను మానసిక జబ్బు, అస్తమా, బీపి, షుగర్ వ్యాధులు, శతృవు అణిచివేత క్యాంపెయిన్లు ప్రజల పక్షం నిలబడి పోరాడాలనే తన పట్టుదల, రాజకీయ కమిటిమెంట్ ప్రజల నుండి, విప్లవం నుండి దూరం చేయలేక పోయాయి. ఊపిరి ఉన్నంత వరకు ప్రజల కోసమే పరితపించాడు, ప్రజల కోసమే జీవించాడు. అయితే సిద్ధాంతాన్ని, వర్గ పోరాటాన్ని ఎంతైతే గ్రహించాడో ఆచరణలో వాటిని అమలు చేయడానికి ఆరోగ్యం సహకరించలేదు. అయినప్పటికి ఊరికే వుండేవాడు కాదు కా. ప్రకాశన్న నిరంతర అధ్యయన శీలి, విశ్లేషకుడు తెలుసుకున్న ప్రతీ విషయాన్ని సైద్ధాంతిక లోతుల్లోకి వెళ్ళి చర్చిస్తాడు. చైనాలో మావో నాయకత్వంలో సాగిన మహత్తర సాంస్కృతిక విప్లవం స్పూర్తిగా తీసుకొని పార్టీలో కొనసాగుతున్న అన్యవర్గ ధోరణులపై క్యాడర్లకు ఎడ్యుకేషన్ కల్పించేవాడు. ఆ ధోరుణుల లోతుపాతులను అర్థం చేయించేవాడు.

విప్లవోద్యమంలో ఎంతో సుదీర్ఘ అనుభవం, సైద్ధాంతిక జ్ఞానం కలిగిన కా.కత్తి మోహన్‌రావు అమరత్వం పార్టీకీ, ప్రజలకు తీరని లోటు. కా. దామదాదా పట్టుదలను, ఆదర్శాలను, పోరాట పటిమను స్పూర్తిగా తీసుకొని, తను మనకు అందించిన అనుభవాన్ని, జ్ఞానాన్ని పునికి పుచ్చుకొని ఆశయాలను తుది వరకు తీసికెళ్ళి కా. కత్తి మోహన్‌రావు కలలను నిజం చేద్దాం.

# మొదటి మహిళా దళ కమాండర్‌గా, టీచర్‌గా
# పార్టీలో తన సేవలు ఎంతో ఆదర్శం, ఆచరణీయం
# కామ్రేడ్ సిద్దబోయిన సారక్క (భారతక్క, బుద్రిదీది)కు జోహార్లు

ములుగు జిల్లా (ఉమ్మడి వరంగల్) అటవీ విప్లవోద్యమానికి వెన్నుముకగా నిలిచి అవకాశవాద, మితవాద పార్టీల దివాళకోరు విధానాలకు వ్యతిరేకంగా గట్టిగా పోరాడుతూ విప్లవోద్యమ నిర్మాణానికి, అభివృద్ధికి పునాదిగా నిలిచి విప్లవ సాంప్రదాయాలకు, త్యాగాలకు చిరునామా అయిన కాల్వపల్లి గ్రామంలోని నిరుపేద ఆదివాసి కుటుంబంలో కా.సిద్దబోయిన సారక్క జన్మించింది. ఐదుగురు సంతానంలో మొదటిది.



కాల్వపల్లి గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో వున్న వెనక బడిన ఆదివాసీ గ్రామం కావడంతో కొద్ది పాటి కరేదా (కరివేద) వ్యవసాయం, అటవీ ఉత్పత్తులపై ఆధారపడి వీరి కుటుంబం జీవనం సాగేది. ఉన్న దాంట్లో శ్రమ శక్తిని నమ్ముకొని తమ రెక్కల కష్టంపై ఆధారపడి బ్రతకడం తప్ప పెద్దగా చదువుకొని గొప్పగొప్ప ఉద్యోగాలు చేయాలనే ఆశలు వారిలో అంతగా కనబడవు. అందుకే కా॥ సారక్క తల్లి దండ్రులు కూడా ఒకటవ తరగతి చదువును మధ్యలోనే మాన్పించి గొడ్లు కాయడానికి పెట్టారు. తన చిన్నతనంలోనే తల్లిదండ్రులకు అన్ని పనుల్లో తోడుగా వుండేది. ఇంటి పనులతో పాటు పొలం పనులు చేసేది. అటవి ఉత్పత్తులను సేకరించడానకి తల్లితో పాటు వెళ్ళేది.

తనకు వయస్సు వచ్చిన తరువాత మేనమామ కోటి హనుమన్నను ప్రేమించింది. అతనినే పెళ్ళి చేసుకోవాలని గట్టిగా నిర్ణయించుకుంది. అయితే కోటి హనుమన్న పసరలో చదువుతున్న సమయంలోనే ఆర్ఎస్‌యూ రాజకీయాలతో ప్రభావితుడై, విప్లవ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. ఆ తరువాత కొద్ది కాలానికే పార్టీలో పూర్తి కాలం పనిచేయడానికి సిద్ధపడి వచ్చాడు. ఇష్టంగా ప్రేమించిన హన్మన్నను చూడడానికి గ్రామానికి దళం వచ్చిన ప్రతిసారి తరుచుగా వెళ్ళి చూస్తు వుండేది. అయితే అప్పటికే కాల్వపల్లి గ్రామం విప్లవ వాతావరణంలో వుండడం, జేఎన్ఎం పాటలు వింటూ వుండడంతో సారక్క పై విప్లవ రాజకీయాల ప్రభావం పడింది. దీనితో కా. కోటి హన్మన్నతో పాటు దళంలోకి వెళ్ళడానికి సిద్ధపడి 1985లో తన 15వ యేటనే దళంలో చేరింది. ఆ నాటికి దళాల్లో మహిళలు చాలా తక్కువగా వుండేవారు. అయినప్పటికి పురుషులతో పాటు గట్టిగా నిలబడింది. వారి మధ్య పెనవేసుకున్న ప్రేమ బంధాన్ని, విప్లవంపై వారికున్న నమ్మకాన్ని, వారి ఆచరణను చూసి పార్టీ వారిద్దర్ని ఒక్కటి చేసింది. కా॥ శ్యామన్న, కా॥ సత్తన్న సమక్షంలో కాల్వపల్లి ప్రజల మధ్య విప్లవ సాంస్కృతిక సాంప్రదాయాలతో వారి పెళ్ళి జరిగింది.

సారక్క దళంలో చేరే నాటికి తెలుగు దేశం ప్రభుత్వం 1985 అప్రకటిత యుద్ధాన్ని ప్రతి పల్లెలో క్యాంపులు పెట్టి పెద్ద ఎత్తున బలగాలను మోహరించడం, విప్లవకారులను పట్టుకొని కాల్చి చంపడం వంటి క్రూరమైన చర్యలతో మొదటి అణచివేత క్యాంపెయిన్ ప్రారంభించింది. మరో ప్రక్క పార్టీలో 1986లో మొదటి సంక్షోభం మొదలైంది. పార్టీ మీద నిర్బంధం, పార్టీలో వచ్చిన మొదటి సంక్షోభం అర్థం కాక చాలా మంది గందరగోళంతో పార్టీని విడిచి వెళ్లిపోయారు. ఏటూరునాగారం-మహదేవ్‌పూర్ అటవీ ప్రాంతంలో ఏటూరు నాగరం-1, ఏటూరు నాగారం-2 దళంలో పని చేసిన వారిలో దళానికి దళమే కోఆర్డినేటర్‌తో సహా సరెండర్ అయి జైలుకు వెళ్ళారు. ఈ ప్రభావంతో కోటి హనుమన్న కూడా సరెండర్ అయి జైలుకు వెళ్ళారు. (ఆనాటికి సరెండర్ అయిన వారిని కూడా జైలుకు పంపేవారు) కా. భారతక్క మాత్రం విప్లవాన్ని వీడి వెళ్ళలేదు. నిర్బంధాన్ని చూసి అధైర్య పడలేదు. శతృవు అణిచివేతను తట్టుకొని నిలబడింది.

అయితే ఆనాటికీ ఆదివాసి ప్రజల చైతన్యాన్ని, ప్రజల్లో హనుమన్నతో వున్న జీవ సంబంధాలను దృష్టిలో వుంచుకొని పార్టీయే సారక్కను ఇంటికి పంపింది. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు 1987లో అరెస్టు చేసి జైల్లో వేశారు. రెండు సంవత్సరాల తర్వాత జైలు నుండి విడుదలైన వెంటనే 1989లో కా. హనుమన్న, కా. భారతక్క ఇద్దరూ పార్టీని చేరుకున్నారు. మళ్ళీ దళంలో చేరి ఏడాది తిరగకుండానే సహచరున్ని కోల్పోయింది. 1989లో నార్లాపూర్-కాల్వపల్లి గ్రామాల

మధ్య దళం చేసిన ఆంబూష్‌లో కోటి హనుమన్న తలకు శత్రువు తూట తగిలి అమరుడయ్యాడు. అతని మరణం కా. భారతక్కను తీవ్రమైన దు:ఖంలో ముంచింది. సహచరున్ని కోల్పోయిన బాధలో తాను గర్భంతో వున్న సంగతి తెలుసుకోలేక పోయింది. గర్భిణీ అయిన విషయాన్ని ఆలస్యంగా గమనించడంతో అబార్షన్ చేయడం సాధ్యం కాలేదు. బిడ్డను కనడానికి బంధువుల ఇంట్లో పార్టీ పెట్టింది. షెల్టర్లో వుండి డెలవరీ అయిన విషయం చాలా మందికి తెలియడంతో నాలుగు నెలల పసికందును వదిలేసి దళం వద్దకు చేరుకుంది. తనకు సిజేరియన్ అయ్యి దళంలో తిరగడానికి ఇబ్బంది పడుతుండడంతో పార్టీనే తనను విశ్రాంతి కోసం గ్రామంలో పెట్టింది. ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీసులు సారక్కను పట్టుకోవడానికి గ్రామాన్ని చుట్టుముడితే ప్రజలు పోలీసుల కంట పడకుండా దాచుకొని తరువాత దళానికి అప్పగించారు. గెరిల్లా దళంలో తిరగలేదని ఇంటికి పంపాలనే పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకించి దళంలోనే గట్టిగా నిలబడింది. ఈ కాలమంతా ఇఎన్-1 ఇఎన్-2 దళంలో పని చేసింది.

మొదటి సారి దళంలో చేరినప్పుడు చదువు నేర్చుకోవడానికి నోరు తిరగక చాలా కష్టపడింది. ఆదివాసీ రైతాంగం కావడంతో స్పష్టంగా ఉచ్ఛరించడం రాక తన యాసలో పలికేది. దీనితో అందరు సరదాగా నవ్వు కునేవారు. అమరుడు కామ్రేడ్ భీమన్న అనునయించి చదువు నేర్చుకునేటట్లు చేశాడు. పట్టుదలతో కష్టపడి చదువు నేర్చుకుంది.

1993లో ఏసీఎంగా ప్రమోట్ అయ్యి ఉత్తర తెలంగాణ ఫారెస్టు డివిజన్ (ఎన్‌టిఎఫ్‌డి) మొదటి మహిళా దళ కమాండర్‌గా కొద్ది నెలలు పని చేసింది. 1998 నుండి పాండవ దళంలో స్క్వాడ్ ఏరియా కమిటి సభ్యురాలుగా పని చేస్తూ వచ్చింది. 2000లో గుండాల దళ కమాండర్‌గా ఒక సంవత్సరం పాటు పని చేసింది. 2001లో మంగపేట ఎల్‌ఓఎస్ కమాండర్‌గా, 2002లో మణుగూరు ఎల్‌ఓస్ కమాండర్‌గా బాధ్యతలు నిర్వర్తించింది. 2003లో రెండవ సారి అరెస్టు అయి 2005లో జైల్ నుండి విడుదల అయింది. 2007 వరకు తెలంగాణ విప్లవోద్యమంలో పనిచేసి 2008లో దండకారణ్యానికి బదిలీపై వెళ్ళింది.

తన 36 సంవత్సరాల సుదీర్ఘ విప్లవ జీవితంలో అనేక ఒడుదుడుకులను, నిర్బంధాలను, కష్టాలను ఎదుర్కుంటూ మానసిక ధైర్యంతో తాను నిలబడి, దళాలను నిలబెడుతూ విప్లవోద్యమ నిర్మాణ కృషిలో ఎంతో పాటుపడింది. 1985లో సంగెంపల్లి వద్ద పోలీసులతో ఫైరింగ్ జరిగినప్పుడు దళ కమాండర్ పటేల్ సుధాకర్‌తో పాటు నిలబడి తన వద్ద వున్న 12 బోరు తుపాకీతో ఫైరింగ్ చేసి ప్రతిఘటిస్తు శతృవును నిలవరించడంలో అత్యంత ధైర్య సాహసాన్ని ప్రదర్శించింది. ఇదే సంవత్సరం కమలాపూర్ ఊరిలో భూస్వామిపై దాడి చేసి తుపాకీని స్వాధీనం చేసుకున్న ఘటనలో క్రియాశీలంగా పాల్గొంది. లంకెలగడ్డ గ్రామం వద్ద చేసిన ఆంబుష్‌లో సైనికురాలుగా తన పాత్రను సమర్ధవంతంగా నెరవేర్చింది. ఇదే ప్రాంతం అంబటిపల్లి గ్రామంలో భూస్వాముల ఇండ్లపై కరువు దాడి చేసి పేదలకు పంపిణీ చేయడంలో తన వంతు పాత్ర పోషించింది. కాటాపురంలో విప్లవోద్యమాన్ని అణిచివేయడానికి భూస్వాముల పక్షాన నిలబడి ప్రజలపై క్రూరంగా వ్యవహరించిన స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ రాజేంద్ర ప్రసాదును ఖతం చేయడంలో చురుకుగా పాల్గొంది. మణుగూర్ ఏరియాలో తెలుగు దేశం పార్టీకి చెందిన గ్రామ పెత్తందారు జనార్ధన్ రెడ్డిని, జానం పేటలో ఇన్‌ఫార్మర్ రవిలను చంపిన ఘటనలకు నాయకత్వం వహించింది. 2001లో తుపాకుల గూడెం అడవుల్లో మన మకాంను గ్రేహౌండ్స్ బలగాలు పెద్ద ఎత్తున చుట్టుముట్టి దాడి చేసిన ఘటనలో 8మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. కొద్ది మంది కామ్రేడ్స్‌కు గాయాలు అయితే వారిని ఫైరింగ్ మధ్య సురక్షితంగా తీసుకొచ్చింది.

2000లో గుండాల కమాండర్‌గా ఒక సంవత్సరం పాటు బాధ్యతలు చేపట్టింది. గుండాల ఎల్‌ఓఎస్ పరిధిలో ప్రజలను కలుస్తున్న సంధర్భంలో న్యూడెమోక్రసీ పార్టీ, మన దళాలను రానిచ్చే వారు కాదు. గుండాల ప్రాంతంలో ప్రజా పంథా పార్టీ కొంత బలం కలిగి నియంతృత్వ ధోరణితో వ్యవహరించేది. కా. భారతక్క కమాండర్‌గా వున్న సమయంలో గుండాల మండలంలో ప్రజలను కలువడానికి పాలగూడెం గ్రామంలోకి సాయంత్రం 7గం॥లకు దళం ప్రవేశిస్తుండగా ముందుగానే అక్కడ చేరుకొని వున్న ప్రజాపంథా దళం మనల్ని గమనించి ఉద్దేశ పూర్వకంగా ఫైరింగ్ చేసింది. ఆ ఫైరింగ్ మన దళమే చేసినట్లుగా అబద్దాలు ప్రజల్లో ప్రచారం చేసి ప్రజలను మనపై ఉసిగొల్పారు. చెంబూనిగూడెం గ్రామంలో మన దళం తుపాకులు లాక్కోవడానికి పెత్తందారి నాయకత్వం ప్రజలను ఎగేశారు. ఈసమయంలో కా. భారతక్క సమయ స్ఫూర్తిని ప్రదర్శించి దళాన్ని కాపాడింది. వాళ్ళు మనల్ని అడ్డుకోవడానికి గ్రామాల్లోకి రానివ్వక పోవడం, ప్రజలు జమ చేసిన అన్నంలో ఇసుక కలుపడం, మనపై అబద్దాలు ప్రచారం చేయడం, పీపుల్స్‌వార్ పార్టీకి సహకరించ కూడదని ప్రజలను బెదిరించిడం వంటి అనేక కుట్ర పూరిత విధానాలు అనుసరించిన ఏనాడు వెనకడుగు వేయలేదు. వారి దివాళ కోరు రాజకీయాలను ప్రజల్లో ఎండగడుతు ధైర్యంగా ఎదురుకుంది. 2006లో జైలు నుండి వచ్చిన తరువాత కేకేడబ్ల్యూ డివిజన్‌లో పని చేసింది. 2006 చివరిలో తెలంగాణ బలగాలు రిట్రీట్ అయినప్పుడు కేకేడబ్ల్యూ డివిజన్ - దక్షిణ్ బస్తర్ బలగాల సంయుక్తంగా చేపట్టిన టీసీఓసిలో ఆరు నెలలు పాల్గొంది. గొడ్డలి, ఆరాయన్‌పూర్ వద్ద శత్రువుపై మన బలగాలు చేసిన దాడులలో పాల్గొంది. 2007లో జరిగిన ఉత్తర తెలంగాణ 3వ కాన్ఫరెన్స్‌లో పాల్గొంది.

కా.భారతక్క 2006 జైల్ నుండి వచ్చే సరికి 1990లో వదిలేసి వచ్చిన నాలుగు నెలల పసికందు 17 సంవత్సరాల వయస్సులో కా.అభిలాష్ పూర్తికాలం విప్లవకారుడుగా 303 తుపాకీని భూజాన తగిలించుకొని వీర సైనికుడి రూపంలో కొడుకుని చూసి సగర్వంగా ఫీలయ్యింది.

2008లో కా.భారతక్క పార్టీని అభివృద్ధి చేయడానికి సరిహద్దులను దాటి దండకారణ్యానికి వెళ్లింది. ప్రాంతంకాని ప్రాంతంలో భాష తెలియదు, ప్రజలు తెలియదు అయినప్పటికి అక్కడి ప్రజలను పరిచయం చేసుకొని పట్టుబట్టి భాషను నేర్చుకుని అనతి కాలంలోనే వారితో కలిసిపోయింది. తన అనారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పార్టీ

ఇంద్రావతి ఏరియా సభ్యురాలుగా, జనతన సర్కార్ స్కూల్‌కు బాధ్యురాలుగా, టీచర్‌గా నియమించింది. తనకిచ్చిన బాధ్యతను ఎంతో ఉన్నతంగా భావించి నేటి పిల్లలే రేపటి విప్లకారులుగా తీర్చిదిద్దే పనిలో పడింది. ఆదివాసీ గూడాల్లో అందని చదువును అందుబాటులోకి తీసుకెళ్ళింది. యాంత్రిక చదువులకు స్వస్థి చెప్పి శాస్త్రీయ పద్దతుల్లో విద్యను భోధించింది.అక్షరం ఒక్కటే నేర్పలేదు. ఆటలు, పాటలు, వ్యవసాయం, రాజకీయాలు, యుద్ధ విద్యలు అన్నింటిని నేర్పింది. పిల్లలకు పాఠ్యంశాలు భోధించే గురువుగానే కాదు గొప్ప రాజకీయవేత్తగా కూడా పేరుతెచ్చుకుంది. స్కూల్‌ను ఒక రాజకీయ పాఠశాలగా తీర్చిదిద్దింది. పిల్లలకు ప్రేమను పంచి అమ్మగా మారింది. పిల్లలకు జ్వరం వస్తే డాక్టర్ అయింది. పిల్లలకే కాదు ప్రజలకు వైద్యం అందించి గొప్ప ప్రజా సేవకురాలుగా గుర్తింపు పొందింది. తనకు ఎన్ని అనారోగ్య సమస్యలున్న పిల్లలతో గడుపుతూ తన సమస్యలను మైమరిచి పోయేది.

జనతన సర్కార్ స్కూల్‌ను, స్కూల్ కమిటీని సమర్ధవంతంగా నడిపించింది. స్కూల్‌కు, పిల్లలకు ఎలాంటి సమస్యలు రాకుండా చూసింది. సమస్య వస్తే పరిష్కరించింది. పార్టీ ఇచ్చిన బాధ్యతలను శిరస్సా వహించి పని చేసింది. అనుక్షణం పార్టీ కోసం, ప్రజల కోసమే తపన పడేది. అనారోగ్యం తనను వెంటాడి వేధించినా పెద్దగా బాధ పడేది కాదు. సమయానికి మందులు రాలేదనే నిరాశ చెందేది కాదు. విప్లవోద్యమంలో వుండే ప్రతికూల పరిస్థితులను ప్రాపంచిక దృక్పధంతో అర్ధం చేసుకునేది. నీది, నాది అనే బేదం లేకుండా అందరి సమస్య తన సమస్యగా భావించేది. నిస్వార్ధ బుద్ది జీవి కా.సిద్దబోయిన సారక్క తెలంగాణలో భారతక్కగా, దండ కారణ్యంలో బుద్రిదీదీగా ప్రజలకు సుపరిచితం.

కా.బుద్రి దీదీ ఇంద్రావతి ఏరియా కమిటి సభ్యురాలుగా తనకు ఇచ్చిన బాధ్యతను ఎలాంటి సమస్య రాకుండా నిర్వర్తించింది. ఏసీ సమావేశాల్లో ఎలాంటి ఉదారవాదం లేకుండా తన అభిప్రాయాలను ముక్కు సూటిగా మాట్లాడేది. ప్రతి విషయాన్ని చాలా స్పష్టంగా, విమర్శనాత్మకంగా చర్చించేది. తను చేసే నిర్ణయాత్మక చర్చ జనతన సర్కార్ వికాసానికి ఎంతగానో తోడుపడింది. కేవలం చర్చలకే పరిమితం కాకుండా ఆచరణలో అమలు కోసం తపన పడేది. స్కూల్స్ వున్న ప్రతి జనతన సర్కార్ సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరు అయ్యేది. దీనితో జనతన సర్కార్లపై వాటి పరిధిలో నడిచే స్కూళ్ళ పై మంచి అవగాహన ఏర్పడింది.

కా.భారతక్క ప్రజలతో, క్యాడర్‌తో గల గల మాట్లాడుతూ చాలా త్వరగా కలిసిపోయేది. క్యాడర్ యొక్క సమస్యలను అడిగి తెలుసుకొంటూ క్యాడర్లకు మానసిక ధైర్యాన్నిస్తూ ముందుకు నడిపేది. అనారోగ్యాలకు గురైనా కామ్రేడ్స్‌ను అప్యాయంగా పలుకరిస్తూ తనకు తెలిసిన వైద్యాన్ని అందించేది. అంతే కాకుండా విప్లవోద్యమంలో ఎదురయ్యే కష్టాలను, నిర్భంధాలను తట్టుకొని గట్టిగా నిలబడి పోరాడాలని తన సుదీర్ఘ అనుభవాన్ని క్యాడరుకు అర్ధం అయ్యే విధంగా బోధించేది.

కా.కోటే హనుమన్న మరణం తరువాత 1992లో పార్టీ ప్రతిపాదించిన కా॥ కత్తి మోహన్‌రావుతో వివాహం జరిగింది. వీరిద్దరి బంధం విప్లవ ప్రయాణంలో 29 సంవత్సరాలు అన్యోన్యంగా సాగింది. సహచరుడు ధీర్ఘ కాలికంగా కొనసాగుతున్న అస్తమా, మానసిక జబ్బు ఇబ్బంది పెడుతుంటే తన ఆరోగ్య విషయాలను దగ్గరుండి ఎంతో ఓపికతో సేవ చేసింది. ఒక రకంగా తను బ్రతికున్నంత కాలం చిన్న పిల్లాడిని సాకినట్లు సాకింది. తన సహచరుడు ఒక్కొక్క సారి మానసిక జబ్బుతో ఎన్నో ఇబ్బందులు పెట్టిన సహనం, ఓర్పు వహించి మళ్ళీ మాములు మనిషిని చేసేది. ఇంత కాలం బ్రతికుంచుకున్న ఇప్పుడు వదులుకుంటానా అనే తన మాటలు తన ఓపికకు, చైతన్యానికి అద్దం పడుతుంది.

కా.భారతక్క 1986 చివరిలో ఇంటి వద్ద వుండగా పోలీసులు అరెస్టు చేశారు. చిత్రహింసలకు గురి చేసి జైల్లో పెట్టారు.రెండు సంవత్సరాలు జైలు జీవితాన్ని గడిపి 1989లో మళ్ళీ దళంలోకి వచ్చింది. రెండవ సారి 2003లో గర్భ సంచికి ఆపరేషన్ జరిగి రెస్టు కోసం వెళ్తుండగా అరెస్టు చేశారు. శత్రువు నెల రోజులు మానసికంగా హింసించి తనపై లక్షలు గుమ్మరించిన దిగజారి పోలేదు. పెదవి విప్పలేదు. 30 కేసులు పెట్టి జైల్‌కు పంపారు. మూడు సంవత్సరాలు జైల్లో వుండి 2006లో విడుదలై వచ్చింది. 36 సంవత్సరాల విప్లవ జీవితంలో 5సంవత్సరాలు జైల్ జీవితాన్నే గడిపింది. జైల్లో సమస్యల పరిష్కారానికి జరిగిన పోరాటాల్లో తను పాల్గొంది.

వీరిది ఒక విప్లవ సాంప్రదాయ కుటుంబం అనడానికి వారి త్యాగాలే నిలువెత్తు నిదర్శనం. 1989లో అమితంగా ప్రేమించిన కా.కోటే హనుమన్న నార్లాపూర్ ఆంబుష్‌లో అమరుడయ్యాడు. 1998లో చిన్నాన్న కొడుకు సిద్దబోయిన అశోక్‌ను కొరియర్‌గా వెళ్తున్న సమయంలో శత్రువు పట్టుకొని కాల్చి చంపాడు. ఇదే కుటుంబంలో తన చెల్లె కూతురు కా. ఊర్మిళా 2013లో పువ్వర్తి గ్రామం వద్ద గ్రేహౌండ్స్ బలగాలు చుట్టుముట్టిన దాడిలో తుదిశ్వాస విడిచింది. తను కన్న కొడుకు కా.అభిలాష్ 2020లో గడిచిరోలిలో సి60 పోలీసుల దాడిలో ప్రాణాలు విడిచాడు. తన మరణానికి 12 రోజుల ముందు గుండెపోటు వచ్చి రెండవ సహచరుడు కత్తి మోహన్‌రావును దూరం చేసింది. కరోనా మహామ్మారి 12 రోజుల వ్యవధిలో కా. సిద్దబోయిన సారక్కను మననుండి భౌతికంగా దూరం చేసింది. తను బ్రతికిన కాలమంతా నా అనుకున్న వాళ్ళు తన కళ్ళ ముందే ఒక్కరొక్కర్ని కోల్పొయిన బాధను, దు:ఖాన్ని పంటి బిగువున అదిమి పట్టి కొన ఊపిరి వరకు ముందుకు సాగిందేగాని ఏరోజు అధైర్య పడి వెనకడుగు వేయలేదు.

ఎన్నెన్ని కష్టాలకోర్చి, నిర్బంధాలను దాటుకుంటూ సాగిన నీ సుదీర్ఘ ప్రయాణంలో నీవు ప్రదర్శించిన అద్భుత ధైర్య సాహసాలకు, అత్యున్నత చైతన్యానికి, ఓపికకు వందనం విప్లవాభివందనం.

కా.భారతక్క అమరత్వం ప్రజలకు, పార్టీకి తీరని లోటు. కా.సారక్క కలలు కన్న రాజ్యం సాధించడం కోసం మనమంతా ప్రతిన బూనుదాం. కా. భారతక్క నుండి ఆమే పట్టుదలను, అంకిత భావం, ఓపిక, సేవా దృక్పథం, కష్టపడేతత్వాన్ని అలవర్చుకుందాం.

# విప్లవోద్యమంలో కా. గడ్డం మధుకర్ (శోభరాయ్) సేవలు ఆదర్శం అనుసరణీయం

కా. శోభరాయ్ (గడ్డం మధుకర్) కోమురం భీం అసిఫాబాద్ జిల్లా, పెంచికల పేట మండలం, కొండపల్లి గ్రామంలో 38 సం. క్రితం ఒక పేద రైతు కుటుంబంలో తల్లిదండ్రులు విమల, బాపులకు పుట్టాడు. మధుకర్ 9వ తరగతి వరకు చదువుకున్నాడు. 1999లో 16 ఏళ్ల వయస్సులో పీపుల్స్‌వార్ పార్టీలో చేరాడు. కా. గడ్డం మధుకర్ బాబాసాగర్ స్కూల్‌లో చదువుతూ రిక్రూట్ అయినాడు. 1999లో సిర్పూర్ దళంలో దళ సభ్యుడుగా పనిచేశాడు. అదిలాబాద్ జిల్లాలో ఉన్నపుడు స్క్రీన్ ప్రింటింగ్ నేర్చుకొని, కరపత్రాలు ప్రచురించాడు. 2000 సం.లో బోథ్ దళానికి బదిలీ అయి ఆ సంవత్సరం చివరి వరకు అక్కడే పని చేసాడు.



2001 జనవరిలో అదిలాబాద్ నుండి టెక్నికల్ రంగానికి బదిలీ అయినాడు. ఈ క్రమంలో దండకారణ్యానికి బదిలీ అయి పని చేసాడు. పీపుల్స్‌వార్ పార్టీలో చేరాడు. పాఠశాలలో చదువుకున్నది తక్కువే కాని విప్లవోద్యమంలో ఎన్నో నేర్చాడు. ఏ అవసరం వచ్చినా అది ఆయుధానికైనా, మనిషికైనా, కంప్యూటర్‌కైనా శోభరాయ్ ఉంటే పరిష్కారమవుతుంది. గ్రామాల్లో ప్రజల అవసరాలు, బోరింగ్ సమస్యలు, మోటార్ సమస్యలు, రేడియో, మొబైల్ ఇలా ఎన్నో వెంటనే పరిష్కరించేవాడు కా. శోభరాయ్. టెక్నిక్ పట్టుకొని, సృజనతో చకచకా చేయడంతో పాటు ప్రజల దగ్గరకు వెళ్లినపుడు వారి సమస్యలను తెలుసుకోవడం, ప్రజల సమస్యలకు దారి చూపిస్తూ, పార్టీ సిద్ధాంతాలను చెప్పి వారిని చైతన్యపరుస్తూ, ప్రజల నాడి పట్టుకుని చాల కొద్ది సేపటిలోనే ప్రజల ప్రియమిత్రుడుగా, విశ్వాసపాత్రుడుగా మారి, అన్ని పనులు సంభాళించుకుని వచ్చే నేర్పు ఉన్న కామ్రేడ్ శోభరాయ్. జనరల్ వైద్యం తెలిసిన శోభరాయ్ మంచి దంత వైద్యుడు. ఒకసారి చూస్తే ఆ విషయాన్ని అర్థం చేసుకుంటాడు. ఆ పరికారాల మీద పట్టు సంపాదిస్తాడు. ఎన్నో క్యాంపులలో చాలా మంది కేడర్‌కు, ప్రజలకు కళ్ళు, పళ్లు, ఇతర రకాల వైద్యాలు చేసాడు.

కమ్యూనికేషన్ (టెక్నికల్) శోభరాయ్ టెక్నికల్ మైండ్. కమ్యూనికేషన్ టీంలో సుదీర్ఘ కాలం పని చేసాడు. కంప్యూటర్‌తో పాటు కమ్యూనికేషన్‌కు సంబంధించిన ఇంగ్లీష్ భాషలో ఉన్న పుస్తకాలను చదువుతూ ఉద్యమానికి ఉపయోగపడేలా తెలుగులో, కోయలో నోట్స్ తయారుచేసి కేడర్‌కు క్లాసులు చెపుతూ కమ్యూనికేషన్ శిక్షణనిచ్చేవాడు. అనేక రకాల ట్రాన్స్ మిటర్స్‌పై తనకు పరిజ్ఞానం ఉండేది. ప్రింటింగ్ పనులు సునాయసంగా చేసేవాడు. అలానే అర్థం చేయించేవాడు.


కామ్రేడ్ శోభరాయ్ నిరంతరం అవిశ్రాంతంగా పనిచేస్తూ బరువులు మోయడం, డంపుల నిర్వహణలో ముందుండేవాడు. సాధారణ సభ్యుల నుండి నాయకత్వం వరకు అందరితో కలిసి పోయేవాడు. తనకున్న నైపుణ్యంతో ఎంతో మంది కామ్రేడ్స్‌కి అన్ని రకాల శిక్షణనిచ్చేవాడు. ఈ విధంగా ఎన్నో రకాలుగా ఆధారపడదగిన శక్తి వంతమైన కామ్రేడ్ శోభరాయ్.

దక్షిణ బ్యూరో కమ్యూనికేషన్ ఇన్‌చార్జ్‌గా, డీవీసీ సభ్యునిగా అన్ని రంగాలలో సహకరిస్తూ ఎదిగిన ముఖ్యమైన కామ్రేడ్ శోభరాయ్. గత కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ వైద్య సహాయం తీసుకుంటున్నాడు. కాళ్ళ నొప్పులు తీవ్రం కావడంతో బయట హాస్పటల్‌కు వెలుతున్న క్రమంలో జూన్ 2న వరంగల్ సమీపంలో పోలీసులు అరెస్టు చేసి, చిత్రహింసలతో హత్యచేసి గుండెపోటుతో చనిపోయినట్లు ప్రకటించారు.

కా. శోభరాయ్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తీసుకువెళ్లి బంధుమిత్రులు, గ్రామస్తుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. 22 సం.ల విప్లవ జీవితంలో అవిశ్రాంతంగా కార్మికవర్గ చైతన్యంతో విప్లవోద్యమానికి చేసిన కృషి కా. శోభరాయ్ ఆదర్శ జీవితం మనకు మార్గదర్శకంగా ఉంటుంది.

# విప్లవమే లక్ష్యంగా పోరాడుతూ ప్రాణాలర్పించిన ప్రజా డాక్టర్ కామ్రేడ్ అశోక్‌కు ఎర్రెర్రని జోహార్లు

కా. సందె గంగన్న (అశోక్) ఉమ్మడి కరీంనగర్ జిల్లా (ప్రస్తుతం పెద్దపల్లి), ఓదెల మండలం, గుంపుల గ్రామంలో 1982 సం.లో జన్మించాడు. తల్లిదండ్రులకు నలుగురు సంతానంలో మూడవవాడు. కా. అశోక్ వాళ్లది విప్లవ కుటుంబం. కా. అశోక్ పెద్దన్న కా.సందె రాజన్న 1995లో రిక్రూట్ అయి, విద్యార్థి ఆర్గనైజేషన్‌లో పనిచేస్తూ, పార్టీ పనిపై వెళ్తుండగా, 1996లో శత్రువు చేతికి చిక్కి బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యాడు. కా. సందె రాజమౌళి (ప్రసాదన్న), కా. అశోక్ ఒకే కుటుంబానికి చెందిన వాళ్లు. తన అన్నలిద్దరూ పీడిత ప్రజల విముక్తికోసం ప్రాణాలర్పించడం అశోక్‌ను బాగా ప్రభావితం చేసింది. వాళ్ళ ప్రేరణతోనే తాను కూడా పార్టీలోకి వెళ్ళాలని దృఢంగా నిశ్చయించుకున్నాడు. దీంతో తన నిర్ణయాన్ని పార్టీ ముందు ప్రతిపాదించాడు. 1998లో ఆర్‌వైఎల్‌లో పనిచేసాడు. తనతోటి యువకులతో చేరి, గ్రామంలో భూస్వాములకు వ్యతిరేకంగా భూ ఆక్రమణ పోరాటాలలోనూ, పెత్తందార్ల అవినీతి, దోపిడీ, అజమాయిషీకి వ్యతిరేకంగాను యువతను, ప్రజలను కూడగట్టి పోరాటాలు చేయించాడు. ఈ దోపిడి వ్యవస్థ మారాలంటే, సాయుధ పోరాటమే సరైన మార్గమని నమ్మి 2000 సం.లో పూర్తి కాలంగా రిక్రూట్ అయినాడు.



కామ్రేడ్ అశోక్ రిక్రూట్ అయిన వెంటనే పెద్దపల్లి ఏరియా, కాల్వ శ్రీరాంపూర్ ఎల్‌ఓఎస్ దళంలో పనిచేసాడు. ఏరియాలో పని చేస్తున్నప్పుడు ప్రజలతో మమేకమై, కలిసిపోతూ వాళ్లకు అప్యాయతలు పంచుతూ వారి విశ్వాసాన్ని చూరగొన్నాడు. కా. అశోక్‌ను ప్రజలు గుర్తుపెట్టుకుని అడిగేవారు. 2001 జూన్‌లో హుజురాబాద్ దళానికి బదిలీ అయినాడు. 2002 చివరిలో ఆయుధాల తయారీ, మరమత్తు చేసే విభాగం(టీడీ)లోకి బదిలీ అయినాడు. 2002-2007 వరకు అక్కడే పనిచేసాడు. టీడీలో నాయకత్వానికి తనకు తెలిసిన మెకానిక్ విషయాలు చెపుతూ ఎంతో సహకరించేవాడు. ఆయుధాలు తయారు చేయడంలో, రిపేరింగ్ చేయడంలో ఎంతో పట్టుదలతో, నిబద్దతతో పనిచేస్తూ తన వంతు పాత్ర నిర్వహించాడు. అతనికి కొంత అనారోగ్య సమస్య రావడంతో బదిలీ ప్రతిపాదన పెట్టినాడు. సీఆర్‌సీకి చెందిన రెండవ కంపెనీలోకి 2008 సం. మే నెలలో బదిలీ అయినాడు. ఈ చివరి కాలంలో అనారోగ్య సమస్యలతో కొద్దికాలం కార్యకలాపాలకు దూరంగా ఉన్నాడు.

2009 సం॥లో పార్టీ, కామ్రేడ్ అశోక్‌ను ఉద్యమ అవసరాల రీత్యా ఏఓబీకి పంపింది. అప్పటికే, ఆయనను ఒక రకమైన వ్యాధి పీడిస్తూ వచ్చింది. శరీరంలో తగినంత ఎముకపుష్టి లేకపోవటంతో, శరీరం ఒకవైపుకు వంగుతూ వచ్చింది. ఈ వ్యాధిలో భాగంగానే శరీరంపై, పెద్ద పెద్ద గడ్డలు ఏర్పడ్డాయి. ఈ మార్పులన్నీ తనకు బాగా ఇబ్బంది కల్గిస్తూ వచ్చాయి. ఈ పరిస్థితులలో, ఏఓబీ రాష్ట్ర కమిటీ, కా. అశోక్‌ను ట్రీట్‌మెంట్ నిమిత్తం పంపింది. కా. అశోక్ శరీరాన్ని పరీక్షించిన డాక్టర్లు, ఆయనకు చాల పెద్ద ఆపరేషన్ అవసరమనీ, అది చాలా ఖర్చుతో కూడుకున్నదని చెప్పారు. డాక్టర్లు చెప్పిన విషయాలను, పార్టీ పరిగణలోకి తీసుకుంటూ, వెంటనే ఆపరేషన్‌కు అవసరమైన ఆర్థిక, ఇతర వనరులను సమకూర్చింది. ఆ తదుపరి డాక్టర్లు, ఆపరేషన్‌ను విజయవంతం చేసారు. ఈ సమయంలో, కా. అశోక్ ఎంతో బాధను ఓర్చుకొంటూ కనబరిచిన నిబ్బరత్వానికి, డాక్టర్లు ఆశ్చర్యపోయారు.

ఆపరేషన్ అనంతరం, ఆయనకు శరీరం సహకరించడం ప్రారంభమైంది. మళ్ళీ ఎప్పుడూ, అనారోగ్య సమస్యలు రాలేదు. అప్పటినుంచీ ఆయన వైద్యరంగంలో సేవలు అందిస్తూ వచ్చాడు. ఆయన పెద్దగా చదువుకోక పోయినప్పటికీ, వైద్యరంగంపై ఉన్న మక్కువతో ఏ విషయాన్నైనా కష్టపడి, పట్టుబట్టి నేర్చుకొనేవాడు. వైద్యానికి సంబంధించిన విషయాలను నేర్చుకోవడంలో, ఆయనను "ఏక సంథాగ్రాహి" అని కూడ చెప్పవచ్చు. ఒక సారి పార్టీ క్యాడర్లకు 'వేసెక్టమీ' ఆపరేషన్ చేసేందుకు నిష్ణాతుడైన, క్వాలిఫైడ్ డాక్టర్ ఉద్యమ ప్రాంతానికి వచ్చాడు. ఆ సందర్భంగా, పార్టీ 'వేసెక్టమీ' చేసే విధానాన్ని కా. అశోక్‌కు నేర్పమని డాక్టర్‌ను కోరింది. డాక్టర్ ఆమోదించడంతో, కా. అశోక్ 1,2 కేసులలో ఆపరేషన్ సందర్భంగా ప్రత్యక్షంగా పాల్గొన్నాడు. అంతే, అప్పటి నుంచీ ఆయన పార్టీ క్యాడర్లకూ, ప్రజలకు పదుల సంఖ్యలోనే 'వేసెక్టమీ' ఆపరేషన్లు చేసాడు. ఏఒక్కటీ ఫెయిల్‌కావడం గానీ, ఇతర సంక్లిష్టతలు చోటుచేసుకోవడం గాని జరగలేదంటే, అతిశయోక్తి కాదు.

ఆయన ఏఓబీ వచ్చిన తర్వాత, వైద్యరంగంలో నిర్వహించిన సేవలు, ఏఓబీ విప్లవోద్యమ పురోగమనానికి ఎంతో దోహదపడ్డాయి. ప్రధానంగా ఆయన మల్కన్‌గిరి, కోరాపుట్ విడిజన్‌లోనూ, విశాఖ–ఈస్ట్ డివిజన్‌లోను వైద్య సేవలు అందించాడు. అతి తక్కువ సమయంలోనే ఒడియా భాషను నేర్చుకొని, ఒడిశా ప్రజలలో ఒక్కడిగా కలిసిపోయాడు. ఒడియా భాషలోనే ప్రజలకు పార్టీ రాజకీయాలను బోధించేవాడు. స్థానిక పార్టీ కమిటీలు చేసిన నిర్ణయాలకు అనుగుణంంగా, అనేక మెడికల్ క్యాంపులలో, గ్రామస్థాయి కార్యకర్తలకు వైద్యంలో తర్ఫీదునిచ్చాడు. అనారోగ్య సమస్యలతో తీవ్రంగా బాధపడుతున్న గ్రామ ప్రజలకు ఎంతో ప్రేమగా వైద్యాన్ని అందించాడు. ముఖ్యంగా కట్ఆఫ్ ఏరియాలో, ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఎప్పుడు, ఎక్కడ అనారోగ్య సమస్య ఉన్నా, వెంటనే వెళ్లి వాళ్లకు సహాయం అందించేవాడు. 'వాళ్లకు తల్లో నాలుకలా' తయారైనాడు. 2020లో కరోనా వచ్చినప్పుడు, పార్టీతో చర్చించి, లక్షలాది రూపాయల మందులు తెప్పించి, ప్రజలకు అందించాడు. మెడికల్ టీంలను ఏర్పరిచి, ప్రజలకు ఆరోగ్య నియమాలను అర్థం చేయిస్తూ, ప్రచారం చేయడంలోనూ, వైద్యం అందించడంలోను ఎనలేని కృషి చేసాడు. కా. అశోక్ సమర్థతలను దృష్టిలో పెట్టుకొని, ఎస్‌జెడ్‌సీ 2019లో జరిగిన మీటింగ్‌లో ఆయనను ఎంకేబీ (మల్కనగిరి, కోరాపుట్ బోర్డర్)డివిజన్ కమిటీలోకి తీసుకుంది.

అయితే ఆయన వైద్యరంగంలో నిర్వహించిన కృషి, 'నల్లేరు మీద బండి'లా సాగలేదు, రోజు రోజుకు పెరుగుతూ వచ్చిన శత్రు ఫాసిస్టు దాడుల మధ్యనే, ప్రజల సహకారంతో, తన కృషిని నిర్వహించాడు. అనేక ఎన్‌కౌంటర్లలో, శత్రుదాడిని తిప్పికొట్టడంలో ప్రత్యక్షంగా పాల్గొన్నాడు. ఆ ఎన్‌కౌంటర్ల సందర్భంగా గాయపడిన పీఎల్‌జీఏ యోధులకు, ఆయన దగ్గర ఉండి వైద్యం అందించాడు. రాంగుడ ఎన్‌కౌంటర్లో గాయపడిన కామ్రేడ్స్‌కు కా. అశోక్ నేతృత్వంలోనే వైద్యం అందించడం జరిగింది. వాళ్లు అనతికాలంలోనే కోలుకొని, తమ తమ పనుల్లోకి వెళ్ళగలిగారు.

కామ్రేడ్ అశోక్ కేవలం 'విప్లవ ప్రజా వైద్యుడే' కాదు, అనేక రంగాలలో ఆయనకు ప్రవేశముంది. ఒక్క మాటలో చెప్పాలంటే, ఆయనను 'బహుముఖ ప్రజ్ఞాశాలి' అని చెప్పవచ్చు. తుపాకుల రిపేర్ మొదలుకొని, ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ పరికరాల మరమత్తు పనులను సైతం చేసేవాడు. పార్టీకి ఏ అవసరం పడ్డా కా. అశోకే గుర్తుచ్చేవాడు. ఇక విప్లవం యెడల అంకితభావంలోనూ, వర్గ థృక్పథంలోనూ, ప్రజలను ప్రేమించడంలోనూ  చరిత్ర పురోగమనంపై విశ్వాసం ఉంచడంలోను ఆయన నిజాయితీని వేలెత్తి చూపే అవకాశమే లేదు. ఇటువంటి కామ్రేడ్‌ను కోల్పోవడం, పార్టీకి, పీడిత ప్రజానీకానికి ఎనలేని నష్టమే. కామ్రేడ్ అశోక్ జూన్ 16, 2021న విశాఖ జిల్లా, తీగలమెట్ట వద్ద గ్రేహౌండ్స్ పోలీసులు చేసిన అకస్మాత్ దాడిలో అమరుడైనాడు. ఆయనతో పాటు కా. రణదేవ్, కా. కిషోర్, కా. చైతె, కా. పాయికె, కా. లలిత అమరులైనారు. ఈ కామ్రేడ్స్ అందరికీ వినమ్రంగా జోహార్లు అర్పిస్తూ, వాళ్ల ఆశయాలను నెరవేర్చేందుకు తుదకంటా మొక్కవోని విశ్వాసంతో పోరాడడమే, వాళ్లకు మనమిచ్చే నిజమైన నవాళి.

## కామ్రేడ్ ఉండం మోటు (రూపేష్) కు జోహార్లు

కామ్రేడ్ ఉండం మోటుది బీజాపూర్ జిల్లా, గంగులూరు, పశ్చిమ బస్తర్ డివిజన్, వెంగుర్ గ్రామంలో పేద రైతుకుటుంబంలో 26 సం॥ క్రితం జన్మించాడు. తండ్రి చనిపోయాడు. తల్లి ఉంది. కామ్రేడ్ మోటు ఇంటిదగ్గర 3వ తరగతి వరకు చదువుకున్నాడు. చిన్న వయస్సు నుండి తండ్రితో పాటు వ్యవసాయ పనులలో పాల్గొనేవాడు. వీరిది విప్లవ కుటుంబం. పార్టీ మాట, పాట వింటూ ఉండేవాడు. గ్రామంలో ఉన్న యువతీ–యువకులతో కలిసి దళంకి కావలసిన తిండి సరుకులను జమచేసి తెచ్చి, వారితో పాటు ఉండేవాడు. సల్వాజుడుం సమయంలో ప్రజల ఎదుర్కొన్న కష్టాలను, బాధలను ప్రత్యక్షంగా చూసిన కా. మోటు ప్రజల కష్టాలకు, దోపిడీకి కారణమైన ఈ సమాజాన్ని మార్చాలనే ఆలోచనతో 2007 సం॥ డిసెంబర్‌లో పార్టీలో భర్తీ అయ్యాడు. గంగులూరు దళంలో కొంతకాలం పనిచేసాడు. తరువాత పార్టీ అవసరాల రీత్యా రీజనల్ కంపెనీ–2 కి బదిలీ చేయడం జరిగింది. పార్టీ 2018లో కా. మోటు క్రమశిక్షణను, పట్టుదలతో పనిచేయడం చూసి పీపీసీలోకి తీసుకోవడం జరిగింది.



కా. మోటు తెమెలవాడ ఆంబుష్‌లో, 2009లో ఒడిశా, గోంద పల్లి డ్యాం పేల్చి, ఒక టేకెదారుని చంపిన ఘటనలో, ఇదే సంవత్సరంలో నాల్కొ దమన్ జోడీ ఘటనలో, 2010లో ముకరం, 2011లో గుంసర ఆంబుష్‌లో, 2013లో తెలంగాణ బార్డర్ కుర్నపల్లి ఆంబుష్‌లో, 2013 మే 25న దర్భ డివిజన్‌లో మహేంద్రకర్మని చంపిన ఘటనలో పాల్గొన్నాడు. అనేక సైనిక చర్యల్లో పాల్గొని కా. మోటు ఎంతో ధైర్యంగా శత్రువుతో పోరాడుతూ వారిని ఖతం చేసి, తుపాకులను తీసుకుని వచ్చాడు. 2020లో పార్టీ అవసరాల రీత్యా వెళ్లిన కా. మోటు ఒడిశాలో జరిగిన శత్రువు దాడిలో తన చివరి శ్వాస వరకు పోరాడుతూ అమరుడయ్యాడు. కా. మోటులో ఉన్న క్రమశిక్షణ, పట్టుదల, ధైర్యసాహసాలు విప్లవోద్యమం పట్ల ఆయనకున్న నిబద్ధత మనందరికి ఆదర్శం.

కామ్రేడ్ మోటు ఆశయాలను కొనసాగిద్దాం!

# కామ్రేడ్ కంపె దేవేందర్‌కు విప్లవ జోహార్లు

తెలంగాణ రాష్ట్రం జయశంకర్ భూపాలపల్లి (ఉమ్మడి వరంగల్) జిల్లా, భూపాలపల్లి మండలంలోని నాగారం గ్రామంలో మధ్య తరగతి కుర్మ గొల్ల (యాదవ) కుటుంబంలో కామ్రేడ్ కంపె దేవేందర్ జన్మించాడు.




తల్లిదండ్రులకు నలుగురి సంతానంలో కా. దేవేందర్ అందరికంటే చిన్నవాడు. ఇద్దరు అక్కలు, ఒక అన్న ఉన్నారు. చిన్నవాడయిన దేవేందర్‌ను అందరు ఎంతో ప్రేమగా చూసుకొనేవారు.

నాగారం గ్రామంలో 7వ తరగతి వరకు చదువుకున్నాడు. నాగారం గ్రామం మహాదేవ్‌పూర్ ఏరియాలో మన పార్టీకి బలమైనది. అక్కడ మన పార్టీతో పాటూ ఇతర ఎంఎల్ పార్టీల ప్రభావం కూడ ఎక్కువగానే ఉండేది. అలాంటి సమయంలోనే కా. దేవేందర్ మన పార్టీకి పరిచయం అయ్యాడు.

ముందుగా ఆర్‌వైఎల్‌లో పని చేశాడు. తర్వాత క్యాంపెయిన్ బ్యాచ్‌లో ఉంటూనే ఏఆర్‌డీ (ఏరియా రక్షణ దళం)లో పని చేశాడు. ఏఆర్‌డీలో ఉంటూ పార్టీ పిలుపును అందుకొని నిరసన, విధ్వంస కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవాడు.

కా. దేవేందర్‌కు 2004లో పెళ్లి జరిగింది. తరువాత పార్టీ సానుభూతి పరునిగా ఉంటూ 2006 వరకు పనిచేశాడు. 2006 నుండి 2018 వరకు పార్టీ అతన్ని కాంటాక్ట్ చేయలేదు. (పరిచయం ఉన్న కామ్రేడ్స్ లేని కారణంగా) 2018లో మళ్లీ కాంటాక్ట్ లోకి వచ్చాడు.

అప్పటికి కా. దేవేందర్‌కు ఇద్దరు పిల్లలు. ఒక కొడుకు, కూతురు ఉన్నారు. ఈ 4 సంరాల కాలంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ అతనికి అప్పగించిన పనులను చేస్తూ వచ్చాడు. మే 11, 2021న కా. దేవేందర్ కరోనా మహమ్మారితో తుది శ్వాస విడిచాడు. కష్టకాలంలో పార్టీకి నమ్మకమైన సానుభూతిపరుడుగా తన కృషిని కొనసాగించాడు. ఆ కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర కమిటీ సంతాపం తెలియచేస్తుంది.

కా. కంపె దేవేందర్ అమర్ రహె! **(మిగతాది 15వ పేజీలో...)**

---

**(....50వ పేజీ తరువాయి)**

అంబర్ దాదాతో పాటూ కేంద్రకమిటీ సభ్యులైన వారనాసీ సుబ్రమన్యం, విజయ్‌కుమార్ ఆర్యలను అరెస్టు చేశారు. పశ్చిమ్ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, బీహార్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గడ్‌లలో అనేక తప్పుడు కేసులను అంబర్‌దా మీద పెట్టారు. ఛత్తీస్‌గడ్‌లోనే 10 కేసులను పెట్టారు. వివిధ రాష్ట్రాలలోని అనేక జైళ్లల్లో ఉంచారు. 2015లో విడుదలయి కలకత్తా నగరంలో వుంటూ తన కార్యకలాపాలను కొనసాగించాడు. రాజకీయ ఖైదీల విడుదల కొరకు జరిగే ఆందోళనలోను, పౌరహక్కుల ఉద్యమ నిర్మాణానికి కృషి చేశాడు. మహత్తర నక్సల్బరీ 50వ వార్షికోత్సవాల సందర్భంగా అనేక సభలలో పాల్గొని సీపీఐ(మావోయిస్టు)పార్టీ రాజకీయ, మిలటరీ లైన్‌లను ప్రచారం చేశాడు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ప్రతీఘాతుక 'సమాధాన్' పథకానికి వ్యతిరేకంగా ప్రచారం చేసేందుకు, మేధావులను, ప్రజాస్వామిక వాదులను, ప్రగతిశీల శక్తులను ఒక వేదిక మీదకు తెచ్చేందుకు కృషి చేశాడు. ఎల్గార్ పరిషధ్ భీమా కోరేగాం 200 వార్షికోత్సవ సందర్భంగా సభను నిర్వహించింది. ఆ సభమీద బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టులు దాడులు చేసి తిరిగి బాధితుల మీదనే కేసులు పెట్టారు. ఇందులో మేధావులను, రచయితలను, కళాకారులను, జర్నలిస్టులను, సామాజిక కార్యకర్తలను, ప్రొఫెసర్లను, లాయర్ల మీద 'ఉపా' కేసులు పెట్టి జైళ్లలో పెట్టారు. వీరందరి విడుదల కోసం కామ్రేడ్ అంబర్ దా దేశంలోని ప్రగతిశీల, ప్రజాస్వామిక శక్తులతో ఐక్యవేదిక నిర్మించి వీరి విడుదల కోసం కృషి చేశాడు.

విప్లవోద్యమాన్ని దేశ వ్యాప్తంగా సంఘటితపరచడానికి కేంద్రకమిటీ సభ్యునిగా తన వంతు పాత్రను పోషించాడు. కమిటీ సమావేశాలలో పాలసీలను రూపొందించే విషయంలో ముఖ్య భూమిక పోషించాడు. భారత విప్లవోద్యమంలో ఆయన పాత్ర మరువరానిది. అంబర్‌దా అమరత్వం సీపీఐ(మావోయిస్టు)పార్టీకి, విప్లవోద్యమానికి తీవ్రమైన నష్టం. అయినప్పటికి పార్టీ నాయకత్వంలో వర్గ పోరాటం, ప్రజాయుద్ధం తీవ్రతరం అయి దాని నుండి అనేక కార్యకర్తలు, నాయకులు పుట్టుకొస్తారు. ఆయన వదిలి వెళ్లిన ఆశయాలను పూర్తి చేస్తారు. దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి, సోషలిజం కమ్యూనిజాన్ని తెచ్చేందుకు సాయశక్తుల కృషి చేస్తాం.

విప్లవోద్యమంలో అంబర్ దాదాను సాహెబ్ దాదా పేరుతో పిలిచేవారు. ఆయన అనారోగ్య పీడితుడైనప్పటకీ ప్రజా సేవను విడువలేదు. నిస్వార్థ బుద్ధితో ఆయన ప్రజలకు సేవ చేశాడు. వివాహం విప్లవానికి ఆటంకం అని భావించి ఆయన వివాహం చేసుకోలేదు. చనిపోయిన తరువాత తన శరీరాన్ని వైద్య కళాశాలకు అప్పగించమని తన కోరికను వెల్లడించాడు. చివరి వరకు మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంతాన్ని, పార్టీ పంథాను, దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని, తూచ తప్పకుండా అమలు జరిపాడు. కేంద్రకమిటీ ఆయనకు ఇచ్చిన సైద్ధాంతిక రాజకీయ, ప్రచార బాధ్యతను చక్కగా నిర్వహించాడు. విప్లవోద్యమంలో ఆయన నెలకొల్పిన ఆదర్శాలను, త్యాగ సాంప్రదాయలతో ప్రేరితులై ఆయన నడిచిన మార్గంలోకి రావాలని దేశంలోని యువతి, యువకులందరిని కోరుతున్నాం. ☆

## భారత విప్లవోద్యమానికి నిస్వార్థంగా వీర పుత్రున్ని అందించిన తల్లిదండ్రులకు విప్లవ వందనాలు



ప్రజల కోసం పోరాడుతున్న తమ కొడుకుని చివరిసారిగా అయినా కనూలారా చూసుకొని, గుండెలకు అత్తుకోవాలని ఎదురు చూసి కనుమూసిన తల్లి (వరలక్ష్మి గారికి)కి వినమ్రంగా నివాళి అర్పిద్దాం.

పుల్లూరి వరలక్ష్మి 85 సం॥రాల వయస్సులో అనారోగ్యంతో పెద్దపల్లి జిల్లా, ఎన్టీపీసీ రామగుండంలో తుదిశ్వాస విడిచారు. ఎంతో మంది తల్లిదండ్రులు తమ పిల్లలను విప్లవోద్యమానికి ఏ స్వార్థం లేకుండా పంపించిన వాళ్లల్లో పుల్లూరి వరలక్ష్మిగారు ఒకరు. తమ జీవితంలో ఎన్నో కష్టాలను, బాధలులను అనుభవిస్తూ తన కొడుకును ఎంతో అల్లారు ముద్దుగా పెంచి, విద్యాబుద్ధులు నేర్పి, మంచి వ్యక్తిత్వాన్ని తనలో పెంపొందింపచేసిన తల్లి వరలక్ష్మిగారు. తమ స్వార్థం కోసం కాక మొత్తం సమాజంలో పీడిత ప్రజల కోసం ఆలోచించే చైతన్యాన్ని ప్రదర్శించే విధంగా తన కొడుకును తీర్చిదిద్ది విప్లవోద్యమానికి అందించిన మాతృ మూర్తి వరలక్ష్మిగారు.

నిత్య నిర్బంధంలో శత్రువుతో ప్రజలకోసం పోరాడుతున్న తన కన్న కొడుకుకోసం ఎదురుచూస్తూ చివరిసారిగా చూడకుండానే కనుమూసిన మాతృమూర్తి విప్లవోద్యమానికి పోరుబిడ్డని అందించిన వరలక్ష్మిగారికి వినమ్రంగా నివాళ్లులు అర్పిద్దాం!

## పెరూ కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు కామ్రేడ్ అభిమన్ గుజమన్ (గొంజాలో)ను, లిమా జైలు నుంచి విడిపించేందుకూ, మెరుగైన వైద్యం కోసం, డిమాండ్ చేస్తూ, ప్రపంచ వ్యాపితంగా క్యాంపెయిన్ చేపడదాం!

**ప్రియమైన ప్రజలారా!**

కామ్రేడ్ అభిమన్ గుజమన్ (గొంజాలో) తక్షణ విడుదల కోసం ఉద్యమించాల్సిందిగా, ప్రపంచవ్యాపిత పీడిత ప్రజానీకానికీ, పీడిత జాతులకూ, శ్రామిక వర్గానికీ, ట్రేడ్ యూనియన్లకూ, మావోయిస్టు పార్టీలకూ, పురోగామి, ప్రజాస్వామిక శక్తులకూ, పౌరహక్కుల సంఘాలకు సీ.పీ.ఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ విగ్నప్తి చేస్తున్నది. కామ్రేడ్ గొంజాలో పెరూ విప్లవనేతగా సుప్రసిద్ధుడు. మావో సిద్ధాంతం వెలుగులో ప్రజల రాజ్యాధికారం కోసం, పెరూలో ప్రజాయుద్ధాన్ని వేగంగా వ్యాప్తి చేసాడు. మావోయిస్టు సిద్ధాంతాన్ని పెరూ దేశ పరిస్థితులకు అన్వయిస్తూ, సిద్ధాంత, తాత్విక, సైనిక, రాజకీయ రంగాలలో అభివృద్ధి సాధించాడు. ఈ కాలంలోనే గొంజాలో నాయకత్వంలోని పెరూ కమ్యూనిస్టు పార్టీ మార్క్సిజానికీ, లెనినిజానికి కామ్రేడ్ మావో చేసిన దోహదాలను దృష్టిలో ఉంచుకొని, మావో ఆలోచనా అని కాకుండా, మావోయిజం అని పిలవాలని మరి కొన్ని విప్లవ పార్టీలతో కలిసి ప్రచారం చేసింది. ఆ తదుపరి ప్రపంచంలోని అనేక దేశాల విప్లవ పార్టీలు మావో ఆలోచనా అని కాకుండా, మావోయిజం అని పిలవనారంభించారు.

కామ్రేడ్ గొంజాలో నాయకత్వంలోని పెరూ కమ్యూనిస్టు పార్టీ, రాజ్యాధికారం కేంద్రంగా అన్ని కార్యకలాపాలను నిర్వహిస్తూ, ప్రజాయుద్ధాన్ని గెంతుల రూపంలో అభివృద్ధి చేసింది. దేశంలో విప్లవోద్యమం బలంగా కొనసాగుతున్న ప్రాంతాలలో విముక్తి ప్రాంతాలను నిర్మించింది. పెరూలోని గ్రామీణ ప్రాంతాల్లో, ఒకవైపున ప్రజాఉద్యమాన్ని పురోగమింపజేస్తూనే, మరోవైపు పెరూ రాజధాని లిమాలో కూడా వాడలు, బస్తీల్లో బలమైన విప్లవోద్యమాన్ని నిర్మించింది. ఈ క్రమంలో దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికి అనుకూలమైన పరిస్థితులు పరిపక్వమవుతుండటంతో బెంబేలెత్తిన అమెరికన్ సామ్రాజ్యవాదులు, వారి తైనాతీలైన దేశ దోపిడీ పాలకవర్గాలు విప్లవోద్యమంపై ఉక్కుపాదం మోపారు. కామ్రేడ్ గొంజాలోను పట్టుకోవడానికి అమెరికా సిక్రెట్ గూఢాచారి సంస్థ సహాయంతో పెరూ ఫాసిస్టు ప్రభుత్వం కొన్ని సంవత్సరాల పరిశోధనతో, 29 సంవత్సరాల క్రితం ఆయనను లిమా పట్టణంలో అరెస్టు చేసారు. ఈ 29 సంవత్సరాలుగా ఆయనను లిమా నగరంలోని పటిష్టమైన (హై సెక్యూరిటీ) జైల్లో, సిక్రెట్ సెల్‌లో బంధించి, శారీరక చిత్రహింసలకు గురిచేస్తూ వచ్చింది. కనీస వైద్య సదుపాయాలనూ, ఇతర సౌకర్యాలను నిరాకరించింది. ఈ క్రమంలో గొంజాలో అక్రమ నిర్బంధాన్ని నిరసిస్తూ, ప్రజల ఒత్తిడి పెరగడంతో పెరూ ఫాసిస్టు ప్రభుత్వం, ఆయనను, ఒకే ఒక్కసారి కోర్టులో కొద్దిసేపటికోసం ప్రవేశపెట్టింది. కామ్రేడ్ గొంజాలో ఆ ఒక్కసారే ప్రజలకు కనిపించారు.

అమెరికా సామ్రాజ్యవాదుల తైనాతీలుగా వ్యవహరిస్తున్న పెరూ పాలకవర్గాలు, కామ్రేడ్ గొంజాలో విషయంలో  అనుసరిస్తున్న అప్రజాస్వామిక నిరంకుశ విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆయనకు మెరుగైన వైద్య సదుపాయంతోపాటు, ఇతర సౌకర్యాలను కల్పించాల్సింగా మేము డిమాండ్ చేస్తున్నాం. అలాగే కామ్రేడ్ గొంజాలో విడుదల కోసం పెరూలోని నూతన 'వామపక్ష' ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాల్సిందిగా ప్రపంచ కార్మికవర్గానికీ, శాంతికాముకులైన ప్రజలకు విగ్నప్తి చేస్తున్నాం.

# మనలోని రోగ నిరోధక వ్యవస్థ

ఏదేని పత్రికను తిరగేస్తుండగా పొరపాటున మధ్య పేజీలో పిన్ను మీ వేలుకు గీసుకుని గాయమవుతుంది. చివ్వుమన్న నొప్పికి మీరు చటుక్కున వేలును నోట్లో పెట్టుకుంటారు.

పిన్ను గుచ్చుకున్న వెంటనే మీ శరీరంలో ఏఏ మార్పులు జరుగుతాయో తెలుసా?

పిన్ను గుచ్చుకున్న సమయాన అనేకానేక సూక్ష్మక్రిములు మీ శరీరంలోకి ప్రవేశించటానికి ప్రయత్నిస్తాయి. ఆ వెంటనే మీ శరీరంలోని రోగనిరోధక యంత్రాంగం అలెర్ట్ అయి ఆ బాక్టీరియాని నశింపజేసే ప్రయత్నంలోనూ, గాయాన్ని మానుపరిచే ప్రయత్నంలోనూ తల మునకలవుతుంది. ఆ పోరాటంలో రోగక్రిములు నశించవచ్చు, లేక ఒకోసారి మీ శరీర కణజాలమూ నశించవచ్చు.

గుండె, ఊపిరితిత్తులులాగే రోగనిరోధక వ్యవస్థను కూడా మన శరీరంలోని ఒకానొక అవయవంగా చెప్పుకోవచ్చు. ఈ అవయవం మన శరీరమంతటా వ్యాపించి ఉంటుంది. బాహ్యాన్నుంచి మన శరీరం మీద దాడిచేసే మిలియన్ల కొద్దీ రసాయనాలు, సూక్ష్మక్రిముల నుంచి అది జీవితం పొడుగూతా మన శరీరాన్ని కాపాడుతుంటుంది.

మనలోని రోగనిరోధక వ్యవస్థకు మన శరీరానికి సంబంధించిన కణాలేవో శరీరానికి సంబంధించని కణాలేవో స్పష్టంగా తెలిసి వుంటుంది. శరీరానికి సంబంధించని కణజాలం (బాక్టీరియా లాంటిది) ఏదన్నా లోపలికి ప్రవేశించినప్పుడు రోగనిరోధక వ్యవస్థ వెంటనే రియాక్ట్ అయి వాటి మీద దాడి సల్పుతుంది. శరీరం లోపల యాంటీబాడీస్‌ని (Antibodies) సృష్టించుకుని బాక్టీరియాతో పోరాడించవచ్చు. లేదా బాక్టీరియాతో నేరుగా పోరాడే కణజాలాన్ని ప్రేరేపించి రోగక్రిములను నశింపచేయటానికి ప్రయత్నించవచ్చు.

మన శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ ఈ క్రింది అవయవాల ద్వారా పనిచేస్తుంది.

1. థైమస్ గ్రంథి (Thymus gland)
2. ఎముకలోని మూలుగ (Bone marrow)
3. లింఫ్ గ్రంథులు (Lymph nodes)
4. లింఫ్ నాళాలు (Lymphatic vessels)
5. ప్లీహము (Spleen)

ఇప్పుడు వీటిలో ఒకోదాని గురించీ విడివిడిగా చూద్దాము :

### 1. థైమస్ గ్రంథి (Thymus gland)

ఛాతి ఎముకకు వెనుక వైపున వుండే ఈ గ్రంథి ఉత్పత్తి చేసే తెల్లరక్త కణాలు T-Lymphacytes గా పరిణతి చెంది శరీరం లోపలికి ప్రవేశించిన వైరస్‌లతో పోరాడతాయి.

- T-Cells గాపిలవబడే ఈ కణాలకు మరికొన్ని కణాలు తోడై అన్నీ కలిసి వైరస్ మీద జమిలిగా పోరాటానికి దిగుతాయి.

- T-Cells తో జత కూడే మిగతా కణాలు?

**I. సహాయ టి-సెల్స్ (Helper T-Cells or co-operator cells)**

ఈ కణాలు B-Lymphacyte అనబడే మరో రకపు కణాలలో యాంటీబాడీస్ వృద్ధి కావటానికి దోహదం చేస్తాయి. (ఎయిడ్స్ వ్యాధిలో ఎయిడ్స్ వైరస్ ఈ హెల్పర్ టీ-సెల్స్‌నే నాశనం చేసి మనిషిని నిర్వీర్యం చేస్తాయి.)

**II. కిల్లర్ టీ-సెల్స్** (Killer T-cells or Cytoxic cells))

మన శరీరానికి సంబంధించని బయటి కణజాలం లోపలికి ప్రవేశించినప్పుడు ఇవి త్వరితంగా వృద్ధి చెంది వాటిని నాశనం చేయటానికి ప్రయత్నిస్తాయి. Rumourలు, ఇన్‌ఫెక్షన్‌లను నాశనం చేసేది ఈ కిల్లర్ టీ సెల్స్‌యే.




**III. సప్రెసర్ టీ-సెల్స్ (Supressor T-cells)**

- మన శరీరంలోకి ప్రవేశించిన శత్రువు (ఇన్‌ఫెక్షన్) ఓడిపోగానే ఇంక యుద్ధాన్ని ఆపమంటూ ఈ కణాలు యుద్ధ విరమణ సూచనను ఆదేశిస్తాయి.

- సప్రెసర్ టీ-సెల్స్ కనుక బలహీనపడ్డా లేక పనిచేయకపోయినా రోగనిరోధక వ్యవస్థకు చెందిన మిగతా కణాలు పోరాటాన్ని ఆపవు. అలాంటి సందర్భంలో ఇన్‌ఫెక్షన్ అనబడే శత్రువు లేకపోతే అవి మన శరీర కణజాలం మీదే పోరును కొనసాగించి Rheumatiod arthritis లాంటి కీళ్ళ వ్యాధులకు దారి తీస్తాయి.

### 2. ఎముకలోని మూలుగ (Bone marrow)

మన ఎముకల లోపల వుండే మూలుగ (Bone marrow) అనే పదార్థం తెల్ల రక్త కణాలను ఉత్పత్తి చేస్తుంది. ఈ తెల్లరక్త కణాలు శరీరం లోపలికి ప్రవేశించిన సూక్ష్మక్రిములతో పోరాడతాయి.

### 3. లింఫ్ గ్రంథులు (Lymph nodes)

లింఫ్ గ్రంథులు బి-లింఫోసెట్స్ (B-Lymphocytes) అనబడే ఒక రకమైన తెల్లరక్త కణాలను తయారు చేస్తాయి. ఈ ..... పై భాగాన ఇమ్యూనోగ్లోబులిన్ (Immunoglobulin) అనే ఒక ప్రోటీన్ పదార్థం వుంటుంది. ఈ B-cells ఇన్‌ఫెక్షన్‌తో పోరాడే యాంటీ బాడీస్‌ని ఉత్పత్తి చేస్తాయి.

### 4. లింఫ్ నాళాలు (Lymphatic vessels)

ఈ నాళాలు మన శరీరంలో ఇన్‌ఫెక్ట్ అయిన భాగాన్నుంచి సూక్ష్మక్రిములను లింఫ్ గ్రంథుల వద్దకు తీసుకువెళ్తాయి. అక్కడ లింఫ్ గ్రంథులు తయారు చేసే యాంటీబాడీస్ ఆ సూక్ష్మక్రిముల మీద దాడిచేసి వాటిని నాశనం చేస్తాయి.

### 5. ప్లీహము (Spleen)

రక్త ప్రవాహం ద్వారా వచ్చిన సూక్ష్మక్రిములు ఇక్కడ తెల్లరక్త కణాలతో ముంచెత్తబడి నాశనం చేయబడతాయి.

### రక్త నాళాలు

– రక్త నాళాల ద్వారా తెల్ల రక్తకణాలు, యాంటీబాడీస్, శరీరమంతా ప్రయాణిస్తూ శరీరానికి అపకారం కలిగించే బాక్టీరియా నుంచి శరీరాన్ని కాపాడుతూ మన ఆరోగ్యానికి పహారా కాస్తుంటాయి.

– రోగనిరోధక వ్యవస్థ (Immune system)లో రెండు రకాలుంటాయి.

1. Innate immunity
2. Adaptive immunity

– Innate immunity లో చర్మం కొంత ప్రాముఖ్యత వహిస్తుంది. నోరు, గొంతు, కళ్లు, ప్రేవులు, యోని, మూత్రనాళాలలో తయారయ్యే ఎంజైములనబడే పదార్థాలు ప్రాముఖ్యత వహిస్తాయి.

– ఇవన్నీ మన శరీరంలోకి ప్రవేశించే సూక్ష్మ క్రిములను నాశనం చేస్తుంటాయి. పసిపిల్లలు తల్లి గర్భంలో వుండగా తల్లి శరీరం నుంచి లభించే యాంటీబాడీస్ ద్వారా రక్షణను పొందితే ఆ తర్వాత తల్లి అందించే స్తన్యం ద్వారా రక్షణను పొందుతారు.

– మనిషి పెరిగి పెద్దవుతూ వివిధ రకాల సూక్ష్మక్రిముల దాడికి గురవుతున్న కొద్దీ అతని శరీరం తనకు తాను రోగనిరోధక చర్యలను సంతరించుకుంటుంది. దీనిని Adaptive immunity అంటారు. దీని మూలంగా శరీరంలోకి ప్రవేశించే సూక్ష్మక్రిములను శరీరంలో తయారయ్యే యాంటీబాడీస్ నశింపచేయ గలుగుతాయి.

– Adaptive immunity మూలంగా ఒకసారి శరీరంలోకి ప్రవేశించిన సూక్ష్మక్రిములను తెల్ల రక్తకణాలు గుర్తుంచుకుని మళ్ళీ అట్లాంటి క్రిములు లోపలికి ప్రవేశించినప్పుడు పూర్వ తరహా యాంటీబాడీస్‌ని తిరిగి సృష్టించుకుని విజయాన్ని సాధిస్తాయి.

– ఈ సిద్ధాంతం ఆధారంగానే కృత్రిమంగా టీకాలను తయారు చేసుకుని, వాటితో రోగనిరోధక వ్యవస్థను పటిష్టపరుచుకుని పోలియోలాంటి కొన్ని వ్యాధులను దరికి రాకుండా చేసుకోగలుగుతున్నాము.

### ఇన్‌ఫెక్షన్‌ని నిరోధించే మిగతా చర్యలు

**లాలాజలం :** నోటి లోపలికి ప్రవేశించే సూక్ష్మక్రిములను లాలాజలంలో వుండే ఎంజైములు నాశనం చేస్తాయి.

**కన్నీరు :** కంటి లోపలికి ప్రవేశించే సూక్ష్మక్రిములను కన్నీటి ద్వారా బయటికి పంపేయటం జరుగుతుంది. ఇంకా ఏమన్నా సూక్ష్మక్రిములు కంట్లో మిగిలి ఉంటే కన్నీరు తాలూకు ఎంజైములు వాటిని నశింపచేస్తాయి.

**ముక్కు :** దుమ్ము, ధూళి ద్వారా ముక్కు లోపలికి ప్రవేశించే సూక్ష్మక్రిములను ముక్కు లోపల వుండు కేశనాళికలు బంధించి చీమిడి ద్వారా బయటికి నెట్టేస్తాయి. లేదా తుమ్ముల ద్వారా, శ్వాసనాళం ద్వారా ఇంకా ఏమన్నా లోపలికి వెళ్ళితే దగ్గటం ద్వారా మనం వాటిని బయటికి నెట్టేస్తాము.

**ప్రేగులు :** కడుపులో తయారయే యాసిడ్ అక్కడికి చేరుకున్న సూక్ష్మక్రిములను నశింపజేస్తుంది. ప్రేగులలోకి ప్రవేశించిన సూక్ష్మక్రిములను ప్రేగులలో నిలవ వుండే 'ఉపకార బాక్టీరియా' నశింపచేస్తాయి.

**మూత్ర నాళాలు :** మూత్ర నాళాలలోని 'ఉపకార బాక్టీరియా' అక్కడికి ప్రవేశించే సూక్ష్మక్రిములను నశింపచేస్తాయి. స్త్రీకి యోనిలో వుండే Mucus lining కూడా అక్కడికి ప్రవేశించే సూక్ష్మక్రిములను నాశనం చేయటానికి ప్రయత్నిస్తుంది.

**చర్మం :** చర్మ గ్రంథులు, స్వేద గ్రంథులలో ఉత్పత్తి అయ్యే నూనె, స్వేదం, చర్మం ద్వారా లోపలికి ప్రవేశింప జూసే సూక్ష్మక్రిములను నశింపచేయటానికి ప్రయత్నిస్తాయి.

– ఈ రకంగా మన శరీరంలో ప్రతి భాగమూ బయటి నుంచి దాడిచేసే సూక్ష్మక్రిములను నశింపచేయటంలో తన వంతు పాత్రను నిర్వహిస్తూ మన రోగనిరోధక వ్యవస్థను పటిష్టపరుస్తుంటుంది.

### రోగనిరోధక వ్యవస్థ పటిష్టతకు సూత్రాలు

మన శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థను పటిష్టపరుచుకోవటానికి ఈ క్రింది సూత్రాలు పాటించాలి :

– విటమిన్‌లు, ఖనిజ లవణాలు సమృద్ధిగా లభించే సమతుల్యమైన పోషకాహారాన్ని తీసుకోవాలి.

– రెగ్యులర్‌గా ఎక్సర్‌సైజుల్ని చేయాలి. అయితే అతిగా మాత్రం కాదు.

– మానసికంగా, శారీరకంగా కృంగదీసే వొత్తిడులకు దూరంగా వుండాలి.

– పొగతాగటం, మద్యాన్ని తాగటాన్ని మానుకోవాలి. ☆

# వివిధ పోరాటాలలో కదిలిన ప్రజలు

### ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

కాసీపేట మండలంలో ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దీర్ఘకాలికంగా వున్న సమస్యల పరిష్కారానికి తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. 70 సంవత్సరాల నుండి ఆదివాసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. చట్టబద్ధతలేని లంబాడాలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. సాగు చేస్తున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, నూతన ఎల్‌ఆర్‌ఎస్ 2020 చట్టాన్ని షెడ్యూల్డ్ ప్రాంతం నుంచి ఉపసంహరించాలనే డిమాండ్‌లతో ధర్నా నిర్వహించారు.

### ప్రైవేట్ ఆస్పత్రుల బంద్ – మిక్సోపతి ఆర్డినెన్స్ రద్దు చేయాలని ర్యాలీ

కేంద్రం విడుదల చేసిన మిక్సోపతి ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. మిక్సోపతి ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా మంచిర్యాలలో ప్రైవేట్ ఆస్పత్రులు మూసివేశారు. బెల్లంపల్లి చౌరస్తా నుంచి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం మిక్సోపతి విధానాన్ని తీసుకురావడం వైద్యరంగంలో ఇబ్బందికరమని, ఎంబీబీఎస్ నాలుగున్నర సంవత్సరాలు, హౌస్ సర్జన్ ఒక సంవత్సరం అనుభవం కలిగిన వైద్యులు మాత్రమే సర్జరీలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ ద్వారా కేవలం ఆరు నెలల శిక్షణతో ఆయుర్వేద వైద్యులు శస్త్రచికిత్స చేస్తే ప్రజలకు ఇబ్బందులు తప్పవన్నారు. ఆయుర్వేద వైద్యులకు అల్లోపతి వైద్యంపై ఏమాత్రం అవగాహన ఉండదని, శస్త్రచికిత్సల సమయంలో వాడే మందులు వికటించే ప్రమాదం పొంచివుండే అవకాశం వుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.


ఎఫ్‌బీవో సోడి రాజేశ్‌ను చెట్టుకు బంధించిన గిరిజనులు

### హక్కుల కోసం ఆదివాసీల ఆందోళన

హక్కుల కోసం ఆదివాసీలు ఆందోళన బాట పట్టారు. ఆదివాసీ సంఘాలు తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఒక్క రోజు రాష్ట్ర బంద్‌కు ఆదిలాబాద్, ఉట్నూర్ బస్ డిపోల ముందు ఆదివాసీలు బైఠాయించి, ఆర్టీసీ బస్సులను బయటకు రాకుండా అడ్డుకున్నారు. బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. బంద్ పాటించడంతో ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోనే ఆర్టీసీకి కోటి రూపాయల వరకు నష్టం వచ్చిందని అధికారులు అన్నారు. జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో బైక్ ర్యాలీలు, ధర్నాలు చేశారు. ఎస్టీ జాబితా నుండి లంబాడాలను తొలగించాలని డిమాండ్ చేశారు. లంబాడాల కుల, ఏజెన్సీ ధ్రువ పత్రాలను రద్దు చేసి, ఆదివాసీలు సాగు చేస్తున్న అటవీ భూములకు హక్కు పత్రాలు కల్పించాలని, జీఓ నెం 3ని యధావిధిగా కొనసాగించాలని, నాన్ ఏజెన్సీ గ్రామాలను, ఏజెన్సీ గ్రామాలుగా గుర్తించి, ఏజెన్సీ ప్రాంతంలో ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

### వ్యవసాయ చట్టాలు రద్దు చెయ్యాలంటూ రాస్తారోకో

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త వ్యవసాయ చట్టాలను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ రైతుసంఘం డిమాండ్ చేసింది. రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేసే వరకు ఉద్యమిస్తామన్నారు. ఢిల్లీలో రైతుల ఆందోళనకు మద్దతుగా వివిధ జాతీయ రహదారులపై, టోల్‌ప్లాజ్‌ల వద్ద రైతు సంఘాలు రాస్తారోకోలు నిర్వహించాయి. రక్తం గడ్డకట్టే చలిలో రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కొత్త వ్యవసాయ చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

### సింగరేణి గనుల వద్ద నిరసనలు

మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సింగరేణి గనులు, విభాగాల వద్ద కార్మికులు ధర్నాలు, నల్ల బ్యాడ్జీలతో నిరసనలు చేపట్టారు. రైతుల పోరాటానికి కార్మికులు కూడా మద్దతు తెల్పుతూ పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపట్టారు.

### కారుణ్య మరణాలే శరణ్యం ప్రగతి భవన్ ముట్టడి

గురుకుల పీఈటీ టీచర్ల పోస్టులను భర్తీ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తూ ప్రగతి భవన్‌ను ముట్టడించారు. దీంతో పోలీసులు సీఎం క్యాంపు కార్యాలయం వద్ద భారీ భద్రతా బలగాలను మోహరించాయి. ఈ క్రమంలో ప్రజలు మూడు విడతలుగా క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకోవడంతో పరిస్థితులు ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారి మహిళలు ఆందోళనకు దిగారు. పోలీసులు వీరిని అదుపులోకి తీసుకునేలోగా

వందలాది జనం ప్రగతి భవన్ పరిసరాల్లో ప్లెకార్డులతో నినాదాలు చేశారు. ఆందోళనలో పాల్గొన్న ప్రజలు, పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. మహిళలు రోడ్డుపైనే బైఠాయించి నిరసనలు వ్యక్తం చేశారు.

### సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం అందజేశారు. సింగరేణి కార్మికులకు లాక్‌డౌన్ సమయంలో కోత విధించిన 50 శాతం వేతనాన్ని యాజమాన్యం వెంటనే చెల్లించాలని, ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీకి వచ్చిన లాభాల వాటాలో నుంచి 35 శాతం లాభాలను కార్మికులకు పంపిణీ చేయాలన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి కార్మికుడిని వెంటనే కోవిడ్ 19లో పెట్టుకొని 100 శాతం అని ఫిక్స్ చేయాలని, కార్మికుల పిల్లల వయసు 35 నుండి 40 సంవత్సరాలకు పెంచి ఉద్యోగం అర్హత కల్పించాలన్నారు. అన్ని ఏరియాలలోని క్యాంటీన్లలో గతంలో మాదిరిగా అల్పాహారం ఏర్పాటు చేయాలన్నారు. గనిలో పనిచేసే కార్మికులకు హెచ్‌ఆర్‌ఏ చెల్లించాలని కేటికే ఓసీ కార్మికులకు రేయిన్ కోటు, నాణ్యమైన బూట్లు, యూనిఫామ్‌లు పంపిణీ చేయాలని, మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని, అపరిష్కృత సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు.



గంగారం మండలంలో పోలీసులతో ఘర్షణ

### ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలంటూ ప్రజల నిరసన

**మహబూబాబాద్:** రాష్ట్రంలో కేసీఆర్ పాలన నిజాం నిరంకుశ ఖాసీం రజ్వీ పాలన తలపిస్తోందని, పేదలపై భారం మోపే ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలంటూ కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన చేపట్టారు. నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల వారి పిల్లల కోసమో, పెండ్లిల కోసమో ప్లాట్లు కొనుక్కుంటే క్రమబద్ధీకరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పేదలను దోచుకొని, ఖజానా నింపుకోవాలని చూస్తోందన్నారు. కరోనా కరువుతో ఆర్థిక ఇబ్బందుల్లో వున్న ప్రజానీకంపై ఎల్‌ఆర్‌ఎస్ భారం మోపడం సరికాదని దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేసే వరకు టీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు.

**భూపాలపల్లి:** సామాన్యులు, పేద ప్రజల నడ్డి విరిచే ఎల్‌ఆర్‌ఎస్ వల్ల నిరుపేదలపై పెనుభారం పడుతుందని ఎల్‌ఆర్‌ఎస్ వద్దన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ఎల్‌ఆర్‌ఎస్ విధానానికి నిరసనగా ధర్నా చేశారు. రాష్ట్రంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ వల్ల మధ్యతరగతి, నిరుపేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తదని, వెంటనే ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలంటూ, లేదంటే పరిస్థితులు అస్తవ్యస్తంగా మారుతాయని హెచ్చరించారు.

### డిప్యూటీ ఫారెస్టు రేంజర్ కర్ణానాయక్ తన్ని తరిమిన ప్రజలకు విప్లవ జైజైలు

టీఆర్‌ఎస్ పార్టీ కేసీఆర్ ప్రభుత్వం రెండవ సారి అధికారంలోకి వచ్చిన తరువాత ఎవ్వరు అడ్డుఅదుపు లేరు అనే నిరంకుశత్వంతో అహంభావంతో ఏజెన్సీలో ఉన్న భూములను, ఆదివాసీల భూములను అక్రమంగా గుంజుకోవడం, హరితహారం పేరుతో మొక్కలు నాటుతున్నారు.

అందులో భాగంగానే మహబూబ్‌బాద్ జిల్లా గంగారం మండలం, మడగూడెం గ్రామంలో ప్రతి సంవత్సరంలాగానే పోడు భూమిసాగు కోసం దుక్కి దున్నుతున్న ఆదివాసీ రైతు భూమిని అడ్డుకోవడానికి వచ్చిన డిప్యూటీ ఫారెస్టు రేంజర్ కర్ణానాయక్, వాడికి రక్షణగా వచ్చిన సీఆర్‌పీఎఫ్ పోలీసులను ప్రజలు తరిమి తరిమి కొట్టారు. ముఖ్యంగా మహిళలు ముందు ఉండి చెప్పులతో, కర్రలతో చేతికి వచ్చిన దానితో పోలీసులను కూడా లెక్కచేయకుండా కొట్టారు.

హరితహారం పేరుతో రైతాంగ భూములను గుంజుకుంటే మడగూడెం లాంటి వేలాది గ్రామాలు ప్రతిఘటించి తమ భూములను రక్షించుకుంటారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అమలు చేస్తే ప్రజలు మిలిటెంట్ చర్యలు ద్వారా తమ భూములను కాపాడుకుంటారు. ప్రజలు ఐక్యంగా ఉండి పోరాడితే భూమి కాదు ఏదైనా సాధించగలుగుతారు. కేసీఆర్ ప్రభుత్వం ఫారెస్టువాళ్లను ముందు పెట్టి మన భూములను కబ్జా చేయాలని కుట్రలు పన్నుతున్నది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుదాం. పోయేది ఏమీ లేదు వచ్చేది మన భూములే.

### ప్రజల పోడు భూములను కబ్జా చేస్తున్న ఫారెస్టు అధికారులు, పోలీసులపై తిరగబడిన ప్రజలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం మామకన్ను గ్రామం మార్చి నెలలో ఫారెస్టు అధికారులు పోలీసులు కలిసి వచ్చి రైతుల భూములను కబ్జా చేసుకోవడానికి వచ్చారు. తమ పోడు భూములను మేము ఇవ్వం అని ప్రజలు అంతా కలిసి అడ్డం తిరిగారు. వెహికిల్స్ కూడా కాలబెట్టారు.

ప్రజలకు, ఫారెస్టు వాళ్లకు తీవ్ర స్థాయిలోనే గొడవ జరిగింది. కొంతమందిని అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తీసుకొని పోయారు. ప్రజలు భయపడకుండా తమ భూములను ఆక్రమించుకొని మొక్కలు నాటారు. ☆

# అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రతీ ఆదివాసీ గూడెంలో ఘనంగా జరుపండి !

# కొమురం భీం స్ఫూర్తితో స్వయం ప్రతిపత్తిని సాధించుకోండి

అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవాన్ని 1994లో ఐక్య రాజ్య సమితి ప్రకటించినప్పటి నుండి ప్రతి సంవత్సరం ఆగస్టు 9న ప్రపంచ వ్యాప్తంగా ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం జరుపుకుంటున్న విషయం మనందరికి తెలిసిందే. ఈ దినోత్సవం రోజున ప్రపంచ వ్యాప్తంగా సభలు, సమావేశాలు నిర్వహించి, ప్రజల్లో ఆదివాసీ హక్కుల గురించి అవగాహన కల్పిస్తారు. ఆదివాసులకు అండగా ఉండి, పోరాడిన వారిని స్మరించుకొంటారు.

2021 జనాభా లెక్కల ప్రకారం భారతదేశ జనాభాలో 8.6% ఆదివాసులున్నారు. వీరు శతాబ్దాలుగా అడవిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఆదివాసీ ప్రజలు విశిష్టమైన భిన్న సంస్కృతులు, విభిన్న సంప్రదాయాలు, భాషలు కలిగి ఉన్నారు. సమాజ మూల వాసులైన వీరు జల్, జంగల్, జమీన్ లపై ప్రత్యేక సంబంధాలను కలిగి, వీటిపై ఆధారపడిన ఆదివాసీల జీవన విధానం వైవిధ్య భరితంగా కొనసాగుతుంది. అందుకే ఆదివాసీ ప్రజలు స్వయం ప్రతి కోరుకుంటున్నారు. కాని దోపిడీ వర్గాలు ప్రాకృతిక వనరులను కొల్లగొట్టడానికి, ఆదివాసులను అడవి నుండి తరిమి వేస్తున్నారు. దైవంగా భావించే అడవులను, వారి సంస్కృతి, సాంప్రదాయాలను, భాషను విధ్వంసం చేసి, తమ భూభాగాల నుండి తరిమి వేసి, ఆదివాసీల అస్థిత్వాన్ని ప్రశ్నార్ధకం చేస్తున్నారు.

తెలంగాణ ఆదివాసీ చరిత్రలో రాజకీయ, ఆర్థిక స్వతంత్రతను దెబ్బతీసి, కాకతీయ సామ్రాజ్యాన్ని తిరస్కరిస్తూ సాగిన సమక్క, సారక్క నాయకత్వంలో జరిగిన పోరాటాలు మొదలుకొని 1940లో మా ఊళ్ళో మారాజ్యం అనే లక్ష్యంతో నైజాం, బ్రిటీష్ అధికారాలకు వ్యతిరేకంగా కొమురం భీం చేసిన వీరోచిత సాయుధ పోరాటం, 1981లో ఇంద్రవెల్లి పోరాటం, ఆ తరువాత ఆదివాసీలు సాగించిన పోరాటాల ఫలితంగా అనేక చట్టాలు రూపుదిద్దుకున్నాయి. ఆదివాసీ ప్రాంతాలలో ఆదివాసేతర రాజకీయ, ఆర్థిక ఆధిపత్యాన్ని నియంత్రించడానికి ప్రభుత్వాలు 1/70 చట్టం, పెసా చట్టాలను తుంగలో తొక్కి భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా వర్గం, సామ్రాజ్యవాదుల దోపిడీ అనుకూల విధానాలను అమలు చేస్తూ ఆదివాసీల స్వయం ప్రతిపత్తిపై నియంత్రణలు కోల్పోయేటట్లు చేశారు. రాజకీయ, ఆర్థిక అధికారం పాలక ప్రభుత్వాల క్రిందికి తీసుకొచ్చారు. దీనితో ఆదివాసీలు స్వయం పత్తినే కాదు కనీస హక్కులను సైతం పూర్తిగా కోల్పోయారు.

టీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారం పేరుతో ఆదివాసీల భూముల చుట్టూ కంచెలు వేసి, తమ సొంత భూముల నుండి వెళ్లగొడుతున్నారు. గోదావరి నదిపై పోలవరం డ్యాం నిర్మాణంలో 75 గ్రామాలను ముంచారు. కాలేశ్వరం తుపాకుల గూడెం నీటి ప్రాజెక్టుల మూలంగా ఆదివాసీ రైతులు కొన్ని ఎకరాల సాగు భూములను కోల్పోయారు. కొమురం భీం జిల్లాల్లో, కవ్వాల టైగర్ జోన్ ప్రాజెక్టుతో ఆదివాసీల ఇండ్లను ఖాళీ చేయించి, బలవంతంగా వెళ్లగొట్టారు. మహబూబ్‌నగర్ జిల్లాలో యూరేనియం తవ్వకాల కోసం. అభయారణ్యాల పేరుతో చెంచు ప్రజలను అడవుల నుండి గెంటివేసే ప్రయత్నాలు టీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తుంది.

పాలక పార్టీలు తమ ఎన్నికల పబ్బం గడుపుకోవడం కోసం రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ రూపొందించిన మార్గ దర్శకాలకు విరుద్ధంగా ఎస్టీ జాబితాలోకి లంబాడాలను చేర్చి ఆదివాసీలకు, లంబాడాలకు మధ్య ఘర్షణను సృష్టించారు.

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం బ్రహ్మణీయ హిందూ ఫాసిజాన్ని క్రూరంగా అమలు చేస్తూ దళితులపై, ఆదివాసీలపై దాడులకు తెగబడుతూ ఉంది.

కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలపై దళిత, గిరిజన దండోర యాత్ర నిర్వహిస్తున్నప్పటికీ దళిత, ఆదివాసీల మౌళిక సౌకర్యాల పరిష్కారానికి ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

నేడు అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవం సందర్భంగా సమక్క, సారక్క, కొమురం భీం, ఇంద్రవెల్లి వీరుల వారసత్వాన్ని కొనసాగిస్తూ ఆదివాసీలు అస్థిత్వ ఉద్యమాలు వీరోచితంగా చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిస్తుంది.

హరితహారం పేరుతో ఆదివాసీల భూములను టీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమంగా ఆక్రమించడాన్ని మానుకోవాలి.

ప్రకృతి వనరులను కొల్లగొడుతున్న సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మిలిటెంట్ ప్రజా ఉద్యమాలు చేపట్టాలి.

ఆదివాసులను నిర్వాసితం చేస్తున్న టైగర్ జోన్ ప్రాజెక్టులు, భారీ నీటి ప్రాజెక్టులు, అభయారణ్యాలు, ఓసీలు యూరేనియం తవ్వకాలను నిలిపివేయాలి.

హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టండి.

విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాది కోసం పోరాటాలు చేపట్టండి.

జల్, జంగల్, జమీన్, ఆత్మగౌరవం, అటనామస్ కోసం మిలిటెంట్ పోరాటాలు చేపట్టండి.

**విప్లవాభివందనాలతో**
**అధికార ప్రతినిధి**
**జగన్**
**తెలంగాణ రాష్ట్ర కమిటీ**

# అభయ్ 'ఫత్వా'కు నా జవాబు అంటూ జూన్ 20, 2021న జంపన్న రాసిన లేఖకు మా సమాధానం

**జూన్ 18న సీ.పీ.ఐ (మావోయిస్టు) అధికార ప్రతినిధిగా నేను "కొరోనాతో మావోయిస్టుల మరణం ఒక బూటకం, అది కేవలం పోలీసుల సృష్టి" అనే పత్రికా ప్రకటనను ఇచ్చాను. ఇందులో జంపన్నపై "విప్లవ రాజీకీయాల నుండి హీనాతిహీనంగా దిగజారిపోయిన జంపన్నకు విప్లవ రాజకీయాలపై, మా పార్టీపై మాట్లాడటానికి కనీస నైతిక అర్హత కూడా లేదని మా పార్టీ ఈ సందర్భంగా మరోసారి స్పష్టం చేస్తోంది. మాజీ మావోయిస్టుగా అవతారమెత్తిన జంపన్న చీటికి మాటికి పోలీసుల కథనాలకు వంత పాడుతూ మీడియా ముందు ప్రత్యక్షం కావడం ఆయనకు మంచిది కాదని కూడా హెచ్చరిస్తున్నాం" అనే వ్యాఖ్య ఉంది. ఈ వ్యాఖ్యకు సమాధానంగా జూన్ 20, 2021న సీ.పీ.ఐ (మావోయిస్టు) పంథాపైనా, కార్యాచరణపైన జంపన్న దాడి చేస్తూ లేఖ రాసాడు. ఆ లేఖకు మా సమాధానాన్ని కింద ఇస్తున్నాము.**

జూన్ 18న మా పార్టీ అధికార ప్రతినిధి అభయ్‌గా నేను ఇచ్చిన పత్రికా ప్రకటనపై జంపన్న సందేహాన్ని వెలిబుచ్చాడు. అది పార్టీ నుంచి వచ్చిందో లేక నకిలీలు చేసిన పనో అన్న సంశయాన్ని వ్యక్తపరిచాడు. జంపన్నకు అటువంటి శంక అవసరం లేదు. సీ.పీ.ఐ (మావోయిస్టు) అధికార ప్రతినిధి అభయ్‌గా నేను ఇచ్చినదే. నేను చేసిన ఆ వ్యాఖ్యకు జంపన్న స్పందిస్తూ, జూన్ 20న సోషల్ మీడియాలో తన సమాధానాన్ని ఉంచాడు. ఆ సమాధానంలో తనకు అభయ్ ఇచ్చిన 'ఫత్వా' హేళనతో, నిరాధార ఆరోపణలతో, అప్రజాస్వామికంగా, హెచ్చరికలతో కూడిన దాడిగా ఉందనీ, దానిని తాను ఖండిస్తున్నానంటూనే, తిరిగి పార్టీ పంథాపైనా, కార్యాచరణపైన వక్రీకరణలతో, అబద్ధాలతో దాడిని ఎక్కుపెట్టాడు. అంతేకాకుండా నా వ్యాఖ్యకు జవాబుగా రాసిన తన లేఖలో అబద్ధాలనూ, అభూత కల్పనలనూ, వక్రీకరణలను దట్టించి రాసాడు. అవేమిటో చూద్దాం. సోషల్ మీడియాలో తానిస్తున్న ఇంటర్వ్యూలూ, కామెంట్‌లు విమర్శనాత్మక, స్వేచ్ఛాయిత, వర్గదృక్పథంతో కూడుకున్నవనీ, ఉద్యమ పాఠాలుగా నేర్చుకున్న సైద్ధాంతిక, రాజకీయ అవగాహనకు చెందినవనీ, తాను కేవలం మావోయిస్టు పార్టీపైనే కాకుండా వివిధ పార్టీల వైఖరులపైనా, వివిధ అంశాలపైన వ్యాఖ్యానాలు చేస్తున్నాననీ, వీటిపై ఎందరో స్పందనలు తెలియజేస్తున్నప్పటికీ, వారెవ్వరికీ రాని 'జంపన్న పోలీసులకు వంతపాడుతున్నాడన్న' అనుమానం మవోయిస్టు పార్టీకి మాత్రమే వచ్చిందని బుకాయించాడు.

ఇంకా ప్రజాస్వామిక పద్ధతి గురించీ, ఆదర్శాల గురించీ, పార్టీకి సంబంధించిన అనేక విషయాలలో తాను స్పష్టీకరణ ఇస్తున్న విషయం గురించీ, భారత సామాజిక వ్యవస్థ గురించీ, భారత విప్లవ పంథా గురించీ, మా పార్టీ నిరంకుశ ధోరణి గురించీ, శతృవులనూ, మిత్రులను వేరు చేసి, మిత్రులను కలుపుకొచ్చుకోవడంలో పార్టీ అనుసరిస్తున్న సెక్టేరియన్ ధోరణి గురించి- ఇలా ఎన్నో విషయాలలో పార్టీ పైన అహంకార పూరిత, అసత్య ఆరోపణల దాడి చేస్తూ, తన అక్కసును వెళ్ళబోస్తూ, పాలకవర్గాలకు తాను నమ్మిన బంటునన్న విషయాన్ని మరోసారి రుజువు చేసుకున్నాడు.

జంపన్న రాసిన సమాధాన లేఖలో పొందుపరిచిన వక్రీకరణలకూ, అబద్ధాలకు మా సమాధానం కింద ఇస్తున్నాము.

ముందుగా జంపన్న ఫోకస్ చేసిన 'ఫత్వా' గురించి చూద్దాం. మా వ్యాఖ్యలో జంపన్న రాజ్యంతో చేతులు కలిపి ముఖ్యంగా పోలీసు వ్యవస్థతో మిలాఖతై పథకం ప్రకారం విప్లవ ప్రతీఘాతుక కార్యకలాపాలకు పాల్పడుతుండటాన్ని వ్యతిరేకిస్తూ, ఆయనపై తీవ్ర విమర్శతో పాటు హెచ్చరికను చేసాము. మా విమర్శనూ, హెచ్చరికను జంపన్న 'ఫత్వా' స్థాయికి తీసుకువెళ్ళి మేము ప్రకటించనిదాన్ని ప్రకటించినట్లుగా ఫోకస్ చేసి, చౌకబారు ఎత్తుగడలకు పాల్పడ్డాడు. ఇటువంటి కుయుక్తుల ద్వారా జంపన్న సాధించేదేమీ ఉండదని తెలియజేస్తున్నాం. ఇకపోతే తన ఉత్తరంలో వాస్తవాలను మరుగుపరుస్తూ, పార్టీ తనపై నిరంకుశ వైఖరితో వ్యవహరిస్తున్నదని నిర్ధారించడానికి అబద్ధాలను వండివార్చాడు. తాను పార్టీని విడిచిపెట్టినంత మాత్రానే, పార్టీ తనను ద్రోహి అంటున్నదనీ, సెక్టేరియన్ జడ్జిమెంటులు ఇస్తున్నదనీ, ఇష్టానుసారం సంకుచిత, మొరటు తీర్పులు ఇస్తున్నదనీ, జంపన్నను అర్థం చేసుకోవడంలో భ్రమలపైన ఆధారపడి, పై పై విశ్లేషణలతో తప్పుడు నిర్ణయానికి వస్తున్నదనీ, పిడివాద, మూస, రొడ్డకొట్టుడు పదజాలంతో, పనికిరాని కొలతలతో జంపన్నలాంటి 'మిత్రులను' దూరం చేసుకొంటున్నదని ఆరోపిస్తూ సానుభూతి పొందాలని ప్రయత్నించాడు. వాస్తవానికి

జంపన్న పదగుంఫనతో తన నిజస్వరూపాన్ని మరుగుపరచాలని చూస్తున్నాడు. వాస్తవాలేమిటో చూద్దాం.

జంపన్న పార్టీలో మూడు దశాబ్దాల కాలం పని చేసాడు. ఆయన రాజకీయంగా దిగజారడానికి ముందు కేంద్రకమిటీ సభ్యుడి హెూదాలో పని చేసాడు. ఆయనకు పార్టీ విధానాల గురించీ, అభివృద్ధి గురించి తెలియనిదేమిలేదు. పార్టీ మహత్తర శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవస్ఫూర్తితో ఉద్భవించింది. కేంద్రీకృత ప్రజాస్వామ్యం, విమర్శ, స్వయం విమర్శలు పార్టీకి జీవనాడి లాంటివి. పార్టీ బలం కూడా ఆ నిర్మాణ సూత్రాలపైనే ఆధారపడి ఉంది. ఈ సూత్రాలు మాటల్లోనే కాదు, పార్టీ ఆచరణలో కూడా అమలవుతుండటం వల్లనే పార్టీ కార్మికవర్గ ఉక్కు క్రమశిక్షణ కలిగిన సంఘటిత శక్తిగా పురోగమిస్తున్నది. ఇటువంటి విప్లవకర కార్మికవర్గ పార్టీలో జంపన్నకు నిజంగానే భారతదేశంలో ఉత్పత్తి సంబంధాలపైనా, పార్టీ పంథాపైనా భిన్నాభిప్రాయాలుంటే పార్టీ నింబంధనావళి ప్రకారం, నిర్మాణ సూత్రాల ప్రకారం రెండు పంథాల మధ్య పోరాటం చేసేందుకు బోలెడంత అవకాశం ఉంటుంది, ఉంది కూడా. కానీ ఆయన ఏనాడు ఏ ఒక్క కేంద్రకమిటీ సమావేశంలో సైతం తనకు భిన్నాభిప్రాయాలున్నట్లు వ్యక్తం చేయలేదు. చివరికి కేంద్రకమిటీ సభ్యుడిగా ఆయన దృఢంగా, త్యాగపూరితంగా ఉండటంలేదనే విమర్శలు వెల్లువెత్తడంతో, కేంద్రకమిటీ సమావేశంలో ఆయన కార్యాచరణపై చర్చించి రెండు సంవత్సరాల సస్పెన్షన్ విధించడం జరిగింది. ఈ చర్యను జీర్ణించుకోలేని జంపన్న భారతదేశ ఉత్పత్తి సంబంధాలపైనా, విప్లవపంథాపైన చర్చను లేవనెత్తాడు. ఆయన అవకాశవాదంతో ఈ చర్చను లేవనెత్తుతున్నాడన్న విషయం కేంద్రకమిటీకి అర్థమైనప్పటికీ, పార్టీ నిర్మాణ సూత్రాలకు లోబడి ఆయనకు చర్చ చేసే అవకాశాన్ని కల్పించింది. కానీ అప్పటికే విప్లవతత్వం నశించి, త్యాగ సంసిద్ధతను కోల్పోయిన జంపన్న నేరుగా పోలీసు బాసుల ముందు శరణు వేడుకున్నాడు. లక్షల రూపాయల ప్రజల రక్తపు కూడును ప్రభుత్వ లొంగుబాటు పథకంలో భాగంగా స్వీకరించాడు. చివరికి జంపన్న లాంటివాళ్ళ కోసం సామ్రాజ్యవాద, పాలకవర్గాల ప్రాయోజిత ధోరణిగా ముందుకొచ్చిన 'భారత సమాజం పెట్టుబడిదారీ సమాజంగా మారిందనే' వాదనను ఆయన భుజాన వేసుకొని, పాలకవర్గాల సేవలో తరించిపోయేందుకు పార్టీపైనా, పార్టీ పంథాపైన దాడికి సిద్ధపడ్డాడు. ఇక్కడ మేము 'భారత సమాజం పెట్టుబడిదారీ సమాజంగా మారిందనే ధోరణి'ని సామ్రాజ్యవాద, పాలకవర్గాల ప్రాయోజిత ధోరణిగా చెప్పడంలో ఒక నిజమైన తర్కం ఉంది. అదేమిటంటే సీ.పీ.ఐ (మావోయిస్టు)గా మేము దీర్ఘకాలిక ప్రజాయుద్ధం ద్వారా భారతదేశ అర్ధభూస్వామ్య సమాజాన్ని మార్చి దేశాభివృద్ధికీ, నూతన ప్రజాస్వామిక వ్యవస్థను అటుపిమ్మట సోషలిజం, కమ్యూనిజంలను స్థాపించాలనే ప్రత్యామ్నాయాన్ని ముందుకు తెచ్చాము. ముందుకు తేవడమే కాదు, మా ప్రజాయుద్ధ పంథాను ఆచరణలో పెట్టి చూపుతున్నాము. దీంతో భారతదేశంలో ప్రజాయుద్ధం మరింత బలోపేతం అవుతున్న ధోరణిని గమనించిన సామ్రాజ్యవాదులు, దేశీయంగా, అంతర్జాతీయంగా ఏర్పడబోయే తీవ్ర పరిణామాలను ముందుగానే అంచనా కట్టాయి. ఈ నేపథ్యంలోనే సామ్రాజ్యవాదుల దిశానిర్దేశంతో భారత దళారీ పాలకవర్గాలు సీ.పీ.ఐ (మావోయిస్టు)ను దేశ అంతర్గత భద్రతకు ముప్పుగా ప్రకటించాయి. నిజంగా దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాకు ప్రాసంగికత లేకపోతే, ఇదే కాలం చెల్లినదైతే, దోపిడీ పాలకవర్గాలు అంత ఆందోళన పడాల్సిన అవసరమేమున్నది? ప్రజాస్వామిక విప్లవానికి ప్రాతినిధ్యం వహించే విప్లవ ప్రజాస్వామిక, మేధావి బృంధాలను ఎందుకు వేటాడుతున్నాయి? పలు బూటకపు కేసులు పెట్టి ఎందుకు జైళ్ళలో కుక్కుతున్నాయి? నిజంగా పార్టీ పంథాకు ప్రాసంగికత లేకపోతే, ప్రజలలో విశ్వసనీయత లేకపోతే పాలకవర్గాలు ఇంత పెద్దఎత్తున దాడికి సిద్ధపడవు కదా! పాలకవర్గాలు ఇంతటితోనే ఆగలేదు. భారతదేశంలో తక్షణం జరగాల్సిన సామాజిక విప్లవంగా నూతన ప్రజాస్వామిక విప్లవ ఆవశ్యకత పెరగుతుండటంతో, దోపిడీ పాలకవర్గాలు విప్లవ శ్రేణుల్లో, ప్రజల్లో సిద్ధాంత గందరగోళం సృషించేందుకు తమ ప్రాయోజిత సంస్థలకు కోట్ల రూపాయలు ఇచ్చి భారతదేశంలో పెట్టుబడిదారీ సంబంధాలు వచ్చాయని నిర్ధారిస్తున్నాయి. ఈ విషయంపై 2011లో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో పెద్దఎత్తున జరిగిన సెమినార్‌తోపాటు, లెక్కకు మించిన పరిశోధనలు జరిగాయి, జరుగుతున్నాయి. ఈ పరిశోధనలతో భారతదేశం ఎంత మాత్రమూ అర్ధభూస్వామ్య దేశంగా లేదు, అది పెట్టుబడిదారీ సమాజంగా మారిందనే వాదనను నిర్ధారిస్తున్నాయి. అందుకే దీన్ని సామ్రాజ్యవాద పాలకవర్గ ప్రాయోజిత వాదనగా చెప్పాలి. అయితే భారతదేశంలో పెట్టుబడిదారీ విధానం వచ్చిందని చెబుతున్నవారంతా సామ్రాజ్యవాద, పాలకవర్గ ప్రయోజిత వాదనకు సమర్థకులుగానూ, ప్రతినిధులగాను చెప్పనవసరం లేదు. ముఖ్యంగా శత్రు ఏజెంట్లు, విప్లవ వ్యతిరేక శక్తులు, పార్టీ నుంచి తోసివేయబడిన అవకాశవాద రివిజనిస్టు శక్తులు, పార్టీ నుంచి వెళ్ళి శతృవుకు లొంగిపోయిన విద్రోహ శక్తులు ఈ ధోరణికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. వీరు మొదటికోవకు చెందినవారు. అయితే ఈ ధోరణిని కొందరు స్వతంత్ర మేధావులు కూడా సమర్థిస్తున్నప్పటికీ, వారు రెండవ కోవకు చెందినవారు. వారు ఎమ్.ఎల్.ఎమ్ అవగాహన కొరవడటం, సామాజిక ఆచరణకు దూరంగా ఉండటం, అనుభవరాహిత్యం కారణంగా, విశ్వసనీయతలేని సగటు డేటాపై ఆధారపడి యాంత్రిక విశ్లేషణ చేయడం కారణంగా ఈ ధోరణికి

ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జంపన్న మాత్రం పైన ఇచ్చిన వివరణ ప్రకారం మొదటి కోవకే చెందుతాడు.

జంపన్న విషయంలో పైన మేము పేర్కొన్న విషయాలన్నీ వాస్తవాలు కాదా! అసలు నిజమైన విప్లవకారులెవరైనా, వర్గశత్రువులైన దోపిడీ పాలకవర్గాల ముందు, వారి నిరంకుశ పోలీసు అధికారుల ముందు లొంగిపోతారా? జంపన్న పోలీసు అధికారుల ముందు లొంగిపోవడమే కాకుండా, వారి మార్గదర్శకత్వంలో, పెట్టుబడికి కట్టుకథలకు పుట్టిన 'ఐ డ్రీమ్' ఇంకా కొన్ని ఇతర ఎలక్ట్రానిక్ మీడియాలతో అపవిత్ర కలయిక ఏర్పరుచుకొని పార్టీమీద, పార్టీ పంథామీద ఒక పథకం ప్రకారం దాడి చేయడం లేదా? ఎవరైనా ఈ వాస్తవాలను కాదనగలరా? ఈ పనులన్నీ వర్గసంకర రాజకీయాలలో మునిగితేలుతూ విప్లవోద్యమంపై దాడి చేయడం కాదా? ఇంత చేస్తూ, అంటే ఒకవైపున విప్లవ ప్రతీఘాతుకత్వానికి పాల్పడుతూ, మరోవైపు తనవర్గ స్పృహ గురించి తన లేఖలో ప్రస్తావించడం తనకే చెల్లింది.

నిజంగా విప్లవకారులెవరైనా చర్చ, చర్చ కోసం చేయరు. విప్లవ సమస్య పరిష్కరించేందుకు చేస్తారు. కానీ జంపన్న ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నాడు. ఆయన నిజంగా భారతదేశంలో పెట్టుబడిదారీ విధానమే ఉందని నమ్మితే, అందుకు ఆచరణాత్మక పథకాన్ని రూపొందించుకొని, విప్లవ సమస్యను పరిష్కారించేందుకు పూనుకోవాలి. కానీ ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయకుండా, మీడియాలో తన చర్చను ప్రధానంగా పార్టీపంథాపై దాడి చేసేందుకే కేంద్రీకరిస్తున్నాడు. ఇది చాలదన్నట్లు తన "ఇంటర్వ్యూల్లో, సోషల్ మీడియా కామెంట్‌లల్లో మావోయిస్టు పార్టీకి సంబంధించిన అనేక విషయాల్లో స్పష్టీకరణతో కూడిన విషయాలు ప్రధానంగా ఉంటున్నాయని" తన లేఖలో పేర్కొన్నాడు. అసలు మూడు సంవత్సరాల క్రితమే విప్లవోద్యమం నుంచి దిగజారిన జంపన్న పార్టీకి సంబంధించిన విషయాలపై స్పష్టీకరణ ఎలా ఇవ్వగలుగుతాడు? అటువంటి విషయాలు మాట్లాడేందుకు ఆయనకు ఏమి హక్కు ఉంటుంది? ఇదంతా ఒక పథకం ప్రకారం కుట్రపూరితంగా జరుగుతున్న వ్యవహారమే. ఈ వ్యవహారంలో 'ఐ డ్రీమ్', ఇంకా కొన్ని ఇతర మీడియా సంస్థలు జంపన్న దిగజారుడుకు 'మసి పూసి మారేడు కాయ చేసి' ఇప్పటికీ, ఆయనని మావోయిస్టు ప్రతినిధిగా చిత్రీకరించి, ఆయన మాటలకూ, వ్యాఖ్యలకు ఒక విప్లవ సాధికారతను కల్పించి ప్రజలలో గందరగోళం సృష్టించే కుట్ర చేస్తున్నాయి. ఇటువంటి కుట్రపూరిత నీచమైన ఎత్తుగడలను పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నది. పార్టీకి సంబంధించిన ఏ విషయంపైనైనా స్పష్టీకరణ ఇచ్చే హక్కు పార్టీలో పని చేస్తున్న వారికీ, పార్టీచేత నియమించబడిన అధికార ప్రతినిధికి మాత్రమే ఉంటుంది.

ఇక జంపన్నపైన మేమిచ్చిన పై వివరణ ప్రకారం మా వ్యాఖ్యలో ఏ మాత్రం హేళనగానీ, నిరాధార ఆరోపణగానీ, అప్రజాస్వామిక వైఖరిగాని లేదని తెలియజేస్తున్నాం. మా వ్యాఖ్య వాస్తవాలనే ప్రతిబింబిస్తున్నదని మరోసారి వక్కాణిస్తున్నాం. వాస్తవంగా జంపన్నే పార్టీలో నెలకొని ఉన్న ప్రజాస్వామిక సూత్రాలకూ, విలువలకూ, ఉమ్మడి కార్యాచరణకు ఏ మాత్రం విలువ నివ్వకుండా వ్యక్తివాదంతో, స్వార్థంతో పార్టీని వదిలి వెళ్ళాడు. ఇటువంటి వ్యక్తి తిరిగి పార్టీకి ప్రజాస్వామిక విలువలనూ, సూత్రాలను బోధించడం ఎంత హాస్యాస్పదంగా ఉంటుందో ఆలోచించండి.

జంపన్న ఒకవైపున తన వాస్తవస్థితిని మరుగుపరిచేందుకు ప్రయత్నిస్తూనే, పార్టీపంథా వైఫల్యాన్ని ఎత్తిచూపేందుకు, "దేశంలో అనేకమైన ప్రజా సమస్యల పరిష్కారానికి గత 2 దశాబ్దాలకుపైగా మీ కార్యాచరణ ఏమిలేక, విశాల ప్రజా రాశులకు దూరమైన విషయం గత కొన్ని సంవత్సరాలుగా మీకు అర్థమవుతున్నప్పటికీ, వాటిని దాటవేస్తూ కాలం గడపటం భారత పీడిత ప్రజలను నిరాశ పరుస్తున్నదని" స్వీయాత్మకంగా ప్రకటించాడు. ఎవరికైనా వాస్తవాలను చూడాలనే చిత్తశుద్ధి ఉంటే, వాస్తవాలను గుర్తించగలుగుతారు. కానీ కళ్ళుండి వాస్తవాలను చూసేందుకు నిరాకరించేవారికి వాస్తవాలు ఎట్టిపరిస్థితుల్లోనూ కన్పించవు. నేడు భారతదేశంలో గుర్తింపు పొందిన మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా జరుగుతున్న రైతాంగ ఉద్యమంలో మా పార్టీ ఉనికిని గుర్తించడంవల్లనే మోడీ ప్రభుత్వం ఆ ఉద్యమంలో 'టర్బన్ మావోయిస్టులు' ఉన్నారని ఆందోళన పడింది. మధ్య భారతదేశంలోని విశాల ఆదివాసీ ప్రాంతాలలో పత్తల్‌ఘడి పేరుతో స్వయం నిర్ణయాధికారం కోసం జరుగుతున్న పోరాటాలకు మెజారిటీగా పార్టీ నేతృత్వం వహిస్తున్నది. గెరిల్లా జోన్ ప్రాంతాలలో ముఖ్యంగా దండకారణ్యం, బీహార్, ఝార్ఖండ్, ఏ.ఓ.బీ ఉద్యమ ప్రాంతాలలో పోలీసు క్యాంపుల ఎత్తివేతకు లక్షలాది మంది ఆదివాసీ రైతాంగం సమరశీలంగా పోరాడుతున్నారు. ఈ పోరాటానికి పరాకాష్టగా దండకారణ్యంలో సిలింగేర్ క్యాంపుకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాన్ని చూడవచ్చు. ఆ పోరాటంలో రాజ్యానికి వ్యతిరేకంగా లక్షలాదిమంది మూలవాసీ రైతాంగం చేస్తున్న త్యాగపూరిత, సమరశీల పోరాటం దేశవ్యాపితంగా పోరాడుతున్న ప్రజలను ఉత్తేజపరుస్తున్నది, వారి సంఘీభావాన్ని పొందుతున్నది. విస్థాపనకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలలో మెజారిటీ పోరాటాలకు పార్టీ నేతృత్వం వహిస్తున్నదని చెప్పడంలో అతిశయోక్తి లేదనుకుంటాను. దళిత ఉద్యమాలకు పార్టీ కొన్ని చోట్ల నేతృత్వం వహిస్తుంటే, మరికొన్ని చోట్ల సంఘీభావాన్ని ప్రకటిస్తున్నది. ఈ క్రమంలో పార్టీ ప్రభావం, నేతృత్వం గెరిల్లా జోన్ల నుంచి విశాల భారతదేశంలోని పట్టణాలకూ, మైదానాలకు విస్తరిస్తున్నదన్న భయంతోనే మోడీ ప్రభుత్వం 'అర్బన్ నక్సలైట్లు' పేరుతో

అనేక మంది విప్లవ ప్రజాస్వామిక వాదులపై అక్రమ కేసులు బనాయించి జైళ్ళలోకి నెట్టింది. తెలంగాణలో కే.సీ.ఆర్ ప్రభుత్వం ఏకంగా 16 సంఘాలపై నిషేధం విధించింది. పార్టీ ఈ విషయంలో చాలా స్పష్టమైన అవగాహనతోనే ఉంది. ప్రజాయుద్ధమంటే గెరిల్లా పోరాటంతోపాటు, అనేక ఇతర పోరాట రూపాలు ఉంటాయనీ, ప్రజాయుద్ధం కేవలం వెనకబడిన గ్రామీణ ప్రాంతాలలోనే కాకుండా, విశాల, మైదాన పట్టణ ప్రాంతాలకు విస్తరిస్తుందనే సరైన, స్పష్టమైన అవగాహనతో పార్టీ పురోగమిస్తున్నది. ఈ అవగాహనలో భాగంగానే ప్రధాన శత్రువుకు వ్యతిరేకంగా విశాల ఐక్యసంఘటనల ద్వారా ఐక్య ఉద్యమాలను నిర్మించేందుకు కృషి చేస్తున్నది. ఈ క్రమంలోనే దేశవ్యాపితంగా ఏర్పడబోయే ప్రజా ఉద్యమ వెల్లువలో సీ.పీ.ఐ (మావోయిస్టు) కేంద్ర స్థానాన్ని పొందుతుందని పూర్తి విశ్వాసంతో చెప్పదల్చుకొన్నాం. ఈ పరిణామాలను శత్రువు చూడగలుతున్నాడు గానీ, జంపన్న మాత్రం చూడ నిరాకరిస్తున్నాడు.

ఇక చివరిగా, “దేశంలో సకల సమస్యలకు మూలకారణమైన పెట్టుబడిదారీ వ్యవస్థ అంతానికి మీ శక్తియుక్తులతో నిజమైన ప్రతిదాడిని ఎక్కుపెట్టండి. నిజమైన శత్రువులను గుర్తించి వేరు చేయండి. అన్ని రకాల మిత్రులతో కలిసి నడవండి” అంటూ జంపన్న హితవు పలికాడు. ఇక్కడే ఉంది, ఆయనకు చెందిన ప్రభుత్వ ప్రాయోజిత, స్వీయాత్మక, రాజకీయ దివాళాకోరుతనం. భారతదేశంలో సకల సమస్యలకు మూలకారణం, జంపన్న చెబుతున్నట్లు పెట్టుబడిదారీ వ్యవస్థకాదు, సామ్రాజ్యవాదుల కనుసన్నలలో నడుస్తున్న బ్రాహ్మణవాద హిందుత్వంతో విడదీయలేనంతగా పెనవేసుకుపోయిన అర్ధవలస-అర్ధభూస్వామ్య వ్యవస్థనే అసలు కారణం. కనుక సకల సమస్యలను పరిష్కరించుకునేందుకు సామ్రాజ్యవాదులకూ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా కార్మికవర్గ నాయకత్వంలో నాలుగు విప్లవకర వర్గాలను కలుపుకొని దీర్ఘకాలిక ప్రజాయుద్ధం ద్వారా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయాలి. ఆ తర్వాతనే సోషలిస్టు విప్లవాన్నీ, కమ్యూనిజాన్ని స్థాపించాలి. ఈ అసలు వాస్తవాన్ని జంపన్న మరుగున పరిచి విప్లవోద్యమానికి హాని కల్గించే వక్రబుద్ధితో భారతదేశంలో సోషలిస్టు విప్లవం జరగాలని గావుకేకలు పెడుతున్నాడు. జంపన్న అనుసరిస్తున్న ఈ వైఖరిని పార్టీ నిఖచ్చిగా తిప్పికొడ్తుంది.

పార్టీని నడిపించేది గతితార్కిక భౌతికవాద సిద్ధాంతం. ఈ సిద్ధాంతం వెలుగులోనే గత ఐదు దశాబ్దాలుగా పార్టీ కృషి చేస్తూ పురోగమిస్తున్నది. పార్టీకి సాయుధ పోరాటం నిర్వహించేందుకు సైన్యమంటూ లేని పరిస్థితుల నుంచి దోపిడీ పాలకవర్గాల కిరాయి సాయుధ బలగాలతో ధీటుగా పోరాడే ‘ప్రజా విముక్తి గెరిల్లా సైన్యా’న్ని నిర్మించుకొన్నది. ప్రజలకు అధికారమే లేని స్థితి నుంచి ప్రాదుర్భావ స్థితిలో రాజ్యాధికార అంగాలుగా ఉన్న గెరిల్లా బేస్‌లను నిర్మించింది. ఈ ప్రయాణమంతా ‘నల్లేరు మీద బండిలా’ సాగలేదు, అనేక ఓటములతోటి, విజయాలతోటి, రక్తతర్పణతోటి, పెద్ద పెద్ద వెనుకంజలతోటి, ముందంజలతోటి ఉద్యమ ప్రయాణం ముందుకే సాగింది. భవిష్యత్‌లో కూడా ముందుకే సాగుతుంది. ఇలా చెప్పడానికి పార్టీ చేతిలో మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంత ఆయుధముండటమే కాకుండా, సిద్ధాంత అన్వయింపు ద్వారా ఎప్పటికప్పుడు సామాజిక పరిస్థితులలోనూ, ఉద్యమ స్థితిలోను వస్తున్న మార్పులపై సరైన విశ్లేషణ చేస్తూ, నూతన ఎత్తుగడలను రూపొందించుకుంటూ, వాటిని అమలు చేస్తూ వచ్చిన గొప్ప అనుభవాలు కూడా ఉన్నాయి. ఈ అంశాలే పార్టీ భవిష్యత్ పురోగమనానికి గట్టి హామినిస్తున్నాయి.

ఈ మధ్య కాలంలో దేశంలో నెలకొని ఉన్న (చలనంలో ఉన్న) సామాజిక సంబంధాలపై సీ.సీ అధ్యయనం చేపట్టింది. ఈ అధ్యయనం ద్వారా దేశ సామాజిక వ్యవస్థ (అర్ధవలస, అర్ధభూస్వామ్య)లో గణనీయమైన మార్పులు జరిగినప్పటికీ, మౌలికమార్పు రాలేదని నిర్ధారించింది. అయితే సామ్రాజ్యవాదుల భారత పాలకవర్గాల ప్రయోజనాలకు అనుగుణంగా ఆర్థికవ్యవస్థలో జరిగిన గణనీయమైన మార్పులు, సామాజిక సంబంధాలపై బలమైన ప్రభావాన్ని వేసాయనీ, అవి గణించదగిన పరిమాణామాత్మక మార్పులకు గురి అయ్యాయని సీ.సీ అభిప్రాయపడింది. ఈ మార్పులు భారతదేశ అర్ధవలస-అర్ధభూస్వామ్య సామాజిక వ్యవస్థ అసమానాభివృద్ధి స్వాభావానికి అనుగుణంగా జరిగాయనీ, ఇందుకనుగుణంగా ఎత్తుగడలలో మార్పు తీసుకురావాలని కూడా సీ.సీ గుర్తించి ఈ క్రోడీకరణలపై ఆధారపడి ‘భారతదేశ ఉత్పత్తి సంబంధాలలో మార్పులు-మన రాజకీయ కార్యక్రమం’ అనే డాక్యుమెంటును రూపొందించింది. దానిని నెట్‌లో పెడ్తున్నాం. భారతదేశంలో సామాజిక విప్లవాన్ని కోరుకునేవారు దీనిని తప్పక అధ్యయనం చేసి మాకు సూచనలు, సలహాలు పంపాలని కోరుకుంటున్నాం. లోతైన అధ్యయనం, సమిష్టి చర్చ, విప్లవ నిజాయితీ అవసరం లేని జంపన్నకు మా నూతన డాక్యుమెంటు అంత అవసరం కాకపోవచ్చు.

**అధికార ప్రతినిధి,**

**అభయ్,**

Abhay

**సీ.పీ.ఐ (మావోయిస్టు).**

పత్రికా ప్రకటన తేది: జులై 7, 2021

# ఫాదర్ స్టాన్‌స్వామిది సాధారణ మరణం కాదు, అది రాజ్యం చేసిన హత్య

స్టాన్ స్వామి మృతి పట్ల సి.పి.ఐ (మావోయిస్టు) తీవ్ర దిగ్భ్రాంతినీ, సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నది. 84 ఏళ్ళ ఈ ప్రజాస్వామికవాది, సామాజిక ఉద్యమకారుడు జార్ఖండ్ ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీల హక్కులకోసం, సమస్యల పరిష్కారానికి పోరాడాడు. ఈ నేపథ్యంలోనే మోడీ ప్రభుత్వం గతేడాది అక్టోబర్‌లో బీమాకోరేగావ్ కేసుకు సంబంధించి యు.ఏ.పి.ఏ (ఊపా) కింద కుట్రపూరిత ఆరోపణలు మోపి జైలుకు పంపింది. అక్కడ ఆయన పార్కిన్‌సన్స్‌తోపాటు, ఇతర అనారోగ్య సమస్యలతో తీవ్రంగా బాధపడుతున్నా, హైకోర్టు తగిన రీతిలో స్పందించలేదు. ఇక ఎన్.ఐ.ఏ, జైలు అధికారులు క్రూరంగా వ్యవహరించారు. ఆయన అనారోగ్యం గురించి ఆందోళన పడిన ప్రజాస్వామికవాదుల, మేధావుల విజ్ఞప్తులను బేఖాతరు చేసారు. అందుకే స్టాన్‌స్వామిది సాధారణ మరణం కాదు, అది రాజ్యం చేసిన హత్య.

స్టాన్‌స్వామి ఆదివాసీల హక్కులకోసం అంతర్జాతీయ, జాతీయ కార్పొరేట్ సంస్థలకు వ్యతిరేకంగా పోరాడాడు. ఈ పోరాటాలలో ఆదివాసీలు లక్షల సంఖ్యలో పాల్గొన్నారు. స్టాన్‌స్వామి చట్టబద్ధ, ప్రజ్వామిక పోరాటం నిర్వహించినప్పటికీ, అది కార్పొరేట్ సంస్థలకు వ్యతిరేకం కావడంతో రాజ్యం కన్నెర్రకు కారణమైంది. ఈ ఉదాంతాన్ని బట్టి మోడీ ప్రభుత్వం అంతర్జాతీయ, దేశీయ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్నదని మరోసారి రుజువైంది. అందుకే బీమాకోరేగావ్ సంఘటనలో స్టాన్‌స్వామిని ఇరికించి ఆయనపై తప్పుడు కేసు బనాయించి, అది కేవలం ఆరోపణల స్థితిలో ఉండగానే, కక్షపూరితంగా బెయిల్ ఇవ్వకుండా అనేక రూపాల్లో హింసించి మోడీ ప్రభుత్వం ఆయనను హత్య చేసింది.

ఈ సంఘటన భారత రాజ్యం 'ఉదారవాద ప్రజాస్వామిక రాజ్యం' అని భావించేవాళ్ళ కళ్ళు తెరిపించాలి. వాస్తవానికి ఇది సామ్రాజ్యవాదానికి సేవ చేస్తున్న బ్రాహ్మణవాద హిందుత్వ ఫాసిస్టు రాజ్యం. ఇక్కడ ఎన్.ఐ.ఏ నుంచి, జైళ్ళు, చివరకు న్యాయవ్యవస్థ సైతం రాజ్యాంగ సంస్థలన్నీ ఫాసిజీకరించబడ్డాయి. కనుక ఈ ఫాసిస్టు రాజ్యం, స్టాన్‌స్వామి హత్యతోనే ఆగదు, దీని హత్యల పరంపర విప్లవకారులు, ప్రజాస్వామికవాదులు, సెక్యులరిస్టులు, హేతువాదులు, మైనారిటీలు, పర్యావరణవాదులు ఇలా తన ప్రయోజనాలకు వ్యతిరేకంగా మాట్లాడేవారెవరినైనా నిర్దాక్షిణ్యంగా హత్య చేస్తుంది.

భారతదేశం నేడు బ్రాహ్మణవాద హిందుత్వ ఫాసిస్టు ప్రమాదాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ఫాసిజానికి వ్యతిరేకంగా ఒక బలమైన ప్రజాస్వామిక ఉద్యమాన్ని నిర్మించాలి. ముఖ్యంగా ఈ సంఘటనను దృష్టిలో ఉంచుకొని ఈ కింది డిమాండ్‌లతో ఉద్యమించాలి.

*డిమాండ్స్ :*

- **స్టాన్‌స్వామి హత్యకు కారకులైన వారిని శిక్షించాలి.**
- **బీమకోరేగావ్ కేసులో స్టాన్‌స్వామితోపాటుగా నేరం మోపబడినవారందరిని బేషరతుగా విడుదల చేయాలి.**
- **అంగవైకల్యంతో బాధపడుతున్న ప్రొఫెసర్ సాయిబాబపై అక్రమకేసులు బనాయించి దుర్మార్గంగా జైలుపాలు చేయడాన్ని నిరసించాలి. ఆయన బేషరతు విడుదలకు డిమాండ్ చేయాలి. రాజకీయ ఖైదీలందరిని కూడా బేషరతుగా విడుదల చేయాలి.**
- **యూ.ఏ.పి.ఏ (ఊపా) చట్టం రద్దుకోసం ఉద్యమించాలి.**

**అభయ్,**
**అధికార ప్రతినిధి,**
Abhay
**కేంద్ర కమిటీ,**
**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు).**

## షహీద్ జతిన్‌దాస్ స్మృతిలో సెప్టెంబర్ 13 రాజకీయ ఖైదీల హక్కుల దినంగా పాటించండి !!

# జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను ఘనంగా జరుపుకుందాం!

# అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ వారి ఆశయసాధనలో నడుద్దాం!!

# నూతన ప్రజాస్వామిక విప్లవమే అశేష పీడిత ప్రజల విముక్తికి మార్గమని ఎలుగెత్తి చాటుదాం!!!

*ప్రియమైన ప్రజలారా!*

విప్లవ దినాల నిర్వహణలో 28 జూలై ప్రత్యేకంగా చెప్పుకోదగిన ప్రాధాన్యత కలిగిన రోజు. భారతదేశంలో మహోత్తర నక్సల్బరీ నుండి మొదలుకుని ఎన్ని నిర్బంధాలు, ఆటంకాలు వచ్చిన ఇప్పటి వరకు కొనసాగుతున్న ప్రజాయుద్ధంలో భారత విప్లవ మహానాయకులు మన పార్టీ సంస్థాపక నాయకులు, అధ్యాపకులు కా. చారుమజుందార్ 1972 జూలై 28న, కా. కన్హయ్ చటర్జీ 1982 జూలై 18న అమరులయ్యారు. ఈ ఇద్దరు నాయకులు రివిజనిజాన్ని బద్దలుకొడుతూ నక్సల్బరీ సాయుధ రైతాంగ పోరాటం నుండి నేటివరకు భారత నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం అంతిమంగా సోషలిజం, కమ్యూనిజం స్థాపన లక్ష్యంగా దేశవ్యాప్తంగా కేంద్రకమిటీ పోలిట్‌బ్యూరో నుండి విప్లవ ప్రజల వరకు వీరవనితలు, వీరయోధులు తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేస్తూ అమరులయిన కామ్రేడ్స్‌కు తెలంగాణ రాష్ట్ర కమిటీ తలవంచి విప్లవ జోహార్లు అర్పిస్తుంది. ఈ సంవత్సర కాలంలో దేశ వ్యాప్తంగా మన పార్టీ, పీఎల్‌జీఏ, ప్రజానిర్మాణాలకు సంబంధించిన మొత్తం 160 మంది కామ్రేడ్స్ అమరులయినారు. వీరి మరణాలు విప్లవోద్యమానికి తీరని నష్టాన్ని కలిగించాయి.

కేంద్రకమిటీ సభ్యుడు, తెలంగాణ రాష్ట్రకమిటీ కార్యదర్శి కామ్రేడ్ యాప నారాయణ (హరిభూషన్, లక్కు) మహబూబ్‌బాద్ జిల్లా గంగారం మండలం, మడగూడెం గ్రామంలో ఆదివాసి కుటుంబంలో జన్మించాడు. ఇంటర్ వరకు నర్సంపేటలో చదివి, హన్మకొండలో డిగ్రీ పూర్తి చేసాడు. 33 సం॥రాల సుదీర్ఘ విప్లవ జీవితం అనంతరం 21 జూన్ 2021 నాడు కరోనా వ్యాధి సోకి అమరుడయ్యాడు. వరంగల్ విద్యార్థి ఉద్యమం, భూస్వామ్య వ్యతిరేక పోరాటాల ప్రభావంతో మహబూబ్‌బాద్ ప్రాంతంతో మితవాద ప్రజాపంథా వారి దివాళాకోరు రాజకీయాలు, వారి ప్రజావ్యతిరేక దౌర్జన్యకర పద్ధతులకు వ్యతిరేకంగా ఆయన మావోయిస్టు రాజకీయాలతో దృఢంగా మమేకమయ్యాడు. 1991లో పార్టీలోకి వచ్చి వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా, కేంద్ర కమిటీ సభ్యుడుగా అమరుడుకావడం తెలంగాణ ఉద్యమానికి తీవ్ర నష్టం వాటిల్లింది. కా. కత్తి మోహనరావు (ప్రకాశ్, దామ) గుండెపోటుతో సీనియర్ (పీఎం), కా. సిద్ధబోయిన సారక్క (భారతక్క, బుద్రి) (ఏసీఎం) అనారోగ్యంతో అమరులయ్యారు. కమ్యూనికేషన్ బాధ్యుడు కా. గడ్డం మధుకర్ (శోభ్రాయ్) (డీవీసీఎం) డీకే, కా. గంగాల్ (టీడీ, డీవీసీఎం) డీకే, కా. సందె గంగన్న (అశోక్) (డీవీసీఎం) లు బూటకపు ఎన్‌కౌంటర్లలో అమరులయ్యారు. కా. రామాల్ (సుధీర్) మణుగూరు కమాండర్, కా. మడకం లక్మాల్, కా. సుక్మాల్, కా. జుగునక బాదీరావు, కా. శ్రీను (ఏసీఎం), కా. మడకం ఐతు (ప్రభాకర్) మిలీషియా, కా. జోగాల్ (ఏసీఎం), కా. రాజె, కా. లలితలు బూటకపు ఎన్‌కౌంటర్లలో అమరులయ్యారు. కా. మ్యాదరి బిక్షపతి (విజెందర్) (పీఎం) విషప్రయోగంతో అమరుడయ్యాడు. విప్లవ సానుభూతిపరులు కా. ఆలెం కిరణ్, కా. మేర మల్లేశం, కా. కంప దేవేందర్‌లు వీళ్లంతా కేంద్ర కర్తవ్యాన్ని అమలుచేస్తూ నూతన ప్రజాస్వామిక విప్లవం సోషలిజం, కమ్యూనిజమే లక్ష్యంగా తుదికంటా ప్రజల పక్షాన నిలబడి అమరులైనారు. వాళ్ల ఆశయాలను చివరి వరకు కొనసాగిద్దాం.

సామ్రాజ్యవాదులకు, పెట్టుబడిదారులకు, భూస్వాములకు మనదేశంలో ఉన్న ప్రకృతి వనరులను దోచిపెట్టడానికి భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) పై దోపిడి పాలకవర్గాలు ఎన్నడూ లేనివిధంగా బహుముఖదాడిని కొనసాగిస్తున్నారు. అధిక మెజారిటీతో గెలిచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీజేపీ, టీఆర్ఎస్ పార్టీలు బడ్జెట్‌లో రక్షణ శాఖకు అధిక నిధులు కెటాయిస్తున్నారు. ఆధునిక ఆయుధాలు, డ్రోన్స్, యుద్ధ విమానాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని కొనుగోలు చేస్తున్నారు. సాయుధ బలగాలను మరింత క్రూరంగా, పాశవికంగా అణచివేతకు తగిన విధంగా బలగాలకు ప్రత్యేక శిక్షణ ఇస్తూ తయారు చేస్తున్నారు. సమాధాన్ ప్రహార్ పేరుతో 2022 నాటికి విప్లవోద్యమాన్ని అంతమొందిస్తామని ఎజెండా పెట్టుకున్నారు. దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలన్నింటిలో హిందూ ఫాసిజం రాజ్యమేలుతుంది.

మోడీ పాలనలో సంఘ్‌పరివార్ శక్తులు పేట్రేగిపోయి దళితులపై, ఆదివాసులపై, ముస్లింలపై, మహిళలపై, ఇతర మతాలపై దాడులు చేస్తున్నారు. గోరక్షణ పేరుతో మూకదాడులు చేస్తున్నారు. ప్రజాస్వామికవాదులను, హక్కుల కార్యకర్తలను అరెస్టు చేసి జైల్లో బంధిస్తున్నారు. "నయా భారత్" నిర్మాణ్ పేరుతో హిందూ రాజ్యాన్ని స్థాపించడమే లక్ష్యంగా మోడీ పాలన కొనసాగిస్తున్నాడు. మేక్‌ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా పేరుతో ప్రచారం చేస్తూ సామ్రాజ్యవాదులను, పెట్టుబడిదారులను ఆకర్షిస్తూ వారికి ఈ దేశ సంపదను దోచిపెడుతున్నాడు.

తెలంగాణ ప్రజలు నీళ్లు, నిధులు, నియమకాలు, ఎన్‌కౌంటర్లు

లేని ప్రజాస్వామిక తెలంగాణ కొరకు దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న తెలంగాణాలో నేడు ప్రజాస్వామిక హక్కులు మాత్రమే కాదు, జీవించే హక్కు కూడా కరువయింది. విద్యా, వైద్యం, పరిశ్రమలకు, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న విద్యార్థులపై, కార్మికులపై, ఉద్యోగులపై, మేధావులపై, హక్కుల నేతలపై, రచయితలు, కళాకారులపై. ప్రజాస్వామిక వాదులపై, ప్రజాసంఘాలను పోలీసు బలగాలతో అణిచివేస్తూ కేసులు పెట్టి జైలుకు పంపిస్తున్నాడు. 16 ప్రజాసంఘాలపై నిషేధం విధించాడు. సంక్షేమ పథకాల్లో అధికారులు, అధికార పార్టీ లీడర్లే అవినీతికి పాల్పడుతున్నారు. గతంలో పోరాడి సాధించుకున్న భూములన్ని ధరణి పోర్ట్ పేరుతో భూములన్ని భూస్వాములకే అప్పజెప్పుతూ రైతు బంధు పథకాన్ని భూస్వాములకే అప్పజెప్పుతున్నాడు. సామ్రాజ్యవాదులు, పెట్టుబడిదారులు ఒప్పందాల ప్రకారమే ప్రభుత్వం రైతులకు ఏ పంట వేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. పండించిన తరువాత గిట్టుబాటు ధర పెట్టడం లేదు. ధరల కోసం, రుణమాఫీ కోసం పోరాడుతున్న రైతులపై లాఠీచార్జీ చేస్తూ అమానుషంగా అరెస్టులు చేస్తున్నాడు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న వారినందరిని మావోయిస్టు ముద్రలు వేసి అరెస్టులు చేసి జైల్లో పెడుతున్నారు. టీఆర్ఎస్ పార్టీ 2వ సారి అధికారంలోకి వచ్చినప్పటి నుండి గత ప్రభుత్వం కంటె అత్యంత క్రూరంగా అణిచివేత కొనసాగిస్తూ ఎస్పీ, డీఎస్పీ, సీఐ, ఎస్ఐలను విప్లవోద్యమ ప్రాంతాల్లో కెటాయిస్తూ వారిని అడవుల్లో తిప్పుతూ డీజీపీ, ఐజీలు జిల్లాలకు వచ్చి వారికి సలహాలు ఇస్తూ బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారు. ప్రశ్నించే గొంతులను నులిమి అరెస్టులు చేసి జైల్లో పెడుతున్నారు. ఆధునిక ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని కొనగోలు చేస్తూ తెలంగాణాలో సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ వ్యవస్థను ఏర్పాటు చేశాడు. పోలీసులలోకి 20 వేల యువతను రిక్రూట్ చేస్తున్నారు.

కరోనాకు సరిపడా బడ్జెట్ కెటాయించకుండా, డాక్టర్లను కెటాయించ కుండా ఏమీ కాదని, బయపడవలసిన అవసరం లేదని గప్పాలు కొడుతూ పోలీసులను ఉపయోగిస్తూ లాఠీచార్జీ చేస్తూ అణచివేశాడు. కరోనా వచ్చిన వారికి వ్యాక్సిన్‌లు, కరోనా కిట్లు అందించకపోవడంతో ఎంతోమంది చనిపోయారు. మావోయిస్టులకు కరోనా వచ్చిందని లొంగిపోతె వైద్యం చేయిస్తానని చెప్పుతూ కా. గంగాల్, కా. గడ్డం మధుకర్ (శోభ్రాయ్)లను అరెస్టు చేసి వైద్యం అందించకుండా అత్యంత క్రూరంగా చిత్రహింసలు పెట్టి హత్యచేసి తమ కపట నీతిని ప్రదర్శించారు.

నూతన ప్రజాస్వామిక భారతాన్ని నిర్మించే దిశగా అడుగుముందుకు వేద్దాం. ఇదే మన ప్రియమైన అమరుల ఆశయం. వారి ఆశయాన్ని తుదివరకు కొనసాగించేందుకు చివరి శ్వాసవరకు విరామం ఎరుగక శ్రమిద్దామని దీక్ష పూనుదాం. ఇదే అమరులకు మనం అర్పించే నిజమైన నివాళి.

ప్రజావీరులు మృత్యుంజయులు!

అమరుల ఆశయాల సాధనకై అంకితమవుదాం!

☆ జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరుల వారోత్సవాన్ని ఘనంగా జరపండి

☆ అమరవీరుల అలుపెరుగని పోరాట పటిమను, ఆదర్శాలను, సాహసాన్ని, నిబద్ధతను అలవర్చుకుందాం, వెలుగెత్తి చాటుదాం!

☆ అమరుల స్వప్నాలను, వారి ఆశయాలను చివరి వరకు కొనసాగిద్దాం!

☆ అమరుల నెత్తుటితో తడిచిన ఎర్ర జెండాను ఎత్తుకొని ముందుకు సాగుదాం!

☆ శత్రువు సాయుధ బలగాలు చేస్తున్న సమాధాన్ ప్రహార్ దాడిని ఓడిద్దాం!

☆ మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వర్ధిల్లాలి!

☆ నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి!

☆ ప్రపంచ సోషలిస్టు విప్లవం వర్ధిల్లాలి!

☆ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) వర్ధిల్లాలి!

విప్లవాభివందనాలతో,
తెలంగాణ రాష్ట్ర కమిటీ,
భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

జూలై 2021

# ప్రకృతి విధ్వంసం వల్లనే కరోనా వైరస్‌లు పుడుతున్నాయి !
# సామ్రాజ్యవాద నిర్మూలనే మానవాళి అస్థిత్వానికి, విముక్తికి మార్గం !
# రాబోయే కరోనా 3వ వేవ్ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి పోరాట ప్రాంతాల్లో పార్టీని, ప్రజలను అప్రమత్తం చేద్దాం !

నేడు కొనసాగుతున్న పెట్టుబడిదారీ-సామ్రాజ్యవాద వ్యవస్థ మానవజాతి ఉనికికి ప్రమాదకరంగా తయారైంది. భయంకరమైన ప్రకృతి విధ్వంసం, శ్రమ శక్తి దోపిడీల మీదా ఇది బ్రతుకుతున్నది. లాభాపేక్ష, స్వార్థం, క్రూరత్వం, విధ్వంసాన్ని కొనసాగిస్తున్న కారణంగా ప్రకృతికి, మానవాళికి తక్షణ ప్రమాదంగా మారింది. ఇది తన చరమ దశలో వుంది. రోజురోజుకు అభివృద్ధి పేరుతో విధ్వంసాన్ని సృష్టిస్తూ, ప్రపంచాన్ని రోగాలతో నింపుతున్నది. ప్రపంచంలోని దళారీ ప్రభుత్వాలు కూడా సామ్రాజ్యవాద విధానాలను అమలు జరుపుతూ అభివృద్ధి అని గావు కేకలు పెడుతున్నాయి. కేంద్రంలోని బీజేపీ పార్టీ, మోడీ సామ్రాజ్యవాదులకు నంబర్-1 ఏజెంటుగా వుంటూ, మన దేశంలో ఆ విధానాలను దూకుడుగా అమలు జరుపుతున్నాడు. సామ్రాజ్యవాద కంపెనీలు లాభాపేక్ష, ప్రపంచ వ్యాప్తంగా ప్రకృతిని భారీ స్థాయిలో విధ్వంసం చేయుట, ఆహారోత్పత్తుల అసహజ, వికృత ఉత్పత్తి పద్ధతుల కారణంగా కరోనా వంటి మహమ్మారులు పుడుతున్నాయని ప్రపంచ వ్యాప్తంగా నేడు ప్రజలంతా అర్థం చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే 2019-20లో 'కరోనా' ఉనికిలోకి వచ్చింది.

మొదటిసారి ఇది పెట్టుబడిదారీ దేశాల్లో పుట్టి, ఆ తరువాత ప్రపంచ వ్యాప్తంగా ప్రబలింది. ముఖ్యంగా నగరాలు, మైదాన ప్రాంతాలలో ఎక్కువ నష్టాన్ని కలిగించింది. పెట్టుబడిదారీ దేశాలలో వైద్య రంగంతో సహా అన్ని రంగాలు ప్రైవేటు కంపెనీల చేతుల్లోనే వున్నాయి. ఇక మన దేశంలో కూడా సామ్రాజ్యవాద విధానాల వలన వైద్యరంగంతో సహా అన్ని రంగాలను కార్పోరేటు కంపెనీలకు ఈ దళారీ ప్రభుత్వాలు అప్పజెపుతున్నాయి. ఈ కారణంగా అటు ప్రపంచ వ్యాప్తంగానూ, మన దేశంలోను మెజారిటీ ప్రజలకు వైద్యం శూన్యం అయింది. కొద్దో గొప్పో ఆదాయాలున్న మధ్యతరగతి వర్గ ప్రజల సొమ్ము అంతా ఆసుపత్రులకే ఊడ్చుకపోయింది. ఈ విపత్కర పరిస్థితుల్లో వైద్యాన్ని కొనుక్కున్నది కొద్ది మందిగా వున్న సంపన్న వర్గాలు మాత్రమే.

ప్రభుత్వాలు కరోనా ప్రబలిన సందర్భంలో ఎక్కువ మంది డాక్టర్ల సేవను ఉపయోగించుకోలేదు. హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించలేదు. కరోనాను ఎదుర్కొనటం కోసం ప్రత్యేక నిధులను కేటాయించలేదు. సర్వరోగ నివారినిగా లాక్‌డౌన్‌ను మాత్రమే ప్రయోగించారు. అపరిమితమైన అధికారాలను పోలీసు వ్యవస్థకు ఇచ్చి ప్రజల మీదకు ఉసిగొల్పారు. మరోవైపున గో మూత్రం, యోగాసనాల ద్వారా కరోనాను ఎదుర్కొవాలని బీజేపీ మరియు మోదీ ప్రచారం చేశారు. 21 రోజుల్లో కరోనా మీద విజయాన్ని సాధిస్తామని బడాయి ప్రచారం చేసిన మోడీ దేశ వ్యాప్తంగా ప్రజల్లో అభాసుపాలయ్యాడు.

2021లో కరోనా రెండవ వేవ్ మరింత ప్రమాదకరంగా వుంటుందనీ శాస్త్ర వేత్తలు, నిపుణులు, డాక్టర్లు ప్రభుత్వానికి హెచ్చరికలు చేశారు. మందులు, డాక్టర్లు, ఆసుపత్రులు, వ్యాక్సిన్లు, ఆక్సిజన్ సిలిండర్లు, మరియు అత్యవసర ఉపకరణాలతో రాబోయే ప్రమాదాన్ని ఎదుర్కొవడానికి ప్రభుత్వానికి సూచించారు. చివరకు సుప్రీం కోర్టు కూడా మొదటిసారి జరిగిన మరణాలు తిరిగి పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మోదీ ప్రభుత్వానికి సూచించింది. ప్రభుత్వ పనిలో జోక్యం చేసుకోరాదని మోదీ ప్రభుత్వం కోర్టుకు మొరటుగా జవాబు చెప్పింది.

ఈ పరిస్థితుల్లో ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలోని బీజేపీ ప్రభుత్వాలు కుంభమేళాలు జరిపి కోట్ల మందిని జమ చేశారు. మత మౌఢ్యం, మూఢ నమ్మకాలను పెంచి ప్రజలను మూర్ఖులుగా మార్చాలని ప్రయత్నించారు. మోదీ, అమిత్‌షాలు బెంగాల్, అస్సాం, తమిళనాడు, కేరళా, పండిచ్చేరిలలో ఎన్నికల ర్యాలీలు జరిపి లక్షలాది మంది ప్రజలను జమ చేశారు. ఈ విధంగా రెండవ వేవ్ మరింత ప్రమాదకరంగా తయారవడానికి అనుకూల పరిస్థితులు కల్పించారు. రెండవ వేవ్‌లో పట్టణాల నుండి గ్రామాలకు, అక్కడ నుండి ఆదివాసీ ప్రాంతాలకు కూడా శర వేగంతో విస్తరించింది.

వైరస్ నివారణ కోసం మొదట రష్యా స్పుత్నిక్-5 అనే వ్యాక్సిన్‌ను విడుదల చేసింది. మోదీ ప్రభుత్వం ఆ రష్యన్ వ్యాక్సిన్‌ని కొనుగోలు చేసి ప్రజలందరికీ టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపట్టలేదు. అమెరికా నుండి మాత్రం లక్షల కోట్ల రూపాయలతో ఆయుధాలు, యుద్ధ సామాగ్రి, హెలికాప్టర్లు, డ్రోన్లు కొనుగోలు చేసింది. ఈ విధంగా మోదీ ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడింది. మరో వైపున సీరం సంస్థ బ్రిటన్ కంపెనీ కలిసి తయారు చేసిన వ్యాక్సిన్‌ను ఆ కంపెనీల ఇష్ట ప్రకారం అమ్ముకోమనీ మోదీ ప్రభుత్వం

అనుమతులిచ్చింది. ఇదే వ్యాక్సిన్ యురోపియన్ దేశాలలో 160 రూ. ధర నిర్ణయించారు. బ్రిటన్‌లో 222 రూ. నిర్ణయించారు. అమెరికాలో 297 రూ. నిర్ణయించారు. మన దేశంలో కోవిషీల్డ్‌కు 300 రూపాయలు, కోవాక్సిన్‌కి 400 రూ.ల ధరలు నిర్ణయించారు. మరల రాష్ట్ర ప్రభుత్వాల కొనుగోల్ల ధరలు, కేంద్ర ప్రభుత్వ కొనుగోలు ధరలు విడివిడిగా నిర్ణయించారు. దేశమంతా ఒకే ధరను నిర్ణయించలేదు. వాస్తవానికి దేశంలోని ప్రజలందరికి ఉచితంగా వ్యాక్సిన్ ఇవ్వగలిగే ఆర్థిక పరిస్థితి ప్రభుత్వానికి వున్నది. వైద్యరంగ యంత్రాంగాన్ని, వైద్య విద్యనభ్యసించిన వారిని, వైద్య రంగంలో డిప్లమా చదివిన వారిని, ఇంకా అనుబంధ విభాగాల సిబ్బందిని రంగంలోకి దింపితే వేగంగా టీకాల కార్యక్రమం కొనసాగేది. జనవరి నుండి ప్రారంభమైన టీకాల కార్యక్రమం నేటికి కూడా 30 కోట్లు దాటలేదు. రోజుకు 18 లక్షల మందికి టీకాలు ఇస్తున్నట్లు ప్రభుత్వం లెక్కలు చెబుతోంది. ఈ మొత్తం విధానాన్ని పరిశీలిస్తే వైద్య రంగంలో వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసమే మోదీ ప్రభుత్వం పని చేస్తున్నది.

మరోవైపున చైనా, వియత్నాం, దక్షిణ కొరియా దేశాలలో మొదటి దశలోనే తక్కువ మరణాలతో కట్టడి చేశారు. రెండవ వేవ్‌ను ముందే ఊహించి దానిని నివారణ కోసం చర్యలు చేపట్టారు. ఎక్కువ మంది ప్రజలకు వ్యాక్సిన్లు ఇచ్చారు. నివారణ చర్యలు చేపట్టారు. జాగ్రత్తలు పాటించడంలో ప్రజలను జాగరూకులను చేశారు. లాక్‌డౌన్ కాలంలో ప్రజల అవసరాలను చాలా వరకు ప్రభుత్వాలు నెరవేర్చాయి.

కరోనా మొదటి రౌండ్‌లో మన ఉద్యమ ప్రాంతంలో ఎవరికీ కరోనా సోకలేదు. దేశంలోని మొత్తం ఆదివాసీ ప్రాంతాల్లోకి కరోనా వ్యాపించలేదనీ ఆనాటి లెక్కలు చెపుతున్నాయి. ఇది వాస్తవం కూడ. కానీ రెండవ రౌండ్‌లో అకస్మాత్తుగా మన ఉద్యమ ప్రాంతంలోకి కరోనా చొచ్చుకు వచ్చింది. ఈ విషయంలో కొద్దిగా ముందే అప్రమత్తంగా వుండి వుంటే కొన్ని నష్టాలను నివారించుకోగలిగేవాళ్లం. ఈ ప్రాంతాలలో ఒక్క మాటలో చెప్పాలంటే ప్రభుత్వ వైద్యరంగమే లేదు. ప్రజలకు కొద్దో గొప్పో వైద్య సహాయం పార్టీ ద్వారానే అందుతున్నది. కొద్ది మోతాదులో గ్రామాల్లోని వనమూలికల వైద్యం కూడా అందుతున్నది. శతాబ్దాల అణచివేత, దోపిడీల వలన ప్రభుత్వాలు ప్రజల విశ్వాసనీయతను కోల్పోయాయి. ఇక ఈ ప్రాంతంలో వచ్చిన వ్యాధి లక్షణాలు ఈ విధంగా వుంటున్నాయి. జ్వరం, శరీరం నొప్పులు, తలనొప్పి, జలుబు, దగ్గు, రుచిలేకపోవడం, తినడం ఇష్టం లేకపోవడం, వాసన గ్రహించే శక్తిని కోల్పోవడం, శ్వాస భారంగా వుండడం మొదలగు లక్షణాలు కనిపిస్తున్నాయి.

ప్రభుత్వం మొదటి నుండి మన ఉద్యమం మీద అణచివేతను కొనసాగిస్తూనే మోసపు ఎత్తుగడలను, దుష్ప్రచారాన్ని చేస్తున్నది. మానసిక యుద్ధాన్ని ఈ సందర్భంగా మరింత తీవ్రతరం చేసింది. కరోనా వ్యాధితో పార్టీ నాయకత్వం చనిపోతున్నారనీ, చాలా మందికి కరోనా వచ్చిందనీ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నది. వైద్యం కోసం కార్యకర్తలను బయటకు రానీయకుండా పార్టీ నాయకత్వం అడ్డుకుంటుందనీ ప్రచారం చేస్తున్నది. ఈ పరిస్థితి శత్రువుకి ఆనందాన్ని కలిగిస్తున్నది. 40 సంవత్సరాలుగా సాయుధ బలగాలు చేయలేని పనిని సామ్రాజ్యవాదులు సృష్టించిన కరోనా మనలను నిర్మూలించాలని ఆశపడుతున్నాడు. మనలను లొంగిపోయి వైద్యం చేయించుకోమనీ పదేపదే ప్రకటనలు ఇస్తున్నారు. శత్రువు తలపెట్టిన మానసిక యుద్ధాన్ని కరోనా వ్యాధిని, శత్రు దాడులను తిప్పికొట్టడానికి మనం మానసికంగా దృఢంగా తయారవ్వాలి. పరిస్థితుల్లో వచ్చిన మార్పును పసిగట్టాలి. భౌతిక వాస్తవాలపై ఆధారపడి మన కార్యక్రమాన్ని రూపొందించుకోవాలి. మిగిలిన జబ్బులకు ఏ విధంగానైతే మనం వైద్యం చేయించుకుంటున్నామో అదే విధంగా కరోనా వ్యాధికి కూడా వైద్యం చేయించుకోగలం. దాని కోసం లొంగిపోవాల్సిన అవసరం లేదు. కరోనా వ్యాధి నుంచి తప్పించుకోవడానికి లేదా వైద్యం కోసం లొంగిపోవాలని పోలీసు అధికారులు పదేపదే చెప్పడాన్ని మనం ఏ విధంగా అర్థం చేసుకోవాలి? ఇది వారి దివాళకోరు తనానికి, చేతగాని తనానికి నిదర్శనం మాత్రమే. ఈ సందర్భంలో కొన్ని విషయాలను గుర్తు చేసుకుందాం. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఇప్పటికే 4 లక్షల 90 వేల మంది ప్రజలు కరోనా వలన చనిపోయారు. వీరిలో ప్రముఖులు, మంత్రులు, రాజకీయ నాయకులు, వేల సంఖ్యలో పోలీసులు కూడా చనిపోయారు. ఇంకా సామాజిక కార్యకర్తలు, ప్రజాపక్షం వహించే మేధావులు, ప్రజాసంఘాల నాయకులు కూడా దీని వలన చనిపోయారు. 1400 మంది డాక్టర్లు కూడా కరోనా బారిన పడి చనిపోయారు. లక్షల మరణాలు వారి కండ్ల ముందే జరుగుతుంటే ప్రభుత్వం కానీ పోలీసు అధికారులు కానీ ఆ మరణాలను ఎందుకు నివారించలేకపోయారు? లొంగిపోతే కరోనా నుంచి ప్రాణాలు కాపాడుకోండని ప్రకటించంలోని దివాళకోరుతనాన్ని మనం బహిర్గతం చేసి ప్రచారం చేయాలి. వైద్యం కోసం హాస్పటల్‌కు పంపించిన కామ్రేడ్ గంగాల్‌ని, కామ్రేడ్ శోభరాయ్‌ని పట్టుకుని హత్యచేసి కరోనా వ్యాధితో చనిపోయారని ప్రచారం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 40 లక్షల మంది చనిపోయారు. ఇంకా ఆ పరంపర కొనసాగుతూనే వుంది. ప్రపంచవ్యాప్తంగా 17 కోట్ల 75 లక్షల మందికి ఈ వ్యాధి సోకిందనీ రాయిటర్ సంస్థ తెలిపింది. మరణాలు, కేసుల విషయంలో అమెరికా, బ్రెజిల్, ఇండియా ముందు వరుసలో వున్నాయి. కొమ్ములు తిరిగిన పెట్టుబడిదారీ దేశాలు కూడా ఈ మరణాలను అడ్డుకోలేకపోయాయి. దీనిని బట్టి ఈ సామ్రాజ్యవాద వ్యవస్థ, దానిలో భాగమైన మన దేశంలోని ప్రభుత్వ వ్యవస్థ ఘోరంగా విఫలమైపోయాయని అర్థమవుతున్నది. ఈ విఫలతనే సఫలతగా

ప్రచారం చేసుకునే అతి తెలివితేటలు ప్రభుత్వ నాయకులకు, పోలీసు అధికారులకు మెండుగా వున్నాయి.

కరోనా వల్ల మనం నష్టపోతే ఈ ప్రాంతాలను తేలికగా ఆక్రమించుకొని వారి దోపిడీని యదేచ్ఛగా కొనసాగించవచ్చని వారి ఆలోచన. అందుకనే పదేపదే పోరాటాలను విరమించమనీ ప్రజలకు ప్రభుత్వ అధికారులు, పోలీసు అధికారులు చెపుతున్నారు. పోరాటాలు, విప్లవోద్యమం లేకపోతే ప్రజల అస్థిత్వానికే ప్రమాదం ఏర్పడుతుంది. ప్రజల రోజువారీ సమస్యలపై, విస్థాపన, నిర్బంధం, బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాటాన్ని కొనసాగించాలి. కొరోనా వ్యతిరేక పోరాటాన్ని ఈ పోరాటాలతో సమన్వయించాలి.

కాబట్టి భౌతిక వాస్తవికతను అర్థం చేసుకుని దాని కోసం సరైన, స్పష్టమైన, నిర్దిష్ట కార్యక్రమాన్ని రూపొందించుకోవాలి. ఇది కూడా ఒక యుద్ధంలా భావించాలి. నాయకత్వాన్ని, కార్యకర్తలను, ప్రజలను కాపాడుకునే కార్యక్రమాన్ని తీసుకోవాలి. యుద్ధంలో ఎలాగైతే కొన్ని నష్టాలు వుంటాయో శత్రువుతోను, కరోనాతోను జమిలిగా పోరాడుతున్న ఈ యుద్ధంలో కూడా అనివార్యంగా కొన్ని నష్టాలు ఉండవచ్చు అని మానసికంగా మనం ముందే తయారవ్వాలి. ఆ మానసిక స్థైర్యంతో, పోరాట పటిమతో, దృఢ సంకల్పంతో, మాలెమా సిద్ధాంత మార్గదర్శకత్వంలో ముందుకుపోయి విజయాన్ని సాధించుకోగలుగుతాం.

గతంలో కూడా మనం శత్రువు తలపెట్టిన అభియాన్లను ఓడించి అనుభవాన్ని సంపాదించాం. నేటి 'సమాధాన్-ప్రహార్' దాడిని ఎదుర్కొంటూ పోరాడుతున్నాం. ఈ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అందరం ఐక్య మనసుతో ఒక్క త్రాటిపై నిలిచి ఈ కార్యక్రమాన్ని అమలు జరుపాలి. ఇది సామ్రాజ్యవాదానికి దళారీ పాలక ప్రభుత్వాలకు వ్యతిరేకంగా సంధించబడిన ఒక రాజకీయ కార్యక్రమం. దీనిని అన్ని స్థాయిల కార్యకర్తల వరకూ ఒకే రకంగా అర్థం చేసుకుని ప్రజల్లోకి తీసుకెళ్ళి అమలు జరుపాలి. ప్రజల రాజకీయ చైతన్యాన్ని పెంచాలి. ఈ ప్రభుత్వ వ్యతిరేక పోరాటంలో భాగంగా మన ప్రజా పునాదిని మరింత విస్తృతపరుచుకోవాలి. దీనిని ఒక ప్రజాందోళనగా ఒక మలుపు తిప్పాలి. మరోవైపున జాగ్రత్తలు, పరిక్షలు, త్వరితగతిన వైద్యం అనే పాలసీని అమలు జరుపుతూ మొత్తం పార్టీ అంతటా కొత్త పద్ధతులతో కూడిన నూతన జీవిన విధానాన్ని అమల్లోకి తేవాలి.

ఇది ఆరోగ్య రాజకీయ కార్యక్రమం. కరపత్రాలు, పోస్టర్ల ద్వారా ప్రచారం చేయాలి. ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచారం చేయాలి. పార్టీని, ప్రజలను కాపాడుకొనేందుకు పోరాటమే మార్గమనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకొని వెళ్ళాలి. పోరాటం ద్వారానే సామ్రాజ్యవాద దూకుడును, పర్యావరణ విధ్వంసాన్ని నిరోధించగలమనే విశ్వాసాన్ని ప్రజలకు అర్థం చేయించాలి. ఈ పోరాటానికి పర్యావరణ వాదుల, విశాల ప్రజల మద్దతును కూడగట్టుకోవాలి. మన ఉద్యమ ప్రాంతంలోను వెలుపల గల విద్యార్థి యువజనులను ఈ కార్యక్రమంలో కలుపుకోవాలి. మధ్యతరగతి, ధనిక, స్థానిక రాజకీయ నాయకులను కూడా ఈ కార్యక్రమంలో కలుపుకురావాలి. సైంటిస్టులు డాక్టర్లు, ప్రముఖులు, పర్యావరణ వాదులు, విశాల ప్రజలంతా ఈ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఎందుకు పోరాడుతున్నారో మీడియాకు చెప్పాలి. కరోనా వ్యాధిని నివారించడంలో మోదీ ప్రభుత్వం కానీ, రాష్ట్ర ప్రభుత్వాలు కానీ ఘోరంగా విఫలమయ్యాయనీ, ప్రజలను పాలించే అర్హతను కోల్పోయారని వివరించాలి.

రాజకీయ ప్రచారం, జాగ్రత్తలు, మందులు చికిత్స పద్ధతులను మొత్తం పార్టీలో అమలు జరుపుతూ ప్రజల్లోకి తీసుకెళ్లాలి. దీని కోసం ఈ క్రింది డిమాండ్లను ప్రచారం చేయాలి.

1. ఉచితంగా ప్రజలందరికీ వ్యాక్సిన్ వేయాలి.

2. టెస్ట్ కిట్ల ద్వారా ప్రజలందరికీ పరిక్షలు చేయాలి.

3. చదువుకున్న స్థానిక విద్యార్థి యువజనులకు కరోనా పరిక్షల పద్ధతి మీద శిక్షణనివ్వాలి.

4. ఎస్ఏబీ కిట్లను సరఫరా చేయాలి.

5. మాస్కులు, సానిటైజర్లు, నెబిలైజర్లు, సరఫరా చేయాలి.

6. ఒక్కొక్క పంచాయతికి మొబైల్ పీహెచ్సీలను ఏర్పాటు చేయాలి.

ఇది ఆరోగ్య సమస్యతో కూడుకున్న రాజకీయ కార్యక్రమం. దీనిలో మనం క్రమశిక్షణ కలిగిన రాజకీయ కార్యకర్తలుగా మావోయిస్టు సైనికులుగా పోరాడి విజయాన్ని సాధించాలి. మార్క్సిస్టు మహోపాధ్యాయులు చెప్పినట్లుగా ఉత్పత్తినీ, విజ్ఞానాన్నీ, దాని ఫలితాలను, ప్రజలందరికీ అందుబాటులో తెచ్చి, మత మౌఢ్యాన్ని, మూఢనమ్మకాలను పారదోలి సర్వమానవ సమానత్వాన్నిచ్చేదే సోషలిజం-కమ్యూనిజం. ఇది వచ్చిననాడు - వ్యక్తిగత ఆస్తి, లాభాపేక్షా, కరోనా వంటి మహమ్మారులు అంతమవుతాయి. దాని కోసం పోరాడి విజయాన్ని సాదిద్దాం.

1. ప్రభుత్వ దుర్మార్గాన్ని బట్టబయలు చేద్దాం-కరోనాను నివారిద్దాం !

2. పార్టీలో, ప్రజల్లో జాగరూకతను పెంచుదాం-కరోనాను నివారిద్దాం !

3. ప్రజా పునాదిని బలోపేతం చేద్దాం !

4. పీఎల్జీఏ ను బలోపేతం చేద్దాం !

5. పోరాటాన్ని జోడిస్తూ కరోనా వ్యతిరేక వర్గపోరాటాన్ని ప్రజాయుద్ధాన్ని తీవ్రం చేద్దాం - విస్తృతం చేద్దాం ! ☆

అమర వీరులకు
జోహార్లు

అమరుల
త్యాగాల బాటలో
నడుద్దాం!

అమరుల
ఆశయాలను
కొనసాగిద్దాం









2021 జూలై 30న తుమ్మెడంలో కా. లక్ష్మదాద, కా. ప్రకాశ్‌దాద, కా. భారతక్కతో పాటు మరో 11 మంది అమరవీరుల స్తూప ఆవిష్కరణ జరిగింది.

## 2021 సెప్టెంబర్ 21 నుండి దేశవ్యాప్తంగా మన పార్టీ 17వ వార్షిక వారోత్సవాలను విప్లవోత్సాహంతో, దృఢ సంకల్పంతో నిర్వహించండి !

☆ విప్లవ ప్రతీఘాతుక వ్యూహాత్మక "సమాధాన్-ప్రహార్" దాడులను ఓడించే లక్ష్యంతో క్యాంపెయిన్‌ను కొనసాగిద్దాం!!

☆ పార్టీని శత్రువుకు అభేద్యమైన, బలమైన రహస్య పార్టీగా తీర్చి దిద్దండి! వర్గపోరాటాన్ని, ప్రజాయుద్ధాన్ని విస్తృతం చేద్దాం!

☆ సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు, భూస్వాములకు వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని, గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం!

☆ అధ్యయనం మీద శ్రద్ధ పెడదాం! దేశంలో, రాష్ట్రంలో అన్ని రాజకీయ ప్రక్రియలను, ప్రజల ఆందోళనల్లో పార్టీ రాజకీయ జోక్యాన్ని పెంచుదాం!

☆ బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిస్టులకు వ్యతిరేకంగా విశాల ప్రాతిపదికన బలమైన ఉద్యమాలను నిర్మాణం చేద్దాం!

☆ ప్రజాస్వామిక స్వయం ప్రతిపత్తి ప్రాంతాల ప్రత్యేక రాష్ట్రాల కోసం కొనసాగుతున్న ఆదివాసీ ఉద్యమాలను సమర్థిద్దాం! ప్రత్యేక గోండ్వానా రాష్ట్రానికి మద్దతు ఇద్దాం!


☆ రాజకీయ ఖైదీలను బేషరతుగా-విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేద్దాం!

విప్లవాభివందనాలతో
తెలంగాణ రాష్ట్ర కమిటీ
సీపీఐ (మావోయిస్టు)

## నక్సల్బరీ తరం నాటి కమ్యూనిస్టు విప్లవకారుడు, సీపీఐ(మావోయిస్టు) కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ పూర్ణేందు శేఖర్ ముకర్జీ/అంబర్ దా/గగన్ దా, వయస్సు, అనారోగ్యం కారణాలతో కలత్తాలో అమరుడైనాడు. కేంద్రకమిటీ ఆయనకు అరుణారుణ జోహార్లు చెపుతోంది!

ప్రియమైన ప్రజలారా!

మా పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు, నక్సల్బరీ మొదటి తరం విప్లవ కమ్యూనిస్టు కామ్రేడ్ పూర్ణేందు శేఖర్ ముకర్జీ/అంబర్ దా/గగన్ దాదా 75 సంవత్సరాల వయస్సులో శ్వాసకోశ సంబంధిత వ్యాధితో ఆగస్టు 7వ తేది, 2021 కలకత్తా నగరంలో అమరుడయ్యాడు. కేంద్రకమిటీ ఆయనకు తలవంచి వినమ్రంగా జోహార్లు చెపుతున్నది. ఆయన ఆశయాన్ని తుదకంటా కొనసాగిస్తామని శపథం చేస్తోంది. ఆయన కుటుంబ సభ్యులకు, మిత్రులకు మా సహానుభూతిని, సంతాపాన్ని తెలియజేస్తున్నాం. కామ్రేడ్ పూర్ణేందు శేఖర్ ముకర్జీ పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర 24 పరగణ జిల్లాలో జన్మించాడు. 60వ దశకంలో వచ్చిన మహత్తర నక్సల్బరీ ఆందోళనకు ప్రభావితులై విప్లవోద్యమంలో చేరాడు. సీపీఎమ్ పార్టీలో వుండి వారి రివిజనిస్టు విధానాలకు వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటం చేశాడు. చిన్న వయస్సులోనే 1969లో ఏర్పడిన ఎమ్‌సీసీలో చేరాడు. ఆయన తన విప్లవ ప్రారంభ దశలో విద్యార్థులు, కార్మికుల్లో పని చేశాడు. బీహార్-పశ్చిమ్ బెంగాల్/స్పెషల్ ఏరియా కమిటీ కాంక్షా, బుద్‌బుద్, హజారిబాగ్ ప్రాంతాల్లో వ్యవసాయ విప్లవ కార్యక్రమాన్ని అమలు జరుపుతూ దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని ఎత్తిపడుతూ గెరిల్లా యుద్ధాన్ని అభివృద్ధి చేశారు. దీనిలో అంబర్ దా తన పాత్రను పోషించాడు. ఉద్యమంలో ఆయన అభివృద్ధి చెందుతూ పశ్చిమ్ బెంగాల్ రాష్ట్రకమిటీ సభ్యుడిగా ఎదిగాడు. వర్గ పోరాటానికి నాయకత్వం వహిస్తూ, పార్టీ యొక్క రాజకీయ, మిలటరీ లైన్‌లను విశాల ప్రజల్లో నిరంతరం అర్థంచేయించాడు. మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంతం పట్ల అచంచల విశ్వాసాన్ని ప్రకటించాడు. 1998-99లో పొడచూపిన కొన్ని సమస్యలు, అభిప్రాయ భేదాల వలన కొద్ది మందితో విప్లవ కమ్యూనిస్టు మావోయిస్టు) కేంద్రాన్ని ఏర్పరిచాడు. వాస్తవానికి ఎమ్‌సీసీతో రాజకీయ, సిద్ధాంత పరమైన విషయాలలో విభేదాలు ఏమి లేవు గతంలోని సమస్యలను పరిష్కరించుకొని 2003లో విప్లవ కమ్యూనిస్టు కేంద్రాన్ని విలీనం చేసి ఆ పార్టీ కేంద్రకమిటీలోకి వచ్చాడు.



2004లో సీపీఐ (ఎమ్.ఎల్)(పీపుల్స్‌వార్) మరియు ఎమ్‌సీసీఐలు కలిసి సీపీఐ(మావోయిస్టు) పార్టీగా ఏర్పడినప్పుడు, నూతన పార్టీ కేంద్రకమిటీ సభ్యుడయ్యాడు. ఛత్తీస్‌గఢ్‌లో విప్లవ ఉద్యమాన్ని సంఘటితం చేసే బాధ్యత నిచ్చినప్పుడు కేంద్రకమిటీ సభ్యునిగా ఆ బాధ్యతను తీసుకున్నాడు. ఇదే క్రమంలో పట్టణోద్యమ నిర్మాణ బాధ్యతలు స్వీకరించాడు. అర్బన్ సబ్‌కమిటీలో ఆయన కొనసాగి ఆందోళనకు నాయకత్వం వహించాడు. 2005 నుండి 2008 వరకు ఛత్తీస్‌గఢ్‌లో కొనసాగిన సల్వాజుడుంకు వ్యతిరేకంగా ప్రచార-ఆందోళన కార్యక్రమానికి నాయకత్వం వహించాడు. దేశ వ్యాప్తంగా సల్వాజుడుంకు వ్యతిరేకంగా అనేక శక్తులను కూడగట్టి సల్వాజుడుం ఓటమికి సాయశక్తుల కృషి చేశాడు.

కార్మిక, రైతు, విద్యార్థి, యువత, మహిళా ఆందోళనల నిర్మాణానికి కృషి చేశాడు. మహిళల మీద రాజ్యహింస, గృహ హింసలకు వ్యతిరేకంగా ఆందోళన నిర్మించడానికి ఎంతో కృషి చేశాడు. విస్థాపన సమస్య, ప్రత్యేక ఆర్థిక జోన్లకు వ్యతిరేకంగానూ, ఆదివాసీ, దళితుల సమస్య మీద ప్రజా ఉద్యమాలు నిర్మించడానికి కృషి చేశాడు. చారిత్రక లాల్‌గఢ్ ఆందోళనకి మద్దతుని కూడగట్టడం కోసం వివిధ సెక్షన్ల ప్రజలను, ప్రజాస్వామిక వాదులను, ప్రగతిశీల శక్తులను కలిపి ఐక్య సంఘటన నిర్మాణానికి కృషి చేశాడు.

2011 ఏప్రిల్ 29న బీహార్‌లోని కటిహార్ జిల్లాలో, బర్సోయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక గ్రామంలో బీహార్ ఎస్‌టీఎఫ్ పోలీసులు

(మిగతాది 32వ పేజీలో....)